శ్రీ కళాభిలాషక కావ్యమాలిక.

సంపాదకుడు,

మానేపల్లి రామచంద్రశాస్త్రి.

జ య దే ప్ర ౧౩ ※.

(విషాదాంతనాటకము.)

జయంతజయపాలాది గ్రంథకర్త,

ఆకెళ్ల సత్యనారాయణచే

రచింపబడి

విశాఖపట్టణము

విజయరామచంద్ర ముద్రాక్షరశాలలో

ముద్రింపబడియె.

1915

[వె,] -0.

శ్రీ

కళాభిలాషక కావ్యమాలిక.

నిత్యపోషకులు.

కీర్తిశేషులైన చిన్నకోట అప్పలనరసింహులు సెట్టిగారు,
విశాఖపట్టణము.

మ. రా. రా. బొడ్డు రామయ్యసెట్టిగారు, ,,
కీర్తిశేషులైన అరుట్ల రామదాసునాయుడుగారు ,,
మ. రా. రా. శ్రీరంగాల వేంకటరమణయ్యసెట్టిగారు ,,
బూరి జగన్నాయకులు నాయుడుగారు, హైదరాబాదు.
శ్రీసుబ్రహ్మణ్యవిలాస హిందూనాటకసమాజమువారు, మునగపా

నిత్యసహాయకులు.

మ. రా. రా. వరిగొండ వేంకటనరసింహముపంతులుగారు,
మునగపాక.
,, త్రిపురాన శ్రీనివాసరావునాయుడుగారు,
విశాఖపట్టణము.
,, తోట రాజయ్యసెట్టిగారు, సిరువంచ.
,, రావుబహద్దరు కేసానపల్లి నరసింహారావుపంతులు
గారు, విశాఖపట్టణము.

శాశ్వతపు చందాదారులు.

మ. రా. రా. పుర్రె చినస్వామినాయుడుగారు, అనకాపల్లి.
రావులపాటి హనుమంతరావుపంతులుగారు,
సికిందరాబాదు.
ప్రభల వేంకటసుబ్బారావుగారు. [illegible]
నందుల బాలయ్యగౌడుగారు,
శానుకర్తి రాయన్నగౌడుగారు,
నడుమెట్ల పాపయ్యగౌడుగా

సంపాదకీయ పీఠిక.

ఈ 'జయదేవ' మాకావ్యమాలికలోని పదుమూడవ పుష్ప ము; ఎనిమిదవనాటకము. విషాదాంతనాటకములలో రెండవది. విషాదాంతనాటకము ననుసరించి వ్రాసినదగుటచే ఇదియును అట్టిదిగానే ఉంచుట తగు.

ఇది మా శ్రీకలాభిలాషక సమాజములో చేరిన బ్రహ్మశ్రీ ఆకెళ్ల సత్యనారాయణకవి విరచితము. మాసమాజనాటకశాఖవారు మూడుపర్యాయములు ప్రదర్శించఁగా మెప్పునొందినది. వీలగునంతవఱకు గ్రంథకర్తకు ప్రోత్సాహము కలిగింపవలసి ఉండుటచే సంతోషపూర్వకముగా మాకావ్యమాలికలో చేర్చుకొనఁబడియె.

భాషాభిలాషకులకు ఆమోదము కలిగించుచు, ఇది ఆంధ్రదేశమున వ్యాపించి గ్రంథకర్తకు పేరుతెచ్చుచు, తాను వన్నెగాంచుఁగాక.

ది 8-3-15,
విశాఖపట్టణము.

మారేపల్లి రామచంద్రశాస్త్రి.

పీఠిక.

విశేషవిషాదాంతంబగు ఈజయదేవునాటకమును నేను, మహాకవి షేక్స్పియర్ వ్రాసిన, 'ఒథెల్లో,' అను నాటకరాజమును కొంతవఱ కనుసరించియు, కొంత కల్పించియు, కొంత తగ్గించియు 1911 సంవత్సరాంతమున వ్రాసితిని. కాన, ఇది భాషాంతరీకరణముమాత్రము కాదు.

నేను శ్రీకలాభిలాషక సమాజమందు చేరియుండుటచే, అందలి నామిత్రులందు కొందఱు, సంగీతజ్ఞానము తగినంత లేనివారు, కథానాయకాదివేషములు వేయవలయునను ముచ్చట తమకు కలదని నాతో పలుసార్లు ముచ్చటించుటచేత, వారికోరిక తీర్పనెంచి ఈనాటకమును చాలవఱకు వచనరూపముగనే వ్రాసితి. పిమ్మట తత్సమాజాధిపతులగు బ్రహ్మశ్రీ మా కేపల్లి రామచంద్రశాస్త్రిగారు దీనిని దయతో ప్రదర్శింపించుట కంగీకరించి, రెండుమూడుసార్లు ప్రదర్శింపించిరి.

హూణకవిసార్వభౌముని మహానాటకములను గ్రహించునంతటి భాషాజ్ఞానము నాకు లేకున్నను, ఆంగ్లేయనాటకకథలను మనదేశాచారాదుల కనుగుణ్యముగ మార్చి తెనుఁగున వ్రాయవలెనను అభిలాషచే దీనిని వ్రాయ సాహసించితిని. దీనిని వెంటనే ప్రచురింపవలెనని నా కెంతకుతూహల మున్నను, ఈప్రాంతమున తద్విషయమై సాయముచేయు భాషాభిమాను లరిది అగుటచేతను, నా జయంతజయపాలనాటకము అమ్ముకొని లాభముపొందిన

వారైనను నాకీవిషయమున సాయమింతవఱకును చేయకపోవుట చేతను, కొంత ఆలస్యమైనది. కాని, ఇప్పటికి దైవానుగ్రహమువలన క్రొత్తగా సుమారు 60 పద్యములుకూడ చేర్చి ప్రచురింపఁజాలితిని. ఇట్టినాటకములింక కొన్ని వ్రాయవలెనను అభిలాష నాకున్నను, పైకారణములవలన కలిగిన నిరుత్సాహమున ఇప్పటికి మానుకొంటిని. ఇట్టిగ్రంథములందు సౌలభ్యమావశ్యకమగుటచేత ఇందు చాలవఱకు గద్యపద్యములందు సంధులు విడఁదీసితి. రగడలయందు ప్రాసయతియు వాడుకచేసితిని.

నాతక్కిన గ్రంథములవలెనే దీనినికూడ తమకావ్యమాలికలో చేర్చుకొని వీలగుప్రోత్సాహము చేయుచున్న మద్గురువరుని వాత్సల్యౌదార్యాదిసుగుణంబులు జగద్విదితంబులై వెలయుచుండ నే నిట వక్కాణింపనేల?

నలుగురును చదివి ఆనందించుటకే దీని ప్రచురించితిని. కాన, ఇందు లేనిపోని నెఱసులేరి సంతసించినను, మంచిని గ్రహించి సంతోషించినను నాకు సంతోషమే.

విశాఖపట్టణము
8—4—15 } అకెళ్ల సత్యనారాయణ.

పాత్రములు.

పురుషులు.

హర్షసాగరుఁడు—విదిశాపురరాజు (Duke of Venice)

త్రివిక్రమవర్మ—రాజసభా సభ్యుఁడు (Brobantio)

జయదేవు—సేనాని (Othello)

కేశవవర్మ—సైన్యోద్యోగి (Casio)

హాయగ్రీవుఁడు— ,, (Iago)

రాధాకాంతుఁడు—ఒక సామంతుఁడు (Roderego)

మహేశవర్మ—సైన్యోద్యోగి (Montano)

మహేంద్రవర్మ—త్రివిక్రముని తమ్ముఁడు (Grationo)

లక్ష్మణవర్మ— ,, బంధువుఁడు (Lodavico)

మఱికొందఱు భటులు, జాలరులు, సభ్యులునుందురు.

స్త్రీలు.

మృణాళిని—త్రివిక్రముని కూఁతురు (Desdemona)

హేమాంగి—హాయగ్రీవుని భార్య (Emilla)

మాణిక్యము—కేశవుని ఉంపుడుకత్తె (Bianca)

Venice=విదిశాపురము; Cypress=సర్పద్వీపము.

☞ గ్రంథకర్త అనుమతిలేనిది ఈనాటకము ఎవరును ఆడకూడదు.

శ్రీ

జయదేవు

నాంది.

శ్రీ రమణీమణీహృదయ
సింధుసుధాంశుఁడు, భక్తమానసా-
గారవిహారకాముఁడు, జ
గన్నుతనాముఁడు, నీలనీరదా-
కారుఁడు, కామినీనికర
కాముఁడు, సత్కరుణాభిరాముఁడౌ
శ్రీరఘురాముఁడోముత వి
శేషదయన్ సుజనాళిఁనిచ్చలున్.

ఉ. ఎల్లెడనుండువాఁడెచట ఎప్పుడుఁ కన్బడకుండువాఁడు, మేల్
పెల్లగుసృష్టిచిత్రముల లేఁడని చెప్పుట తప్పటంచు వే-
నోళ్లను సాటువాఁడు,సుగుణుండగు ఈశ్వరుఁడెప్పుడున్ దయన్
చల్లనిచూపులన్ కనుచు సౌఖ్యముకూర్చుత లోకపాళికిన్.

కన్నడ—చాపు.

శరణుహరా! పరా!- శరణు లోకేశ్వరా!
నిరామయా! నిన్నే- నెమ్మదిని నమ్మినాము॥ శర॥
దారితప్పిఉన్నారము- భారమునీపై వేసినాము
పతితమమ్ములమంచి- దారిఁ జేర్చెదవో దేవ॥ శర॥
పరులనిందాస్తోత్రముల్- పాటింపకుండుబుద్ధి
వరకళాఢ్యసంఘపాల!- భక్తలోల! మాకీయవే॥ శర॥

శ్రీ

జయదేవ

ప్రథమాంకము.

ప్రథమరంగము—రాజమార్గము.

[సైన్యోద్యోగి అగు హయగ్రీవుఁడు ప్రవేశించును.

హయ—(తనలో) చా! నాకెంతమాత్రము ఇష్టములేదు. ఇట్టిఅసందర్భము నేనెక్కడను కనివిని ఉండలేదు. రూపయౌవనకులసంపదలందు రవంతయు వెనుకరాని సామంతుల కుమారరత్నంబులు అనేకులు అనుదినంబును పెండ్లాడరాఁగ వారినెవ్వరిని కన్నెత్తిచూడదాయె! అందుచే ఎట్టివరయోవిలాసవంతుని వరించునో అని జనులందఱును ఆతురతతో చూచుచుండ, 'తుదకబ్బెరా తురకబాస' అనునటుల పగలుచూచిన రాత్రి కలలోనికివచ్చి కలవరపెట్టుకొండముచ్చును బోయవానిని వరించినదఁట! ఔరా! ఏమి ఆమగువతెగువ! తెలివితక్కువ! ఎత్తి ఎత్తి వేయి కాలెంగిలాకుపై పడినట్లు, ఉండి ఉండి, ఎంచి ఎంచి, ఒకకాలుదున్న పోతునా రహస్యంబుగ చేపట్టినది! ఓసీ! మృణాళినీ!

చ. కనులనుక్రమ్మెనో పొరలు! జ్ఞానముసర్వముసూన్యమాయెనో!
మనసుచలించెనో! మరులు మందుప్రభావమొ! ఓర్వలేని దు-
ర్జనములప్రోద్బలంబొ!విధివ్రాలొ!అమాయకురాల!కొండకోఁ-
తినేవరించినావు; కడ తేర్చితివా కుల గౌరవం?బిసీ!

ఇంతకు ఆఁకలిరుచియు వలపురూపును అరయవుకదా!......ఈకంత శోధనాకెందుకు? ఎవరు ఎవరిని పెండ్లాడిననాకేమి? కాని ఆమూర్ఖ శిరోమణి రాధాకాంతుఁడు నన్ను శనివలెపట్టుకొని తనకు ఆమృణాళినిని ఏలాగైన కూర్చుమని పీడించుచున్నాఁడు. ఎంతద్రవ్యమైన తద్విషయమై వ్యయము చేయ సిద్ధముగా ఉన్నాఁడు. ఆవిపరీత మోహాంధుని కంటికి నేను కుంటెనకానివలె కనఁబడుచున్నాను కాఁబోలు? (పండ్లుకొఱుకుచు) కాసునకాసించి కార్యగుల్లవని చేయుటకు నేను జాతినీతులును మానాభిమానములును లేని ఆకేశవవర్మవంటివాఁడనని భావించుచున్నాఁడు. వానికంటికి ఎంతనీరసముగా కనిపించుచున్నాను! ......మంచిది. వానినితీపిమాటల పొంగించి ఆశచూపి చల్లచల్లగ సొమ్మంతయులాగి తుదకు వాని ప్రాణవాయువులను పీల్చివేసి నాకసితీర్చుకొనెదను. మఱియు,

గీ. లోకమంతయు ధనముకు లోకువగును;
ధనవిహీనునిచేరదు దయ్యమైన;
కాన విత్తమార్జింపఁగా పూనవలయు;
పాపపుణ్యంబు లనుమాట వదలిపెట్టి.

సావేరి—ఆదితాళము.

రాధా—(లోపల) ధన్యుఁడ ధన్యుఁడ - ధన్యుఁడనైనాఁడ।
కన్యాశిరోమణి - కనఁబడెఈవేళ॥ ధన్యుఁడ॥

నాయ—అడిగో ఆవెఱ్ఱిమొఁగము వచ్చుచున్నాఁడు.

[రాధాకాంతుఁడు పాడుచు ప్రవేశించును.]

రాధా—(సంతోషముతో) ఆహా! మిత్రమా! (కౌఁగిలించుకొని)
"ధన్యుఁడ........ఈవేళ"

నాయ—ధన్యుఁడవైతివా? సంతోషమే. ఆమాటవినుటచే నేనును ధన్యుఁడనైతి. స్వాంతముగా జరిగినసంగతి అంతయు చెప్పుము.

రాధా— కన్నారఁ జూచితిన్ - అన్నులతలమిన్నన్;
ఎన్నఁగ చాల ఆ - చిన్నారి పొన్నారి॥ ధన్యుఁడ॥

హాయ— కనువందు వైనదికదా. ఆ ఎన్నెలాడి నీకంటికినచ్చినదా? లేదా?

రాధా— ఎప్పటికైన, ఆ - ఒప్పులకుప్పనే
తప్పక పెండ్లాడి - ధన్యత గాంచెదన్॥ ధన్యుఁడ॥

హాయ— సెబాసు! నేస్తమా, సెబాసు! నిదృఢనిశ్చయమునకు నేనెంతయు సంతసించుచున్నాను. నీవు ఈమాట తప్పవద్దుసుమీ.

రాధా— ఎంతమాటాడినావు! కులపర్వతములకైన చలనముండును; కాని, నామాటకు లేదు. ననుఁగూర్చి ఆసుందరాంగితో మాటాడినావా? లేదా?

హాయ— రాధాకాంతా! నీగురించి నేనెంత కష్టపడుచున్నానో ఆ రాధాకాంతునకే యెఱుక. మున్ముందు తెలియగలదు... నేఁటిఉదయముననే లేచి అమ్మాయికడకేగి, నీరూపలావణ్యాతిశయములను అతిశయోక్తిని అతిశయించునట్లు వర్ణించితిని.

రాధా— బళే! బళే! నారీమణుల నోడించు నామినములమాట.

హాయ— అది మఱచిపోదునా? నవయౌవనరాజ్యలక్ష్మివిజయధ్వజంబులనఁ జెల్లు రాధాకాంతుని మిసమిసలాడు మేల్మీసలపసందు చూచి ఎందఱో మందయానలు మోహాకలింపిరి- అనిచెప్పఁగానె ఆమె మతిపోయినది.

రాధా— వారెవా! ఏమినీసమయోచితవాక్స్ఫూర్తి! ఆశుకవితాశక్తి! తరువాత, తరువాత.

హాయ— 'అతఁడు ధనవంతుఁడేనా' అని మందహాసముతో అడిగినది.

రాధా— మందహాసముతో అడిగినదా? నిజము చెప్పుము.

హాయ— నీతోడు; నిజము. అందుకు నేను, 'ఈరత్నాలకూర్చిన మంచిముత్యాలహారమును నీకతఁడు కానుకగా ఇమ్మనినాఁడు' అని నిన్ననీవిచ్చిన సరమును చూపఁగానె నవ్వుకొనలాగుకొని మెడలో వేసికొనినది.

రాధా—ఆఁ! మెడలోవేసికొనినదా? హా!హా!హా!...మిత్రమా! పోయిన హారము పోయినదికాని, నాపరువు నిలఁబెట్టినది. ఆహా! మౌక్తికహా రరాజమా! నీ వెంతోఅద్వితీయదివ్యపదార్థ సమాపాన సౌఖ్యసంపద కై ఆశించి నిన్ను ధారపోసితినో, ఆసంపద నాకంటెముందుగా అనుభవింపచున్న నీవే అదృష్టవంతురాలవుకదా!

ఉ. ఆనవలాలమిన్న విమలారుణ హస్తతలాబ్జపాళిలో
సానలఁదీరి, నూత్నరుచి సంపదలన్ గడితేఱి, ఆపయిన్
మానితతారహారములమధ్యఁ నటించుచు, పైడిగిండులన్
హీనముగాఁదలంచు కమనీయకుచాచల శృంగసీమలన్
జానుగ క్రీడలాడు నిను సన్నుతిచేయ వశంబె ఏరికిన్?

మిత్రమా! అనుగాత్రి నేను దరిద్రుఁడనని యెంచుచున్నదికాఁబోలు? ఇదిగో చూడుము. (జేబులలోని రూపాయలు ఆడించును.)

హాయి—నాకుతెలియదా? నిన్నుమించుధనవంతులు ఈపురంబున ఎవరున్నారు? మఱొకరహస్యము. ఎవరితోను చెప్పవుకదా? నీనోట నువుగింజనానదు.

రాధా—రహస్యమా? చెప్పు, చెప్పు. ఒకపిట్టకైనచెప్పను; తల్లితోడు. నన్నెపెండ్లాడ ఒప్పుకొనినదా?

హాయి—తత్సంబంధమే. ఇటు రమ్ము. (చెవిలో) 'ఆశృంగారమూర్తి దర్శనంబు నాకెటుల లభించును'? అని అడిగినది.

రాధా—(ఆత్రముతో) అలాగున అడిగినదా? బాబూ, బాబూ, నిజముచెప్పుము. నీకనేకనమస్కారములు చేసెదను.

హాయి—ఛీ! ఏమినీవింత అనుమానపుమనుష్యుఁడవు? నేనుపడినశ్రమకు తగు బహుమానము చేయుటకు బదులుగా అనుమానించెదవు. చాలు, చాలు. నేఁటినుండి నన్ను ఈవిషయమై ఏమియు అడుగకుము. తెలిసినదా?

రాధా—నేస్తమా! ఎందుకీకోపము! నాయాత్రముకొలఁదిని పలుమఱుల అడుగుచున్నానుగాని, నీపై అనుమానముచే కాదు. ఇప్పటికి ఈసొమ్ము పుచ్చుకొనుము. ముందునీకు మంచికానుక ఇచ్చెదను. (పిడికెడురూపాయలుతీసి ఈయఁబోవును.)

హయ—(త్రోసివేసి) ఛీ! నీవెంత? నీసొమ్మెంత?

గీ. స్నేహధర్మపాశంబుల చిక్కి, ఇట్టి
నీచకార్యము చేయఁగా నెట్టుకొంటి;
కాని, నీపాడుడబ్బుకు కాదుసుమ్ము;
పొమ్ముపో, నీకు నాకును పొసఁగదింక.

(పోఁబోవును.)

రాధా—(అడ్డుకొని) హయగ్రీవా! నాతప్పుక్షమింపుము; నీకాళ్లుపట్టుకొనెదను. నన్ను మహామోహసముద్రమధ్యంబున త్రోసి, సూనశరమకరంబులకు ఎఱచేసి పోవుట నీకు తగదు. ఈకంఠహారమును పుచ్చుకొనుము.

హయ—నీవింతదీనతతో ప్రార్థించుచున్నపుడు, మంకుపట్టుపట్టుట మర్యాదకాదు. ఇంతకు, నేనుప్రథమముకోపినని ఎఱిఁగియే ఉందువు. (పుచ్చుకొని) నీవివాహకాలమున, దీనినితిరిగి నీకేకట్నముచదివింతెదనులే.

రాధా—వస్తు, వస్తు; నేనుపుచ్చుకొనను. కాని, నావివాహభారమంతయు నీపైవేసినాను. ఏమిచేసెదవో నీదయ.

హయ—ఇంకొకరహస్యము. నీవిపుడు రూపాయలను గవ్వలుగ భావించి కర్చుపెట్టవలెను. లేకున్న, మనకార్యము సాగదు. నిన్నుపాడుచేయుట నాకెంతమాత్రము ఇష్టములేదనియు, నీవునంతోషముతో ఏదైన ఇచ్చిన పుచ్చుకొందునేకాని ద్రోహబుద్ధి నాకు కలనైనలేదనియు నీకుతెలియునుగదా.

రాధా—ఎంతమాట! నీగుణము నాకుతెలియదా? నీచిత్తానుసారముగ[illegible]

దృఢశాస్త్రిదను. నవరత్నములు పొదిగినకవ్వనికుందనపుబొమ్మ నాసొ
మ్మనుమండ, వెండిముక్కలు లెక్కచేయుదునా?

ఉ. అమ్మెద వస్తువాహనము; లమ్మెద పెద్దలనాఁటికోటలన్;
అమ్మెద గొడ్డుగోదల, గృహంబుల, బంగరువంటి భూములన్;
అమ్మెద నాకుహక్కుగలవన్నియు; జంకక కట్టిపెట్ట సి-
ద్ధమ్ముగ నున్నవాఁడ నల తామరసాక్షిని పెండ్లియాడఁగన్.

హాయ—(వెన్నుతట్టుచు) బలే! బలే! రాక్షసప్రవృత్తినావే. పట్టుదలఅనగా ఇట్లుండవలె. ధనప్రాణములను తృణప్రాయములుగా ఎంచి చేపట్టినకార్యమును సాధించువాఁడే మగవాఁడు.

రాధా— అవునుగ మంచిదిని. అనుష్టుగుష్యకడ నన్నేరీతివర్ణించినావు?

హాయ—చెప్పమంటావా? వినుము.

సీ. వానిమో మెప్పుడు లేనవ్వువెన్నెలల్
కాయుటన్ ముద్దులు కాఱుచుండు;
శ్రీయజాక్షుల చూపుతూపుల రాపుచే
వానికెమ్మోవి బింబమటులుండు;
కనిన చేడెలసోయగములఁ జెవులనాడ
అతని నేత్రద్వయ మరుగుచుండు;
ఎంతొ మోహాబ్ధిలో ఈదుచుండుట వాని
వక్షము వెడఁదయై వఱలుచుండు;
రాచవారలదృష్టిచక్రాలి నైన
ఒగిఁ బగులఁగొట్టునెడు లోకోక్తి నిజమొ;
కానిచో వానికౌనేల కానరాదు
ఒండునుడులేల! నవమన్మథుం డతండు.

రాధా—ఐతే! విని ఏమనినది?

హయ—వెలవెలపోయి తలదించి, విచారముచే నిట్టూర్పువిడిచినది.

రాధా—విచారించినదా? ఎందుకెందుకు?

హయ—ఆనల్లకాలిబండ జయదేవుఁడు తొందరపడి వరించినందుకు.

రాధా—అలాగుననా? ఇంతవఱకు నాతో ఈరహస్యము చెప్పినావుకావుకదా! వాఁడా ఆమెకంటికి నచ్చినాఁడు! ఇఁక పెండ్లిసిద్ధమే కాఁబోలు?

హయ—వట్టిమాట. అదే నిజమైన, నాకీకష్ట మెందుకు? నీకీధనవ్యయ మెందుకు? కొండవాఁడుకదా. తుచ్ఛమంత్రబలమున ఆ అమాయికురాలిమనసును తనవశము చేసికొన ప్రయత్నించుచున్నాఁడు. కాని, ఈసంగతి ఆమెతండ్రికి తెలిసిన, ఇద్దఱికిని చాలముప్పు వచ్చును.

రాధా—ఆమంత్రాలపోతుతో మనము చాలఁగలమా?

హయ—వెఱ్ఱివాఁడా! వాఁడు క్షుద్రదేవతోపాసకుఁడు. నేనో లోకభీకర మహావీరాంజనేయోపాసకుఁడనుసుమా. హనుమంతునిచెంత నా కుప్పిగంతులు! వానిమంత్రతంత్రములు నాకడసాగవు. నాదెబ్బ చూతువుగాక.

రాధా—అటులైన నాకేమిభయము? ఆమెనన్ను వరించునట్లుచేయఁగలవా?

హయ—చేయఁగలనో లేనో నేను చెప్పినమాటలవలన గ్రహింపలేవా?

రాధా—పలుమాటలేల? ఆవగలాడి నావైపొకసారి చూచినచో, నాకుధైర్యమును తృప్తియుకలుగును. నీకు నూటపదార్లు బహుమానముదొరకును.

హయ—సరే. ఇదెంతలోపని; రమ్ము. (పోవుదురు.)

ద్వితీయరంగము—ఉద్యానవనప్రాంతము.

[మృణాళినీ కేశవవర్మలు ఉందురు]

కేశ—కాంతారత్నమా! నీఅదృష్టమును ఏమనికొనియాడుదును?

ఉ. ఉక్కునుతిక్కరించెదు మహోన్నతబాహుబలంబుతోడ, పెం-

పెక్కువ వైరిశేఖరుల ఎందఱినో సమరాంగణంబులన్
చక్కడఁగించి, రాడ్వరుల సన్నుతులందుచు, కీర్తిచంద్రికల్
దిక్కుల నించుచున్న జయదేవు నినున్ వరియించినాఁడహో!

మృణా—చాలు, చాలు. ఇఁకనైన నీముఖస్తుతులు కట్టిపెట్టుము. అన్నివిధంబుల నన్ను పాడుచేసినావు.

కేశ—(తెల్లఁబోయి) ఏమేమి? నిన్నుముఖస్తుతులు చేయుచున్నానా? నిన్ను పాడుచేసితినా?

మృణా—అందుకు సందేహమా? ఇంతవాఁడు, అంతవాఁడని ఆసేనానిని నా ముందు ప్రతిరోజును బట్టువలె పొగడిపొగడి, నామనసు కలంచి, నన్ను గోతిలో త్రోసినావు. ఇదేకాఁబోలు నాఅదృష్టము!

కేశ—పాపము! ప్రాఁకులాడు పసిపిల్లవగు నిన్ను బలవంతముగా పట్టుకొని వానిమెడకు కట్టితినా?.....ఇంతకు, ఇపుడు మించిపోయిన దేమి? నీ ఇష్టప్రకారమే చేయుము.

మృణా—పోనిమ్ము. నాకర్మము ఇట్లుండ, నిన్నుదూఱ నేల?

కేశ—నీకర్మమున కేమితక్కువ? మేలిమిబంగారుతీరున రాణించుచున్నది అఖండమండలాధిపతుల కుడిప్రక్కను కూర్చుండి మన్ననలందుచు ముక్కంటినైన రణంబున లెక్కచేయనిమహావీరపురుషసింహుఁడు నీసేవకుఁడై నీకన్నుసన్నల సంచరించుటకన్న ఎక్కుడుభాగ్య మింకొకటి ఉన్నదా?

మృణా—వీరుఁడుధీరుఁడు అనిచెప్పఁగలవుకాని సుందరుఁడని చెప్పఁగలవా?

కేశ—అతఁడు సుందరుఁడుకాఁడని ఎవరనఁగలరు? వానికేమివంక?

మృణా—నీవంటి బట్రాజునకు అజాంబవంతుఁడు అందగానివలె అగపడునేమోకాని, పైవారికి రాక్షసిబొగ్గులప్రోగులాగున తోఁచుననుటకు సందేహము లేదు.

కేశ—వా! వా! మృణాళినీ, ఏమి నీతెలివి! పెక్కేండ్లు కష్టపడి చదివినచదువును ఈనాఁటికి సార్థకపఱచినావు. కన్నులను కలందు పైరంగులను చూచి మోసపోవువారు సద్విద్యాగంధము లేనివఠప్రాయులు. కాని, నీవంటివిద్యావతులకు తగదు...ఎఱ్ఱగా బుఱ్ఱగా ఉన్నవాఁడందఱును అందగాండ్రేనా? పసుపురంగుగలవస్తువులన్నియు బంగారియేనా? ...నల్లగాఉన్నదని నేరెడుపండును పోనాడి, మిసమిసలాడుమునిఁడిపండును దిగమ్రింగువాఁడు వెంగలికాఁడా? నల్లఁదనమున చక్కఁదనము లేదా?.....తావిలేనిపూవేల? సత్ప్రవర్తనములేనిసౌందర్యమేల? కాల్పనా?

మృణా—అబ్బ! నీచెలికానిలోపమును చూపఁగానె, నీ కెంతకోపము వచ్చినది! కలలోపమును ఒప్పుకొనుటకు బదులుగా, లోపమున్నదనుట నాలోపమని చుట్టుతిరిగి నన్నే నేర్పుగా నిందించుచున్నావా?...ఇంతకు స్నేహితునివంకల నప్పుట స్నేహితునివిధికదా!

కేశ—స్నేహముమాట ఇపుడెందుకు? ఒకనిమంచిచెడ్డల నెంచునపుడు మిత్రత్వ శత్రుత్వములను దూరముగ బెట్టి నిష్పక్షపాతబుద్ధితో దర్శింపవలయు. మఱొకమాట.

కవిరాజవిరాజితము.

కరములకందము దానముగాని సుకాంచనభూషలు కావుసుమా;
తరుణులకందము రూపముగాదు సదా నిజభర్తలసేవయె సూ;
పురుషుల కందముపైఁగలవేషమె పొందగువిద్యయు బుద్ధియుఁగా-
కరయఁగ సర్వమెఱింగిన నీవిటు లాడుట కూడునె? సారమతీ!.

మృణా-నీహితములు జగద్ధితములే. కాని, లోకులపోరుపడుటదుస్తరముకదా.

మత్త. రాకుమారులు సుందరాంగులు ప్రాలుచుండఁగ నెందఱో
కాకిజెక్కను పోలువానిని కన్నులుండి వరించినన్

లోకులెల్లరు నవ్వరే? పలునోళ్లబంధులు తిట్టరే?
శోకవహ్నిని తల్లిదండ్రులు చూడకుందురె? కేశవా!

ఇంకొకమాట. అతఁడు కోయవాఁడు; నేను ఉత్తమక్షత్రియకాంతను. కాన, వానికిని నాకును వివాహసంబంధము ఎట్లు పొసఁగును?

కేశ—సర్వజ్ఞురాలవయ్యు, మూఢురాలివలె నటించుచున్న, నీసందేహములు తీర్ప నాతరమా? అయినను, ఒక్కమాటవినుము.

గీ. నిజముగా వానిఁ బెండ్లాడ నీకు మనసు
కలుగ, నిన్నాఁపఁగలఁడె ముక్కంటి ఐన?
అర్థయు, సత్త్వవర్తనము ముఖ్యఁబు కాని,
కులమునందేమి ఉన్నది! గోలకొండ!

మృణా—ఆహా! కేశవవర్మా! నీసమయోచితవాక్యాటికి నాకు అపరిమితానందమగుచున్నది. నీస్వాంతమును, నామోహనాంగుని ఎడఁగల నీ స్నేహమును పరిశీలింప, లేనిపోనిమాటలంటిని. నేను వానిశౌర్యధైర్య పరాక్రమాదులను విని మోహించితినే కాని, వానిరూపమును చూచితాను. నీవనినటుల ఆనిటలాక్షుఁడైన, నామనసును మరల్పలేఁడు. ఆవీరాగ్రేసరునే వివాహమాడెదను. ఈమాటకు తిరుగులేదు.

రాధా—అమ్మనాయనా! ఎంతటక్కరివి! మిరపకాయలు తినినకాకివలె నన్ను అలుపించినావు.

మృణా—ఓయీ! ఏసంభాషణమును లేకున్న, కాలమేలాగు కడచును? రమ్ము, తోఁటలోనికిపోయి కొన్నిపూవులు కోసికొందము.(పోవుదురు.)

తృతీయరంగము—ఉద్యానవనము.

[జయదేవు ప్రవేశించును.]

జయ—ఆహా! ఈఆరామసీమ అనూనప్రసూనాభిరామమై నేత్రపర్వము

చేయుచున్నది. ఓషధుల గాటువాసనలకు ఓపి రోజక, అనిలుఁడు మలయాద్రినుండి పాఱివచ్చి, ఈభూలోకనందనోద్యానము చొచ్చి, ఇందు ఉల్లసిల్లు మల్లె మొల్ల జాజి విరజాజి గన్నేరు పన్నీరు మున్నగు ఎన్నికగన్న పూలతో నిండిన చెట్లను వంచి, వాని సువాసనసాధనాగారముల కొల్లగొట్టి, జయోత్సాహచిహ్నంబుగ ఈలవేయుచున్నాఁడు. బాపురే!

వృషగతిరగడ

అలరువిల్తుని సైన్యనాయకుఁ - డైన మాధవుఁ డతను నానతి
తలను దాల్చి, చైత్రయాత్రకు - దళము సిద్ధము చేయుబుద్ధిని,
ముదముచేకడు ముదిరి చావుకు- ఎదురు చూచుచునున్న దళముల
అదయతన్ తెగనూడ్చి, కోమల - మైనదళముల సిద్ధపఱిచెను;
రకరకంబుల కోరకంబుల - రవలు కుండ్లుగ చేసి పోసెను;
సకలపుష్పరజంబు మందుగ - సారగంధము కల్పి నూఱెను;
తరులు లతలను దోనలయందున - దాఁచి ఉంచెను శ్రీవిరాజిత
వరసుమాశుగ సంచయంబును - విరహిలోకముఁ గొల్లఁగొట్టఁగ.
పంచబాణుని సాహసాదుల - ప్రస్తుతించెడు వందిమాగధ
సంచయంబన, సుమరసంబుల - షట్పదంబులు క్రోలి పాడెడు.
ప్రాణనాయకుఁడైన మాధవ - రాజు వచ్చెడు దారి పొడుగున
ప్రాణసఖి పఱపించి ఉంచిన - పచ్చపట్టు తివాసి మచ్చున
హెచ్చుపెఱిగిన పచ్చ పచ్చిక- ముచ్చటెంతయు కూర్చు కనులకు;
అచ్చు టచ్చుట గఱికపూవులు - అలరు పరిగబుటాల తీరున.
దారియం దిరువంకలం గల - తరుల శాఖలు పెనఁగు చుంటను
సోరుగా పెనుపందిరెత్తిన - చందమున కనుపట్టుచున్నది;
పరిజనంబులు విడియగా పలు - పట్టుడేరా లిందు వేసిన
కరణి రాజిలు సుమమయంబయి - క్రాలు వృక్షలతావితానము.

మృణా—(తోఁటలోపల) కేశవా! ఇఁకరమ్ము; దండలుకట్టుదము. (ఒకచోట కూర్చుండి హారములు కట్టుచుందురు.)

జయ—(తనలో) ఆమృదుమధురస్వనము ఎవరిదై ఉండును? (ముందుకు నడచి, వెనుకకుతగ్గి, సంతోషముతో) మఱెవరిది? మామకలోచన చకోరానందసంధాయిని అగు మృణాళినిది. ఇక్కడకు రమ్మని నాకు కబురంపి, ఆమె ఇంకను ఏలరాలేదని ఆలోచించుచున్నాను. కాని, నాకంటె ముందుగనే వచ్చినది. (తొంగిచూచి) పరువునకువచ్చిన అంటుమామిడి పండు దినదినమును రంగుమాఱుచు, ప్రేక్షకుల నోరూరించునట్లు, ఆ చంద్రాననా తనులతాప్రభలు దినదినప్రవర్ధమానములయి నామదిచంద్రకాంతమును కరఁగించుచున్నవి. మాయురే! శరత్కాలపూర్ణచంద్రబింబంబును విడంబించు ముఖంబు డంబు, చుట్టుకొని ఉండు వేల్పుయువరాజుమొక్క ఆకులను వాడునటుల చేయుపెన్నెఱిగుంపుసొంపు, నీలంపుటుంగరాల పొంగు నడంచు ముంగురుల సిరులు, లాదుల రోజనురాజిలు కనుబొమ్మల ఇమ్ము, తీరగుముక్కు టెక్కు, పాలముంజెల వలె మిలమిల లాడుచు, నవ్వునపుడు లొత్తలు పడు బుగ్గల నిగ్గు, తక్కుంగల వరాంగముల బెడంగును ఎంతచూచినను తృప్తికాకున్నది.

మృణా—(నవ్వుచు) కేశవా! నీకంటె ముందుగ నేనే కట్టితిని.

జయ—(తనలో) ఆహా! పగడపువలక మీఁది మంచుబొట్లు సూర్యకిరణప్రసారంబున ఎంత మనోజ్ఞంబుగ కనఁబడునో, అంత మనోహరంబులై మందహాసచంద్రికాప్రసారంబున ఆ కుందరదన నగము విడిన మోవి నంటు దంతములు కనువిందు చేయుచున్నవి.

కేశ—ఇదిగో నేనును కట్టివేసితిని. ఎవరిది బాగుగా ఉన్నది?

మృణా—ఎవరిదా? అన్నా! మన తగవు తీర్చుటకు మధ్యవర్తి లేకపోయెనే!

జయ—(బయల్పడి) సుందరీ! విచారింపకుము. నేను మీతగవు తీర్చెద.

మృణా—దయచేయుఁడు- సమయమునకు వచ్చినారు. ఈమాలిక నేను కట్టి

నాను. అది అతఁడు కట్టెను. ఇందు ఏదిహెచ్చైనదో చెప్పఁడు. (ఇచ్చును)

జయ—మిత్రమా! నీ చేదిః? (పుచ్చుకొని పరీక్షించుచుండును.)

కేశ—అయ్యో! ఆమె సుందరాంగి అనియు, దగ్గఱిచుట్టమనియు మోమో టపడక, నిష్పక్షపాతముగ చెప్పవలెను. ఏలన—

గీ. కొందఱు ధనాశచే బొంకుచుందు రెపుడు;
కొంద ఱందుకు లోను గాకుందు; రైన,
అందగత్తెల నగుమోము లరయఁ గానె
పరవశత నొంది మతిచెడి వారిమెప్పు-
లంద ఎందఱో యత్నింతు రన్ని విధుల.

జయ—దేనికదే మిన్నగా నున్నది.

కేశ—వా! వా! నేర్పుగా తప్పుకొనినారే! ఈరెంటిలో ఏది పసం దైనది?

జయ—సరే. నీనోటనే చెప్పించెదను. బాల్యము నుండియు ఈపనియందు ఆసక్తి కలవారెవరు? స్త్రీలా? పురుషులా?

కేశ—స్త్రీలే.

జయ—అవును గదా. అందుచే ఈలతాంగి కట్టిన మాలికయే మేలని చెప్పటకు నీకు అభ్యంతర ముండునా?

మృణా—(నవ్వుచు) ఆఁ; వింటివా? నీస్నేహితులే నాదండను మెచ్చినారు.

కేశ—నీదైదండకు ఆశించుచున్న ఈయన నీదండ బాగు లేదనునా?

మణా—మనోహరా! రండు, కూర్చుండుఁడు.

జయ—మనోహారిణీ! అహోరాత్రులు నిద్రాహారములు మాని సంగ్రామ భూములు నిలిచి యుద్ధ మాడ అలవాటు పడిన నామాట కేమి?

గీ. పిల్లగాలికే కదు సొమ్మసిల్లు నిద్ర-
భంగి కంటె మృదుతరమై పజలు నీదు-

భవ్యతనువల్లి ఎందుకీ బడుగునేల
నిలిచి వేఁచెదు? ఎవరి కీనిలువుకొలువు!

కేశ—పతి కూర్చున్న పిమ్మటగదా సతికూర్చుండుట. కానమీరుకూర్చుండుఁడు.

జయ—సరే. (కూర్చుండి) చెలీ! రమ్ము, నాప్రక్క కూర్చుండుము.

మృణా—(కేశవుని వైపు చూచును.)

జయ—కేశవవర్మ ఉన్నాఁడనియా జంకుచున్నావు? వెఱ్ఱిదానా! అతఁడు మనకు క్రొత్తవాఁడా? అదియునుగాక, అతఁడు పురుషులలో పురుషుఁడు; స్త్రీలలో స్త్రీ. కనుక జంక నక్కఱలేదు. రమ్ము; కూర్చుండుము.

మృణా—(నవ్వుచు తలవంచి యూరకుండును.)

కేశ—కన్యామణీ! రచ్చకు వచ్చి రాయబారమేల? రమ్ము, కూర్చుండుము. (కూర్చుండఁబెట్టి) రమణీరమణులారా! శుభస్య శీఘ్రమ్మను ఆర్యోక్తి మీరు ఎఱుంగనిది కాదు. కాన, మీరు త్వరలో పెండ్లి చేసికొనుట ఉత్తమము. మఱియు, మొదట మీ నడుమ పాఱుచున్న వలపుకాలువను విరివిచేసి మహానదిగ నేను చేసినాను. ఇఁక మిమ్ము వివాహమహానౌకపై కూడ కూర్చుండఁ బెట్టితి నేని నావని సాంతమగును. కనుక మీ అభిప్రాయముల తెలుప వేఁడెదను.

జయ—నా అభ్యంతరము ఏమియు లేదు.

కేశ—అన్నుమిన్నా! నీయుద్దేశము?

మృణా—(నవ్వుచు తల దించుకొనును.)

కేశ—సరే. నీయుద్దేశము బోధపడినది.

ఉ. పూలవనంబు పెండ్లియిలు, భూస్థలి పెండిలిపీట, ఇమ్మహా-
సాలచయంబు చూపఱులు, షట్పదనాదములే వివాహమం-
త్రాలు, పికాదిపక్షినినదంబులు మంగళవాద్యముల్, తలన్

రాలెడుమంచుబొట్లుతలఁబ్రాల్,రవిరశ్మిహోమముండవూ.

మఱియు, పూలచెట్లు నీరాజనము లిచ్చు నారీజనము, మృణాళిని అంతరాత్మ కన్యాదాత, నేను పురోహితుండనై వెలయ, పెండ్లి కేమి తక్కువ? అదియునుగాక, కాలానుసారముగా మనము నడువవలయు. అయ్యా! ఆమె గ్రుచ్చిన పుష్పహారము తెండు. (పుచ్చుకొని)అమ్మా! దీనిని ఈయన కంఠమున వేయుము. (ఇచ్చి)మీరు ఆమాలిక ఆమె మెడలో వేయుఁడు.

జయ,మృణా— (ఒకరిమెడలో ఒకరు పూలదండను వేయుదురు.)

కేశ—సూక్ష్మములో మోక్షము ఇట్టిదే. వివాహము సరి.

గీ. సర్వసాక్షివై ఒప్పెడు జలజమిత్ర!
అష్టదిశలార! తరులార! ఆకసంబ!
వీరిపెండ్లికి సాక్షులు మీరె; కాన
సౌఖ్యవారాశిఁ దేల్పరే సాకతమున.

నూతనదంపతులారా! మీకంఠములఁ రాణించుచున్న పొగడపూలు వాడినకొలఁదిని కమ్మతావుల హెచ్చుగ ఇచ్చునటుల, మీ అన్యోన్యానురాగములు కూడ నానాఁటికి పెరుఁగుచుండునుగాక! పోయెద; సెలవిండు.

జయ—మంచిది. కేశవా! నీఉపకారమును మఱవను.

మృణా—ఇక్కడ నన్ను విడిచిపెట్టి పోయెదవా? ఇంటికి దిగఁబెట్టవా?

కేశ—అవక్రవిక్రమాఢ్యునకు నిన్ను అప్పగించి కదా పోవుచున్నాను. ఇఁక నీ కేమిభయము? ఆయనే నిన్ను దిగఁబెట్టును. (పోవును)

మృణా—నాథా! కేశవవర్మకు మనయందు చాల అభిమానము. మనము వానికి తగిన ప్రత్యుపకారము చేయవలయు.

జయ—వానికి గొప్పపని ఇచ్చి సత్కరించెద.

మృణా—అది బాగుగా ఉన్నది. కాని, ఇపు డట్టి పని ఏదైన ఉన్నదా?

జయ—నా చేతిక్రింది సహాయ సైన్యాధ్యక్షపదవిని ఇపు డెవరును లేరు.

మృణా—ఆపని ఎవరికైన ఇచ్చెదనని వాగ్దానము చేసినారా?

జయ—లేదు. కాని, హయగ్రీవుఁడు కేశవునికంటె ముందు కొలువులో ప్రవేశించెను. కాన, ఆపని అతనికీయ నిశ్చయించితిని.

మృణా—ముందు వెనుకలకేమి? తెలివి తేటలు ముఖ్యముకాని ఏండ్లతో ఏమిపని? హయగ్రీవునికంటె కేశవుఁడే చురుకైనవాఁడని నానమ్మకము.

జయ—నీ యిష్ట ప్రకారమే చేసెదను...కాంతా! మిక్కిలి ఉక్కపెట్టుచు మనసునకు చిరాకు కలిగించు ఈవసంతమున, ఈ పూలతోఁట ముందు ఏగాలిమేడయు పనికిరాదు కదా. వర్షధారలలో తడిసి తడిసి ముద్దమై, పైని ఉండలేని కాలమున తలదాఁచుకొన తమ యిండ్లకు వెళ్లినను, లోనికి రానీయక తలుపులు బిగించివేయుజనులపై కినుకచే, ఈ కాలమున తన అడుగులకు మడుగులిడ ఎదురుచూచుచున్నవారి కంటఁబడక, ఈ నిర్జనప్రదేశంబునకు లేచివచ్చి పగ సాధించుచున్నదో అనునట్లు, ఇందు చల్లగాలి విచ్చల విడిగ సంచరించుచున్నది సుమా.

మృణా—ఇక్కడ ఎంతసేపున్నను తనివి తీఱదు.

జయ—ఈస్థలరాజము తన్నాశ్రయించువారికి మంచినీతులు కూడబోధించుచున్నది. ఆతూర్పువంకనున్న బూరుగుచెట్టు చూడు.

ఉ. కనుల భ్రమింపఁజేయు ఘనకాంతులు కుల్కెడుదానిపండులన్
కని, తిన పుట్టెడాసఁ విహగంబులు దవ్వులనుండి వచ్చి, వా-
నిని తమముక్కులన్ పొడిచి నెవ్వగఁబోయెదు; వేషధారులౌ
జనులను చేరు వారలకు సత్యముగా కడగండ్లు కల్గెడున్.

మృణా—ఆచెట్టు, 'ఇంటిపేరు కస్తూరివారు; ఇల్లంత గబ్బిలములవాసన', అను సామెతకు అనుగుణ్యముగ ఉన్నది.

జయ-ఉ. పల్లవపత్రసంతతులు పైనిడు బట్టగ మీఱ, కొమ్మలే
పుల్లలరీతి నొప్ప, తనబోదెయె కఱ్ఱగ మించ, ఛత్రమై

అల్లదె! ఎండ వానలభయంబును తీర్చి, నిజాశ్రితాళికిన్
చల్లఁదనం బొసంగు ఘనసాలముమఱ్ఱిని చూచితే సతీ!

మృణా—అది సుజనులకు స్వభావసిద్ధమైనధర్మమేకదా.

జయ—ఆనోరుమాలినచెట్టును చూచినైన, నీవు బుద్ధి తెచ్చుకొనుము.

మృణా—స్వార్థపరులందఱు దానిని చూచి బుద్ధి తెచ్చుకొనవలసినదే.

జయ—పైవారి మాటకేమి? నీవు ముందు తొందరపడుము.

మృణా—ఎందుచేత?

జయ—నంగనాచివలె అడిగెదవేమి? స్మరశర సర్పదష్టుండనై తద్విషము, మీఁదిపై రాలిన అగ్నికణమువలె, సర్వాంగములకు వ్యాపించుటచే స్మృతితప్పి ఉన్ననన్ను నీ అధరమణిప్రసాదమున కాపాడక తీపిమాటల కాలయాపనము చేయుచున్నావు. ఇదేనా నీపరోపకారబుద్ధి?

మృణా—లేనిపోనినీలాపనింద నాపై వేసినావే?

జయ—ముందైన, ఇట్టి నీలాపనిందల పాలుగాకుండ జాగ్రత్తపడుము.

మృణా—ఇఁక ముందు చవితినాఁడు నే నింటిలోనుండి పైకే రాను.

జయ—పైకి రాకపోయినను, నీవంటి వగలాడి అద్దముచూడకుండునా?

మృణా—అద్దమును చూచుటయు తప్పా? ఇది ఎక్కడిశాస్త్రము!

జయ—ముమ్మాటికి తప్పే. ఏలన-

మ. నెలవంకల్ తలఁదన్ను నీనొసలు నీనెమ్మోమునం దందమా-
తిలకం బుంచెదు నీకు దర్పణమునన్ దేదీప్యమానంబుగా
నెలఁతా! కన్పడుచుండ పట్టపగలే నిందల్ వెసన్ వచ్చు; ప్రే-
ముడిఁ ముద్దాడిన ఇంటి దీపమనుచున్ మూతెల్ల కాలుంగదా.

మృణా—(నవ్వుచు) నానొసలు నెలవంకలని భ్రమించువారు, వానిని చూచిన నిందల పాలగుదురేమో కాని నేను కాను.

జయ—చెలీ! చెలీ! ఆమామిడిగున్న క్రింద చూడుము. ఇంద్రధనుస్సును హసించు సోగపురిని విప్పి, ఒకనెమిలి తనప్రియురాలిముందు ఎట్లు నాట్యమాడుచున్నదో?

మృగా—(చూచి) అవునవును. ఆనెమ్మి తనప్రియుని నృత్యనైపుణ్యమును చూచుచు ఆనందించు చున్నది.

జయ—చూడు, చూడు. ఆనందించుటయే కాక ముద్దు పెట్టుకొనుచున్నది.

మృగా—అయ్యో! మీతో మాటలాడుచుండుటచే చూడలేదు.

జయ—కోమ్మా! నీకంత చూడవలెనని ఉన్న, ఇటు రమ్ము; చూపెదను.

మృగా—ఇదిగో వచ్చినాను. చూపుడు,

జయ—నాప్రేలికి సూటిగా చూడుము,

మృగా—(చూచును)

జయ—(ముద్దు పెట్టుకొని) ఈలాగున ముద్దాడినది.

మృగా—(కోపముతో) చాలు, చాలు. ఇందు కింత మాయ ఏల?

జయ—నీకోరిక ప్రకారము నేను చూపించితిని. దీనికింత కోపమెందుకు?

క. నవలా! ముద్దిడినన్ నవ-
నవలాడెడు నీదు బుగ్గ నలిగెనె? మఱి నీ-
నవలావణ్యము తగ్గెనె?
నవులాటలఁ ఇట్లలుగుట న్యాయంబగునా? (చేయిపట్టుకొనును)

మృగా—(విడిపించుకొని) నన్ను ముట్టుకొనకుఁడు.

జయ—సుందరీ! ఈస్వల్ప సంగతికి నీకింత కోపము తగదుసుమా.

గీ. పడఁతి మోవికి నగ పతిపంటినొక్కు-
కాదె? మృదుదేహవల్లికి ఘనమగునెగ

4917 dt 27-11-61

వచ్చినమగని ఆలింగనంబు కాదె?
బుగ్గలకు నగ నగకానిముద్దు కాదె?

పోనిమ్ము. నిన్ను ముట్టుకొననులే. (దూరముగ పోవును.)

[రాధాకాంత హయగ్రీవులు ప్రవేశింతురు.]

రాధా—చెలికాఁడా! పాపట సరిగా ఉన్నదా? నీటుగా అగపడుచున్నానా? (అద్దములో చూచుకొనును.)

హయ—ఓ! క్రొత్తగా సానియింటికి వెళ్లు నరసునివలె ఉన్నావు. ఇపుడు నిన్ను ఊర్వశి చూచిన, నాఁడు పురూరవుని వెంటాడినట్లు వెంటాడును.

రాధా—(నాలుక చూచుకొని) నాలుక పండినది. పెదవిపండినదో? లేదో?

హయ—అగ్గిలాగున ఉన్నది. లక్క-పిడతకంటె ఎఱ్ఱగా ఉన్నది.

రాధా—అదిగో! ఆ గజయాన అక్కడ ఉన్నది; రమ్ము. (పోఁబోవును.)

హయ—(అడ్డుకొని) నీకు మతిలేదా ఏమి? జయదేవుకూడ అక్కడ ఉన్నాఁడు. కనులువిప్పి చూడుము. నిన్నును నన్నును ఒకదెబ్బకు తెగనఱికివేయును. వాఁడు వెళ్లిపోవువఱకు ఆపొదరింటిలో దాఁగుకొనుము; పొమ్ము.

రాధా—అమ్మో! వాఁడున్నాఁడా? సరే. (పోవును.)

జయ—(తనలో) అబలకేల లొంగవలెనని నేను ఎంత బిగువుగా ఉండ ప్రయత్నించుచున్నను, ఆమదనాధముఁడు పానకములో పుల్లవలె అడ్డు వచ్చుచున్నాఁడు.

మ. మరుఁడా! పామరుఁడా! మహాఖలుఁడ! ఏమార్గ్గాలనో డాఁగి ఈ
పరకాంతారదవాసలున్ గెలువ పుష్పంబుల్ ప్రయోగించెదో?
హరిపుత్రుండ, వధర్మయుద్ధమును చేయఁగా పాడియా? ఈశుఁ డు
గ్ధురఫాలాగ్నిని నిన్ను కాల్చినను నీదుర్బుద్ధి పోలేదుగా.

నిన్ను అదక్షాధ్వరధ్వంసి ఋణశేషశత్రుశేషంబుల ఉంచరాదను అ

ర్యోక్త్రని మఱచి, భస్మము చేసి ఊరకున్నాఁడు. కాని తనకంఠమందున్న దుర్వార కాలకూటాగ్ని మధ్య నిన్ను పడవేసెనేని, తానేకపత్నీవ్రతుఁడు కాఁడను అపవాదమునకు పాల్పడకుండుటయే కాక, లోకకంటకుఁడవగు నీబారినుండి జనుల రక్షించిన వాఁడగును గదా....అరే, నీచాత్మా! తొందరపడకుము. నేనును నాభార్యయు ఏకమై, నిన్ను నల్లిని నలిపినట్లు నలిపివేసెదము. (ముందుకునడిచి, తగ్గి) ముందుగ నేనే ఆమెను బ్రతిమాలవలెనా?...ఆహా! సృష్టివైచిత్ర్యము! మోహాంధుఁడగు పురుషుఁడు ఎవఁడైననేమి? అబలకన్న దుర్బలుఁడుకదా!.....స్త్రీ అబలయా? కాదు, కాదు. పురుషగజాంకుశము. త్రిమూర్తులే ప్రియసతీవశులై వారికనుసన్నల మెలఁగుచున్నప్పుడు నేనుకలెక్కా? (ముందుకునడిచి, పైకి) చెలీ, ఇంకను నీకోపము పోలేదా? (చేయిపట్టుకొనఁబోవును.)

మృణా—(తప్పించుకొనును.)

జయ—అబ్బ! ఎంత ముక్కోపివే. నీ అనుజ్ఞలేనిది నిన్ను ముద్దాడుట తప్పని ముమ్మాఱు నా చెంపలపై కొట్టుకొందునా?.....పోనిమ్ము. నీకోపము తీఱ, నాబుగ్గల కఱచివేయుము. ఇదిగో. (దగ్గఱకు వెళ్లును.)

మృణా—నాకక్కఱలేదు.

జయ—మఱినీకోపము పోవుటెట్లు?...ఆఁ! తెలిసినది. ఒకచెంపముద్దాడి ఊరకున్న, చిక్కిపోదురందురు. కాన రెండవ చెంపకూడ ముద్దాడనందుకా ఈకోపము? అవును, అది గొప్పతప్పే. క్షమింపుము. ఇప్పుడే ఆలోపమును తీర్చెదను. (ముద్దాడఁ బోవును.)

మృణా—(తప్పించుకొని దూరముగ పోయి పెడమొగము పెట్టును.)

జయ—గీ. ప్రణయకోపాగ్ని సెగ తాఁకి వాడినట్టి
నీదు మోముతమ్మిని చూచి నాదు హృదయ-
హంస దిగులొందుచుండఁగా, అకట! ఇంక
నీదు పెన్నెఱి చీఁకటుల్ నెఱప నగునె?.

సుందరీ! ఇంత కాఠిన్యము కూడదు. మోము కొంచె మెత్తి కురులసవరించుకొనుము. (ముఖమును ఎత్తఁబోవును.)

మృణా—(చేతిని త్రోసివేయును.)

జయ—సతీవతంసమా! నూతనదంపతులకు ప్రణయకలహము సహజమే యినను, ఇంత మంకుపట్టుపట్టుట మోటసరసముసుమా.

గీ. కంటఁ జూచిన నాపాప మంటుకొనునె?
నన్నుఁ దాఁకిన నీమేను నల్లఁబడునె?
నోరు విప్పిన ముత్యాలు జాఱిపడునె?
చాలు చాలింతముఱిపించి చంపనగునె?.

సుందరవదనా! నాయందు దయయుంచి, ఒక తియ్యని మాట ఆడెదవా? ఆడవా?......సరే. నీనోటిమాట వినుటకే నేను తగనప్పుడు నీవు కష్టపడికట్టిన పూలహారము నాకెందుకు? (తీసి మృణాళినిపై పడవేయును.)

మృణా—ఇటు చేయుట మీకు ధర్మము కాదు.

జయ—నీఅకారణకలహము ధర్మము కాఁబోలు?

మృణా—(నవ్వుచు పూలదండ మెడలో వేయును.)

జయ—(కౌఁగిలించుకొని ముద్దాడును.)

మృణా—అడుగులచప్పుడగుచున్నది. ఎవరో వచ్చుచున్నారు. విడువుఁడు.

జయ—(విడిచి) అయ్యో! మన సౌఖ్యమునకు అడ్డురారుకదా! (వెళ్లి చూచి వచ్చి) మానినీ! మన అనుమానమే మనలను బాధించుచున్నది కాని ఎవరును రాలేదు. ఇంక ఎన్నాళ్లు మనమీరహస్యసమావేశములఁ గాలము పుచ్చుట? యుక్తసమయము చిక్కుటే దుర్లభము. ఒకప్పుడు చిక్కినను, ఎవరు వత్తురో ఎవరు చూతురో అనుభయముగాని స్వేచ్ఛగా నుండుటకు వీలుండదు. మఱి సుఖమా సున్న.

మృణా—ఈవిషయమై నేను యోచించుచున్నాను. ఏమియు తట్టలేదు.

జయ—లతాంగీ! నీతండ్రి మనవివాహమునకు అంగీకరించుట కలలోనివార్త. మఱియు, అతిరహస్యము బట్టబయ లగుట లోకప్రసిద్ధము. అప్పుడు మనము చాలబాధపడవలసివచ్చును. కనుక నేనొక ఉపాయము చెప్పెద; చేసెదవా?

మృణా—మీఉపాయము సదుపాయమైనదైన తప్పక చేసెదను.

జయ—ఈ రాత్రి మీవారందఱు నిద్రపోయినపిమ్మట మేడదిగి రాఁగలవా?

మృణా—అరరాత్రమున ఒంటిగ మేడదిగి రావలెనా? ఎట్లు దిగుట? ఎవరు చూతురో? ఏమి ముప్పువచ్చునో?

జయ—వర్ణేందుముఖీ! కనిపెంచిన తల్లిదండ్రులను వదలివచ్చుట కొంత కష్టముగా ఉండవచ్చును. కాని తక్కినవానినిగుఱించి నీవు లేశమును జంకనక్కఱలేదు.

మృణా—భర్తకన్న తల్లిదండ్రులు ఎక్కువవారుకారు. కాని, ముక్కోపి అగు నాతండ్రి ఏమిచేయునో అని భయపడుచున్నాను.

జయ—ఈవజ్రసన్నిభకళేబరమున జీవము లున్నంతవఱకు, నీకాలిగోటికైన అపాయము రవ్వంతయైన రాకుండ కాపాడుభారము నాది.

సీ. చండారివేదండమండలి గండడం-
చిన బాహుసృణిధార తనరుచుండ,
దండికొండలనైన ఖండింపఁజాలు కౌ-
క్షేయవజ్రము వాఁడి చెడక ఉండ,
పట్టణంబులుపట్టి మట్టిమల్లాడిన
బలసాహసాదులు ప్రబలుచుండ,
ఆజిలో ముక్కంటినైన లెక్కింపని
యౌవనవైభవ మలరుచుండ,

పోరుముచ్చట లేశము తీరకుండ,
పేరు వినఁగానె వైరులు పాఱుచుండ,
భండనపరుండు జయదేవు బ్రతికి ఉండ,
ఏల భయము? నాచక్కఁదనాలకొండ!.

మృణా—నామాటకేమి? నాతండ్రి పామువలెపగబట్టి మిమ్ము బాధించునేమో?

జయ—(నవ్వుచు) ఆహాహా! కాకికూతకు తుళ్లిపడు నీకే భయము లేనప్పుడు, భీకరసంగరరంగముల విజయుండనై పేరొందిన నాకా భయము?

ఉ. పుట్టితి కొండలందు; వనభూములఁ బిన్నట క్రూరజంతులన్
పట్టితి ఆటలాడ; మఱి ప్రాయము రాఁగనె బల్ బలాఢ్యులన్
మొట్టితి; లెక్కలేనిరణభూముల మెట్టితి; శాత్రవాళిఁ జాఁ
గొట్టితి, కాని నేనెఱుఁగ కొమ్మ! భయంబన ఎట్టులుండునో?.

మృణా—మానాన్నగారు మిమ్మేమియు చేయలేకున్నను, రాజుతో చెప్పిన-

జయ—(కోపముతో) ఏమీ? భూపతి నీతండ్రిమాటల నమ్మి నన్ను అన్యాయముగ దండించునా? గాంధర్వవివాహము తప్పా? రాజు ధర్మాధర్మముల విచారింపఁడా?...మంచిది. కలియఁబడిన రాజును బంటును ఒకటేసుమా. రాజుపైనుండి ఊడిపడిన దివ్యపురుషుఁడు కాఁడుకదా. ఇంతకు,

గీ. రాజుప్రాణము తానేలు రాజ్యలక్ష్మి;
రాజ్యలక్ష్మికి ప్రాణము రాణువకద
రాణువకు ప్రాణమరయ సేనానికాఁడె?
అట్టిసేనాని నేఁగానె? హంసయాన!

ఈవిషయమున అన్యాయము రవంత జరిగిన, ఈవిదిశాపురాంగనను వైరివృకముల పాలఁబెట్టి పేరుమాపకున్న ఇది మీనమేషము కాదు.

మృణా—మీకంత నిబ్బరమున్న వచ్చుటకు నాకు అభ్యంతరము లేదు.

జయ—నీసాహాయ్యార్థము మనకేళవుని పంపెద; పోయెద. (పోవును.)

మృణా—చిత్తము. నేను కొన్ని పూవులు కోసికొని పోయెదను. (పూలు కోయుచుండును.)

రాధా—(మెల్లఁగ వచ్చును.)

హయ—నేస్తమా! ఆమె ఎంత టక్కులాడి! పూవులమీఁద నుండిపోయినది.

రాధా—వెళ్ళిపోవు నేమోఅని భయపడితిని. ఆమె ఎందు కాఁగినది?

హయ—నిన్ను చూడవలెనను ఆశలో ఇంటికి పోక ఆఁగినది.

రాధా—ఇక్కడకు నేను వచ్చెదనని ఆమె కెట్లు తెలియును?

హయ—ఈవేళ నిన్ను ఈతోఁటకు తీసికొనివచ్చెదనని ఆమెతో చెప్పితిని.

రాధా—ఆహా! హితుఁడన నీవే హితుఁడవు. ఎదురేగి పలకరింతునా?

హయ—నేను ముందు వెళ్లెదను. పిమ్మట నాలుగడుగులు ముందుకువచ్చి పాదము. ఆమె నీవైపు చూడఁగానే చిఱునవ్వులతో పలకరింపుము.

రాధా—హా! మంచిఉపాయమే. నామీనమును గిరజాలునుసరిగా ఉన్నవా?

హయ—ఊఁ; పాగా సరిగా చుట్టుకొనుము. (మృణాళినికడకు వెళ్లును.)

రాధా—(పాగావిప్పి చుట్టుకొనుచుండును.)

హయ—ఆహా! రాజకుమారీ, నేఁడు వేగముగ తోఁటకు వచ్చినట్లున్నది.

మృణా—అవును. నీవెందుకు ఇటువచ్చినావు?

హయ—ఔషధములోనికి ఒకవనమూలిక కావలసి వచ్చితిని.

రాధా—(అద్దము చూచుకొని) గిరజాలు చెదరినవి. (సర్దుకొని ముందుకువెళ్లి)

బేహాగు—ఆదితాళము.

నిన్ను మోహించితిన్ - నిన్నుపెంద్లాడెదన్।
చిన్నిముద్దియవే - చెలియ! నన్నేలవే॥ నిన్ను॥
చలువరాల మేడలో - సకియ! నిన్నుంచెదన్।
విలువకల్గు భూషణం - బులను నీకు పెట్టెదన్॥ నిన్ను॥

మృణా—(ఆశ్చర్యముతో) హయగ్రీవా! ఇతఁడెవరు?

రాధా— నీవుచూడఁగోరిన - నీఅనుంగు నేస్తుఁడ।

కావుకావు సుందరీ! - కామబారిఁ జిక్కితిరా॥ నిన్ను॥

హాయ—(మెల్లఁగ) మనయూరివాఁడే. కాని, తాను ప్రేమించిన ఒకకాంత మోసపుచ్చుటచే, పిచ్చియెత్తి యిట్లు పాడుచు తిరుగుచుండును.

మృణా—అలాగునవా? పాపము!

రాధా—నిన్ను మోహించితిరా.........॥ నిన్ను॥

మృణా—(నవ్వుచు) ఎలుఁగుగొడ్డువలె గంతులిడుచున్నాఁడు.

రాధా—(చంకలుగుద్దుకొనుచు) వా! వా!

నన్ను చూచి నవ్విన - దన్నుమిన్న! అద్దిరా!

కన్నులున్న భాగ్యము - కాంచినాఁడ నేఁడు చాలా!॥ నిన్ను॥

మృణా—నీనిఆటపాటలు వినోదముగనే ఉన్నవి. కాని పొద్దుపోవుచున్నది; పోయెదను. (పోవును.)

హాయ—చిత్తము.

రాధా—మెచ్చి ఏమిచ్చెదవో? నీదయ.

ఉ॥ ఇచ్చెదో మన్మథాగ్నిఁ బడనీయక కాచెడుమోవి తేనియల్
ఇచ్చెదో ఆటలాడుకొన ఇంపగు బంగరుబొంగరాల? లే
కిచ్చెదో అడ్డులేనిగతిఁ ఏలఁగ నీతనురాజ్యలక్ష్మి? వే
ఇచ్చి త్వదీయధర్మగుణ మిప్పుడు చూపఁగదే సతీమణీ!.

మిత్రమా! మాటలాడక వెళ్లిపోయినది. ఏమిదారి?

హాయ—నూనవటు అర్ధాంగీకారమని నీకు తెలియదా? అదియునుగాక, నేనుండఁగా చెప్పుటకు సిగ్గుపడినది; రమ్ము. (పోవుదురు.)

చతుర్థరంగము—ఆరామప్రాంతము.

[హాయగ్రీవుఁడును, రాధాకాంతుఁడును ప్రవేశింతురు.]

రాధా—మిత్రమా! ఆకాంతామణి నాపాటవిని ఏమనినది?

హయ—ఏమి చెప్పుదును? నీగానసుధారసాస్వాదనమున మైమఱచి చిత్తరువువలె, అట్టె నిలిచిపోయినది.

రాధ—లయానుగుణ్యముగా అడుగులు వేసితినే. అందు కేమనినది?

హయ—'ఎలుఁగుగొడ్డువలె గంతులిడుచున్నాఁడు,' అని ప్రక్కలు బ్రద్దలగునట్లు నవ్వినది. తుదకు నవ్వు పట్టలేక పాఱిపోయినది.

రాధ—ఆమెకు అంతనవ్వు వచ్చినదా? 'ఎలుఁగుగొడ్డువలె గంతులిడుచున్నాఁడు', అని వెక్కిరించినదా? చా! బాగులేనపుడు, ఊరకుండుమని నీవేల నాకు సంజ్ఞ చేసినావు కావు!

హయ—బాగులేకేమి? బంగారు రాజులాగున ఉన్నది, ఆమె అటులనుటకు కారణము లేకపోలేదు. ముందు నీవు ఆమెకు బావ వగుదువు. కాన, ఇప్పటినుండియు హాస్యమాడ సాగినది.

రాధ—(సంతోషముతో) ఓహో! అదా సంగతి? సరే.

హయ—ఆమె నీవైపు చూచి నవ్వినదికదా. మాటపదార్లు తెమ్ము.

రాధ—నీతోడు. ఇంటికి వెళ్లగానే ఇచ్చెదను. హయగ్రీవా! నానీటుగోటులు, నారూపురేఖలు చూచి ఆమె ఏమనినది?

హయ—ఏమనినదా?...అబ్బ! ఇపుడు చెప్పను. ఆరహస్యము నీకు తెలిసిన, ఇఁక నాతో మాటలాడెదవా? నన్ను కన్నెత్తి చూచెదవా?

రాధ—నీపాదములాన. నేను కృతఘ్నుఁడను కానని నీవెఱుఁగవా? చెప్పకున్న నన్ను నీవు చంపుకొని తినినట్లే.

హయ—చా! చెడ్డ ఒట్టు వేసితివే!...కానిమ్ము; ఒకపిట్టకైన చెప్పకుము.

ఉ. తీరగు మోమువాఁడు, కడుతియ్యని పల్కులవాఁడు, మేల్మి బం
గారపు చాయవాఁడు, చిఱునవ్వుల మించెడువాఁడు, చేరలన్
గేరెడు కండ్లవాఁడు, నెఱనీటు హొయల్ గలవాఁడు, నామదిన్
దోర! హరించినాఁడు, చతురాస్యుని వ్రాలెటులున్నవో కదా?

అని అనినది. ఆదివ్యమంగళవిగ్రహము నీసొమ్ము. అనుభవింపుము.

రాధా—బలే! బలే!

ఉ. ఎన్నఁడు కోర్కెతీర, జలజేక్షణ బుగ్గల ముద్దుగొందునో!
ఎన్నఁడు తృప్తిదీరనటుల, ఇంతులమిన్నను కౌఁగిలింతునో!
ఎన్నఁడు తూఁగుటుయ్యెలల ఇద్దఱ మూఁగుచు కేరుచుందుమో!
ఎన్నఁడు నన్ను, 'నాథ' అని ఇంపెసలారఁగ ఆమె పిల్చునో?

హాయ—త్వరలోనే, ధనవ్యయమునకు జంకకుందువేని, నీవాంఛలన్నియు తీరును. కాని ఆమె నిన్ను రెండుసంగతులు అడుగుమనినది. చక్కఁగా ఆలోచించి చెప్పుము. ఆమెను నీకు మనస్ఫూర్తిగా పెండ్లాడవలెనని ఉన్నదా?

రాధా—నీకు తెలియదా? నన్ను వేరే అడుగవలెనా? ఆకోర్కెలేకున్న, నాకెందు కీవ్యయప్రయాసములు? పెండ్లాడ సిద్ధముగా ఉన్నానని చెప్పుము.

హాయ—ఇపుడున్న మోజునుబట్టి తలఊఁచి పిదప మోసపుచ్చితివేని, నీకొంప తీసెదనని నమ్ముము. రెండవది, ఆమె నీకు నచ్చినదా?

రాధా—నచ్చకేమి? బంగారుబొమ్మ!

సీ. ఛిన్నారిపెన్నెఱుల్ చీఁకటుల్ కాకున్న,
ఘనపదాబ్జంబుల కలఁచు టేల?
వెలఁదిముఖము చంద్రబింబము కాకున్న,
కెమ్మోవిలో సుధల్ చిమ్ము టేల?
భామిని నేత్రముల్ పద్మముల్ కాకున్న,
కొదమతుమ్మెదలు పైఁ బాఱు టేల?
కామినిమధ్య మాకాశంబు కాకున్న,
ఒక్కింత కానరాకుండు టేల?
కలికిమేను విద్యుల్లత కానియెడల,

పైఁడిసొమ్ములు నిగనిగ లాడవేల?
ఆ వయారి భువనసుందరాంగి కాని
యెడల, నామనం బామెపై నిలుచు టేల?

హాయ—(తనలో) వీనికి ఆమెను చూడఁగానె ఉన్నమతికూడ పోయినది. వీనిని భిక్షాధికారిగ చేసెదను. (పైకి) సరే. నీమాట లామెతో చెప్పెదను.

రాధా—ఈరాత్రి జయదేవా మెనెత్తుకొనిపోవునే! ఆమె నాకెట్లు చిక్కును?

హాయ—(తనలో) అన్నా! వారిమాటలు వీఁడు విన్నాఁడే!...(పైకినవ్వుచు) తోఁచిన బూరెలగంపలో పడినాఁడఁట, నీవంటివాఁడే. ఆమెతండ్రికి నీయం దనిష్టమగుటచే, ఆమెను పైకిలాగివేసికదా నీవు పెండ్లాడవలెను? ఆబాధ కొండవానినే పడనిమ్ము. పిమ్మట ఆమెయే నీకాళ్లకడకు వచ్చును. రమ్ము; పోదము.

రాధా—వాఁడెక్కడ కాకివలె నాకు చిక్కకుండ తన్నుకొనిపోవునో?

హాయ—ఆఁ! పిచ్చివాఁడు. ఎంతదూరము తన్నుకొనిపోఁగలఁడు. వాఁడు కాకివలె తన్నుకొనిపోయిన, నేను డేగలాగున వెంటాడి లాగుకొని వచ్చెదను.

రాధా—మఱొకసారి ఆసుందరాంగిని చూడకున్న, నాకు నిద్రపట్టదు. మఱియు, వాఁడు ఆమె నెక్కడకు తీసికొనిపోవునో చూచివచ్చెదను.

హాయ—సరే. కాని కడుజాగ్రత్తగా వెళ్లి రావలెనుసుమీ.

రాధా—తూఁటీఁగవలె వెళ్ళివచ్చెదను. (పోవును.)

హాయ—అక్కడకువెళ్లి వీఁడు ఏదో అల్లరిచేయకమానఁడు. జయదేవు మెత్తగా తన్నకమానఁడు. కానిమ్ము. గట్టిగా దెబ్బలు తగిలిన. పందులవంక పెట్టి సొమ్ములాగవచ్చును. (పోవును)

[తెరపడును.]

ద్వితీయాంకము.

ప్రథమరంగము—మేడ

[రాధాకాంతుఁడు ప్రవేశించును.]

రాధా—అర్ధరాత్రి అయినది; కాని ఆ సుందరాంగిజాడ లేదు. ఇఁక నాకా ముద్దియ ముద్దుమొగము కనఁబడదు కాఁబోలు?

సీ. అతివపై నాధ్యాన మంతయు నిల్చుటన్,
తనువుమీఁదను పరధ్యాన మయ్యె;
చాన వాక్సుధలను చవిచూచి ఉండుటన్,
అన్నపానాదులం దరుచి కల్గె;
చెలువ సద్గుణకథల్ చెవులు సోఁకుటచేత,
ఇతరాంశములు చెవి కెక్కవాయె;
కలికిసురూపంబు కనులముం దుండుటన్,
ఎప్పుడుఁ కంటిపై ఱెప్ప పడదు;
తరుణి నిఱుపేదకౌనునే నరయ, చింత
చేత నా శరీరంబు కృశింపసాగె;
కటకటా! ఆమె ఇఁక నా కగపడకున్న
ప్రాణము లెగిరిపోవుట వాస్తవంబు.

ఇపుడామె ఇంటిలో ఉన్నదో జయదేవుపాలయినదో, తెలియకున్నది.

మృణా—(మేడపైనుండి) కేశవా! స్త్రీవేషము వేసికొన్న నిన్ను చూడ, నాకు మిక్కిలి వినోదమగుచున్నది.

రాధా—(తనలో) ఆఁ! మాటలు వినఁబడుచున్నవి. దేవుఁడు లేఁడా?

కేశ—నీ ఎకసక్కెముల కేమి? త్వరపడుము; వెన్నెల వచ్చుచున్నది.

(కేశవుఁడును, మృణాళినియు మేడపైనుండి దిగుదురు.)

రాధ—(ప్రకాశముగ)

క. రావె సుగుణకదంబా! । రావె భూలోకరంభ! ప్రాణవదంబా!
రావె మదనాస్త్రంబా! । రావె నీదాసుని దయ రక్షింపఁగదే.

మృణా—(మెల్లఁగ) కేశవా! కంఠస్వరమునుబట్టి వీనిని ఎక్కడనో చూచినట్లున్నది. లాంతరిటుతెమ్ము (పుచ్చుకొని, చూచి) ఆవెఱ్ఱివాఁడా వీఁడు? ఎవరో అని భయపడితిని. (దీపమును ఊదివేయును.)

రాధా—మృణాళినీ! ఎంత మాయలాడివే! దీపమార్పివేసిన నిన్ను పోల్చుకొనలేననుకొనుచున్నావా? వెఱ్ఱిపిల్లా! నిన్ను పోల్చుకొనుటకు నీ ముఖకాంతి చాలదా? ఇదిగో నిన్ను పట్టుకొనెద; చూడుము,

కేశ,మృణా—(ముసుఁగులు వేసికొని దాఁగుకొందురు.)

రాధా— ధన్యాసి—ఆదితాళము.

ఎక్కడ దాఁగెదో - చక్కని చుక్కా! నీ వెక్కడ॥
ఎక్కడ దాఁగిన - ఇట్టే పట్టుకొందు॥ ఎక్కడ॥
నిన్ను చూడఁగోరి - నేను వచ్చినాఁడ।
కన్నెమిన్న! రావె - కరుణఁ బ్రోవఁగదే॥ ఎక్కడ॥

ఆఁ! దొంగ దొరకినది. (మృణాళినిని పట్టుకొని) ముఖము అగపడకుండ ముసుఁగు వేసికొనినావా? అదుగో నీముఖవైరి చంద్రుఁడు నీగుట్టు బైటపెట్ట వచ్చుచున్నాఁడు; రమ్ము. (పైకి తీసికొనివచ్చి) నీవిపుడు లాంతరు పట్టుకొంటివే. అదేది?...నీచీర గోంగవలె గ్రుచ్చుకొనుచున్న దేమి?...నీవెక్కడి మృణాళినివే? వానిముండా! పోపో. (త్రోసివేయును.)

మృణా—(దూరముగా పోవును.)

రాధా— నిన్ను వలచినాఁడ - నీకు దక్కినాఁడ।
నన్ను బాధపెట్ట - న్యాయమగునె? చెలి!॥ ఎక్కడ॥

(వెదకి కేశవవర్మను పట్టుకొని చేయి కిలాగి) లాంతరెది? ఆఁ! ఉన్నది. అన్నా మిత్రా! నీదాసుఁడ నేనుండ, నీకెందుకీకష్టము? (తీసికొని క్రింద పెట్టి) ముసుఁగులో మునిఁగినంతనే, నీటిలో జాడలు తీయు రాధా కాంతుఁడు నిన్ను గుఱుతు పట్టలేఁడనుకొంటివా? బేలా! నీవు కట్టిన పుట్టమే రాపట్టివని చాటుచుండ, ఇంకెందుకు ముసుఁగు?

గీ. వేఁటకాఁడు వెన్నాడ, తప్పించుకొనుట
కలవి గానప్పు డిసుకలో తలను దూర్చి
తన్నెవరుఁ జూడలేరని తలఁచు నిప్పు
కోడివలె, మోము దాఁచెదో? లేడికంటి!.

కేశ—(తప్పించుకొని దూరముగ పోవును.)

రాధా—సుందరీ! నీదివ్యదేహదేవాలయ ప్రాకారాకారమును చూచిన ప్పటినుండియు నామతిపోయినది. నీకొఱకే ఇక్కడ వేచియున్నాను. నా యందు దయయుంచి నీబంటుగా చేకొనుము...మాటాడవేమి? దూరదూరముగా పోయెదవేమి? నీకును పెండ్లి కాలేదు. నాకును పెండ్లి కాలేదు. నీవా రాకుమార్తెవు; నేనా రాకుమారుఁడను. నీవా అందగత్తెవు. నేనో ఇంతో అంతో అందగాఁడనే. కనుక మనమెందుకు గాంధర్వవిధిని వివాహమాడరాదు?...తిన్నఁగా చూచితివేని, ఆ కోయవాఁడే చక్కనివాఁడో, నేనే చక్కనివాఁడనో నీకే బోధపడును.

సీ. చెంత చేరఁగనీని చిమ్మచీఁకటివాఁడు,
కన ముచ్చటగు సుధాకరుఁడ నేను;
ముండ్లతో నిండిన మొగలిడొంకయె వాఁడు,
తావులనీను మేల్ పూవు నేను;
అఖిలవిషముతో అసరెడు ఫణి వాఁడు,
ఫణివిషంబు హరించు మణిని నేను;

కోఱగాని మత్స్యపుగుల్ల సుమా వాఁడు,
తళతళలాడుముత్యమును నేను;
పొట్టకై తల తాఁకట్టు పెట్టు వాఁడు,
అట్టి తాఁకట్లు పట్టెడు శెట్టి నేను;
నన్ను విడనాడి వానిని ఎన్నుకొన్న
నిన్ను ఏమననచ్చునో అన్నుమిన్న!

ఇప్పుడైన మించిపోలేదు. చేసిన తప్పును దిద్దుకొనుము; రమ్ము. (చేయి పట్టుకొనును.)

కేశ—(విడిపించుకొనును.)

రాధా—ఆహా? ఈకాలమున న్యాయము పనికిరాదుకదా! మంచిగా అడుగుచున్న కొలఁదిని మురిపించుచున్నావు.... చెలీ!

జంఝూటి—ఆటతాళము.

అలుకమానవే - పలుకులాడవే।
కలుకులాడి! ముసుఁగులోన - గుద్దులాట ఎందుకే?॥ అలుక॥
ముసుఁగు తీసివేయవె - ముద్దు పెట్టనీయవే।
కుసుమగంధి! నిన్ను చూడఁ - గోరి వచ్చినాఁడనే॥ అలుక॥
బిగువుమాని రాఁగదే - తొగరుమోవి ఈఁగదే।
మిగుల దాహ మగుచునున్న - దగమ చేయఁబోకుమా॥ అలుక॥
(కౌఁగిలించుకొనఁబోవును.)

కేశ—(తప్పించుకొని) అబ్బా! ఏమిఇది?

రాధా—అదేమో ఎఱుఁగవా? వినుము.

గీ. మోహసాగరసంజాత బుద్బుదంబు,
సత్కళాశాస్త్రమర్మంబు, జనసఘనఫ
లంబు, వరరాజయోగసారంబు, సాటి
లేని యింద్రిభోగంబు, ఆలింగనంబు.

దీని పై మెట్టుచూపెదను: చూడుము. (ముద్దాడి) అమ్మో! అమ్మో! పెదవి మండుచున్నది. కొమ్మా! పూబంతికంటె మెత్తగా ఉండవలసిన నీ బుగ్గ పనసకాయవలె గ్రుచ్చుకొనుచున్నదేల? (తనలో) ఈమానిని ఎవరు? స్త్రీయా? పురుషుఁడా? నపుంసకుఁడా?... మోసపోతిని కాఁబోలు? (పైకి కోపముతో) ఓ పిశాచమా! నీముఖము చూపుము. (ముసుఁగు లాగివేయును.)

కేశ—(నవ్వుచు) మనోహరా! రండు; ముద్దుపెట్టుకొనుఁడు.

రాధా—ఛీ! బానిసకొడకా!

ఉత్సాహ. ఏర నన్ను మోసపుచ్చ ఇట్టివేషమూనితే?
పాఱిపోకు; కానుకిచ్చి పంపువాఁడ; దుర్మతీ!

కేశ— ఔర! ఇంక సిగ్గులేక ఆఁగి మాటలాడెదో?
పాఱిపోర; లేనియెడల పట్టి చంపువాఁడరా.

రాధా-పంచచా. అరే! దురాత్మ! ఇచ్చ వచ్చినట్లు ప్రేల సాగితే?
సరే! అదెంతసేపు? నేఁడు చచ్చినావు కాచుకో.

కేశ— నిరాయుధుండనంచు నెంచి నీల్గుచున్న వాఁడవా?

జయ-(లోపలనుండి)అరే మదాంధులార! ఏమి అగడంబు? నిల్వుఁడీ.

రాధా—(తనలో) అన్నా! ఆకిరాతకుఁడు వచ్చుచున్నాఁడు. ఏమిదారి?

జయ—(ప్రవేశించి) ఏమీఅల్లరి? ఎవరక్కడ?... కేశవా!

కేశ—దేవా! ఆమతిహీనుఁడు మిమ్ముద్దుకొసి అల్లరిపెట్టుచున్నాఁడు.

జయ—అరే! దురాత్మా! ఈదెబ్బ కాచుకొనుము. (నఱుకఁబోవును.)

మృణా—(అడ్డుపడి) ఇతఁడు పిచ్చివాఁడు. కాన క్షమింపుఁడు.

జయ—పిచ్చివాఁడా? నీకెట్లు తెలియును?

మృణా—వాని ఆకారమే తెల్పుచున్నది. హయగ్రీవుఁడుకూడ చెప్పినాఁడు.

జయ—అలాగునవా? వెఱ్ఱిమొగమా! బ్రతికినావు; పో.

రాధా—చిత్తము, చిత్తము. (పాఱిపోవును.)

జయ—సుందరీ! ఇంక జాగేల? రమ్ము. ఆపిచ్చివాఁడు ఊరంతట చాటునేమో? (నిష్క్రమింతురు.) [తెర పడును.]

ద్వితీయరంగము——రాజమార్గము.

[హయగ్రీవ రాధాకాంతులు మాటాడుచుందురు.]

హయ—చెక్కిలి ఱంపమువలె ఉన్నదా? స్త్రీయో పురుషుఁడో పోల్చినావా?

రాధా—వ్రేలిముసుఁగు ఊడలాగి చూడ, గడ్డమును మీసమును అగపడినవి.

హయ—వాఁడెవఁడో ఎఱుఁగుదువా? పై అధికారి దయసంపాదింప, సిగ్గులేక అడ్డమగు నీచకార్యములను చేయుచుండెనకాఁడు; కేశవుఁడు.

రాధా—అవును, వాఁడే. అంత నాకు కోపమువచ్చి కత్తి ఎత్తితిని కాని పిల్లపిడుగువలె ఆ కొండవాఁడు వచ్చినాఁడు.

హయ—అరే! కామాంధా! జయదేవా! నానోట కఱకకాయ కొట్టితివా? ఆఁగుమాఁగుము. నీభోగము భూమిపాలు చేసెదను. వాఁడు నిన్నేమి చేసినాఁడు? మిత్రమా!

రాధా—నన్ను చంప కత్తి ఎత్తినాఁడు. అప్పుడా దయాతరంగిణి మృణాళిని అడ్డుపడినది. లేకున్న నాసంగతి అడుగవలెనా?

హయ—(తనలో) కాలో చేయియో విఱుగఁగొట్టిన, ఎంత బాగుగా ఉండును! (పైకి) మృణాళిని అడ్డుపడినదా? సెబాసు! మృణాళినీ! సెబాసు! నీ మనోనాథుని ప్రాణములను కాపాడి, నీ నుదుటి సిందూరతిలకము మాయకుండ నిలుపుకొన్నావు. నీసాహసమునకు మెచ్చవచ్చు. రాధాకాంతా! ఆకాంతకు నీపై ఎంత ప్రేమ ఉన్నదో ఇపుడైన గ్రహించినావా?

రాధా—ఆమెకు నాపై ప్రేమలేకపోలేదు. కాని ఆమె అనిన ఒకమాటమాత్రము నాహృదయశల్యమై బాధించుచున్నది.

హయ—ఏమనినది? నేస్తమా! నాతో చెప్పుము.

రాధా—‘ఇతఁడు పిచ్చివాఁడు; కాన, ’క్షమింపుఁడు, అనియు నేనుపిచ్చివాఁడనని నీవుకూడ చెప్పితివనియు, ఆకోయవానితో చెప్పినది.

హాయ—(తనలో) నాకొంపతీసినది. (పైకి) నీతోఁడు; నేనెప్పుడును అట్లనలేదు. కాని, హా! ఏమి మాటనేర్పు! ఆమె నీప్రాణసంరక్షణార్థమై అట్లనుటయేకాక, తనమాట దృఢపఱచుకొనుటకై నన్నును కలిపినది.

రాధా—అదానంగతి? సరే. కాని, ఆకొండవానిని ఎప్పటికైన పరాభవింపవలెను. నాస్వామ్మునినుదున్న నీవు నాకీవిషయమున తోడ్పడకున్న, నీముఖము చూడను. మఱియు, జయదేవునుచూచిన నీకిష్టములేదని నాతో నీవు చెప్పిఉన్నావు.

హాయ—ఇప్పుడుకూడ చెప్పెదను. వానిని నేననిష్టముతో చూడకున్న, నన్ను నీవనిష్టముతో చూడుము. సహాయసైన్యాధిపోద్యోగము న్యాయముగా నాకు రావలసిఉన్నను, నాశక్తియుక్తులెఱిఁగిన నలుగురు తగుమనుష్యులు స్వయముగా వెళ్లి అపని నాకిమ్మని వానితో చెప్పినను, నాసామర్థ్యమును అనేకయుద్ధములలో తాను కన్నారచూచిఉన్నను, ఉద్యోగకర్వాతిశయమున లెక్కింపక, వానియిష్టున కిచ్చివేసినాఁడు. నేను వెళ్లి అడుగ, ‘అప్పుడే ఒకని కిచ్చివేసితి’ నని ప్రేలినాఁడు.

రాధా—ఏమి వానిమిడిసిపాటు! వానియిష్టుఁ డెవఁడు?

హాయి—మఱెవఁడు? చీరకట్టుకొని నిన్ను మోసపుచ్చిన శానినకొడుకు కేశవవర్మగాఁడు. స్వానుభవములేని అపుస్తకాలపురుగు మొన్నమొన్న సైన్యములో ప్రవేశించినాఁడు.

రాధా—ఆకొండవానికి వానిపై అంతదయ ఉండుటకు కారణమేమి?

హాయ—కలికాలమహిమయే కారణము. ఈరోజులలో పెద్దబుద్ధుల సిఫారసులో, నక్కవినయములో, ముఖస్తోత్రపాండిత్యమో, ఆశ్రయింపులో కలవాఁడు దేవానాం ప్రియుఁడైనను, అధికారిప్రియుఁడై ఉన్నతోద్యోగము లందుచుండును.

రాధా—నీవింకపని చేసెదవా? నేనైన వెంటనే మానివేయకుందునా?

హయ—తప్పక చేసెదను. పనిమానివేయుట పట్టి తెలివితక్కువ. వాఁడు నన్నెట్లు నమ్మించి మోసపుచ్చెనో, అట్లే నేనును చేసెదను. ఆయమూర్ఖుఁడు తనఉద్యోగబలంబున నామనసు నొప్పించినాఁడుకదా. నేను నాబుద్ధిబలంబున వాని మనసెంత నొప్పించెదనో ముందు నీకు తెలియఁగలదు.

రాధా—ఎందుకీ కంఠశోష? నీకు కావలసినపని కేశవుఁడు తన్నుకొనిపోయినాఁడు. నాకు భార్యకానున్న కాంతను జయదేవెత్తుకొని పోయినాఁడు. ఇప్పటికి మనకు అపజయము, వారికి జయము.

హయ—ఓయీ! జయాపజయములు మనుజునకు రాకున్న మానికివచ్చునా?

గీ. పగలు రాత్రియును కలసి వాసరమగు
కరణి, సుఖదుఃఖమిళితంబు నరుని బ్రతుకు;
ఎండవానల కులుకని కొండలీల,
వాని లెక్కింపఁ డొక్కింత ప్రాజ్ఞుఁ డెపుడు.

వానిని పరిభవించి నాపగ తీర్చుకొనకున్న, నేను క్షత్రియుఁడనే కాను.

రాధా—సరే, చూడకపోదునా?...ఆకొండవాని తుట్టపెదవి ఏమిపుణ్యము చేసినదో కాని ఆజగన్మోహిని కెమ్మోవిని ముద్దాడునుగదా.

హయ—పరుగెత్తుము. ఆమెతండ్రిని లేపుము. ఆ అంతఃపురగోష్ఠి వెంట పంపుము. ఆదుర్మార్గునిసంతోషము పాడుచేయుము. ఆమెబంధువులను పురికొల్పుము. వీథులలో దప్పువేసి చాటుము. ఈరహస్యము వూరెల్ల కాలుచిచ్చువలె అల్లుకొనఁజేయుము. రమ్ము, రమ్ము. (పరుగెత్తిపోవుదురు)

[తెరపడును.]

తృతీయరంగము—త్రివిక్రమవర్మ మేడ.

[హయగ్రీవుఁడును, రాధాకాంతుఁడును ప్రవేశింతురు.]

రాధా—(గట్టిగా) త్రివిక్రమవర్మగారూ! ఏమండో! ఎంత మొద్దునిద్దురయ్యా!

హాయ—అయ్యో! అయ్యో! రెండు, రండు. దొంగలు! దొంగలు!!

త్రివి—(మేడపై కిటికీలోనుండి) ఎవరాపిలుచువారు? ఏమిసంగతి?

రాధా—బాబూ! మీకుటుంబమంతయు సురక్షితముగ ఉన్నదా? తలుపులగడియలు వేసిఉన్నవా? చూడుఁడు, చూడుఁడు.

త్రివి—ఆపరీక్ష మీకెందుకు? త్రాగివచ్చినారా ఏమి?

రాధా—చిత్తము. సారామత్తుచేతనే, ఏదిపోయినదో తెలియకున్నది.

హాయ—నీబయటిజీవము ఒకజాతిహీనునిపాలైనది. నీగారాబు రామచిలుకను గండుపిల్లి ఎత్తుకొనిపోయినది. దిగిరావయ్యా!

రాధా—మేడదిగవయ్యా! పైకిరావయ్యా! నీబంధుభృత్యులను లేపవయ్యా!

త్రివి—తిన్నఁగా మీదారినిపోయెదరా? రాజభటులకు అప్పఁజెప్పవలెనా?

హాయ—ఎందుకయ్యా అంతకోపము? ఒకసారి లోపలికి వెళ్లి నీబంధువులందఱును ఉన్నారో లేరో చూడవయ్యా!

రాధా—రాజభటులకు అప్పగించెదవా? అవునవును. రాజభటులపెద్ద నీ అల్లుఁడగుటచే, ఇంక అందఱిని చెఱలో పెట్టించెదవు.

త్రివి—అరే! త్రాగుఁబోతులారా! కాఱులఱుచున్నారు. జాగ్రత్త రాఁబోవు బాలసూర్యుని చూచుటకు మీకు ప్రాప్తి లేదు కాఁబోలు?

రాధా—మీకింకను నిద్రమత్తుపోనట్లున్నది. నేనెవరో ఎఱుఁగుదురా?

త్రివి—నాకు తెలియదు. ఎవరుమీరు?

రాధా—మామా! నేను తమముద్దుల అల్లుఁడ; రాధాకాంతుఁడను,

త్రివి—(కోపముతో) అరేమందమతీ! నాయింటికి రావద్దనియు, నాపుత్రికను నీకీయననియు నేను స్పష్టముగా నీతో చెప్పలేదా? త్రాగివచ్చి నాయింటిపైబడి అల్లరిచేసెదవా? సిగ్గులేదా?

రాధా—మామా! శాంతించి నామాటవిను; మామా!

త్రివి—ఛీ! ఛీ! పో. ఎవఁడవురా నీవు నన్ను జెనకుటకు? ఇది విదిశాపురము. నీయెదుటివాఁడు అవక్రవిక్రముఁడు; త్రివిక్రముఁడు. నీవు నిర్భయ

ముగా అల్లరిచేయుటకు, ఇది సానికొంపకాదు. రాజకార్యాలోచనస భాస్థానిమందిరము. తెలిసినదా?

హాయ—నీమేలుకోరి చెప్పవచ్చిన మమ్ము నిందించెదవేమి? మమ్ము నమ్మకున్న బోనిమ్ము; మాకేమి? కండకుజేనిదురద బచ్చలికేల? నీకూఁతురు ఆకొండవానినే పెండ్లాడనిమ్ము. రాధాకాంతా! రమ్ము, పోదము.

త్రివి—అరే పశువా! ఏమికూసినావు? రాధాకాంతా! వాఁడెవఁడు? నిజము చెప్పుము.

రాధా—నిజమే చెప్పెద. మీకుమారిని గంటక్రిందట దొంగవలెవచ్చి, ఆ కొండవాఁడు జయదేవు ఎత్తుకొనిపోయినాఁడు. మొఁగలిపూవు మోటు వానిచేతిలో పడినది. మీరిట్లు జాలము చేయుచున్న మోసమగును. నా మాటలు నమ్మరేని, ఇల్లంతయు వెదకిచూడుఁడు. ఆమె ఉన్న, మీయిష్టము వచ్చినశిక్షకు నేను బద్ధుఁడను.

త్రివి—(విషాదముతో) అట్లగునా? అయ్యో! నాయిల్లుకూలినది! దీపము! దీపము! సుందరీ! లెమ్ము; రమ్ము. అందఱినిలేపుము. (లోనికిపోవును.)

హాయ—నేస్తమా! ఇఁక నేనిక్కడ ఉండరాదు; పోయెదను. ఈకుట్రలో నేను చేరినట్లు జయదేవునకు తెలిసిన, మనముఖ్యోద్దేశములకు భంగము కలుగును. ఇపుడు వానియింటికే వెళ్లి, వానిని పైకితీసికొనివచ్చెదను. నీవు త్రివిక్రముని వెంటఁబెట్టుకొనిరమ్ము. ఈసంగతి రాజుగారికి తెలియఁ జేయవలెను. దాన మనకెంతలాభముండకున్నను, నల్లవానిమనసు నొచ్చును. వాఁడు ద్రోహిఅని ఋజువైనను, రాజువానిని మన్నించునని నానిశ్చయము. ఏలన, వాఁడు రాజుముద్దుబిడ్డఁడు. మఱియు వానిస్థానమును అలంకరింపఁగల వీరుఁడు వేరొకఁడు లేఁడు. ఐనను తుదకేమి లేలునో చూతము; పోయెదను. (పోవును.)

[దివిటీలతో సేవకులును త్రివిక్రముఁడు ప్రవేశింతురు.]

త్రివి—హా! పోయినది, పోయినది. నా గారాబు రామచిలుక ఎగిరిపోయినది.

నాయనా! రాధాకాంతా! ఆకొండవాఁడే నాపిల్లనెత్తుకొని పోయెనా?

రాధా—అందుకు సందేహమా? కన్నారఁ జూచితిని. చూచుటయే కాక పల్క-రించితిని. పల్కరించుటయే కాక అడ్డుకొంటిని. కాని-

త్రివి—హా! ఎంత దౌర్జన్యము! ఎంత మోసము! హా! సద్గుణనిలయా! తనయా!

మత్తకో. నీవె నాతొలినోముపంటవు, నీవె నాతనయుండ, నీ
వే వరాత్మజవంచు నెన్నుచు ఎంతొ సంతస మందుచున్,
నీవివాహము చేతులారఁగ నేను చేయఁ దలంచుచో,
ఈవిధంబున మోసపుచ్చుట కేమి నేరము చేసితిన్?.

ఓరా! స్వామిద్రోహీ! అమాయకుఁడవని చనువిచ్చి, ఇంటికి రానిచ్చి నందుకు నాయింటివానసములు లెక్కపెట్ట తెగించితివా? నేఁడుగదా నీ ముఖముకంటె నీహృదయము నల్లనిదని బోధపడినది. ఒడిలో నిప్పును పెట్టుకొని ఎంతదూరము పోఁగలవురా?

రాధా—మామా! నేను కాళ్లపైబడి నాకు ఆకాంతను ఇమ్మని ప్రతిమాలిన పుడు, 'నీకంటె చక్కనివానికి, నీకంటె భాగ్యశాలికి ఇచ్చెద,' నని గొప్పలు చెప్పి నన్ను తూలనాడినావే. ఇప్పుడో?

హిందుస్థానీకాఫీ—ఏకతాళము.

తన్నుకొనిపోయినాఁడు- కన్నెమిన్న కొండవాఁడు।
నిన్ను మోసపుచ్చినాఁడు- నిన్ను కలఁత పెట్టినాఁడు॥ తన్ను॥

త్రివి—ఇట్లగునని నేను కలనైన అనుకొంటినా? అపుడు నీకిచ్చి పెండ్లి చేసి యుండిన, నాకీఅపకీర్తి రాకుండును గదా!

రాధా—మామా! పశ్చాత్తాపము మిక్కిలి ఆలస్యముగ వచ్చును. నీవంటి గడుసువాఁడు రెండువిధముల చెడుచుండును.

కోరివచ్చి పిల్లనడుగ- కొట్టు ఎక్కినావు నాఁడు;
ఏరికేది పాత్రమగునో- ఎఱుఁగ వీలు కాదు కాదె॥ తన్ను॥

త్రివి—ఓసీ! కులకళంకినీ! మృణాళినీ! నీవుపుట్టి నాకష్టార్జిత గౌరవసౌధ రాజమునకు దుర్యశోనలము అర్ధరాత్రి ముట్టించిపోతివికదే పాతకీ! నీవు జన్మింపకున్నను, చనిపోయిఉన్నను, నాకింత మనోవేదన ఉండదుకదా...ఇట్టి దుర్మార్గులు ఈకాలమున పుట్టుచుండ, సంతానము ఎవఁడు కోరును? ఓతండ్రులారా! గోముఖవ్యాఘ్రములగు కుమార్తెలను నమ్మకుఁడు; నావలె చెడిపోకుఁడు. వారి చిత్తములు తామరాకుపై నీటిబొట్లు; వారి వినయములు నక్కవినయములు; వారి తేనెలొలుకుపలుకులు తేనెపూసినములుకులు; వారిచేష్టలు కోఁతిచేష్టలు. వేయేల? 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకీ'; అను ఆర్యోక్తికి అక్షరలక్ష లియ్యవచ్చును.

రాధా—మామా, నేరమంతయు నీది; ఆమెను నిందించెదవేమి? అవగలాడికి నన్ను వివాహమాడవలెనని పూర్ణేచ్ఛఉన్నను, నీవు కానిచ్చినావుకావు. అందుచేత పైకి లేచిపోయినది.

ఇప్పుడైన నాకుపిల్ల- నీయ ఒప్పుకొంటివేని
తప్పకుండ వెదకితెచ్చి- అప్పగించువాఁడ నీకు॥ తన్ను॥

త్రివి—నాఁడచచ్చి ఒకఁడేడ్చుచుండ, తోలుకోసము మఱొకఁడేడ్చినట్లు కుమార్తెకై నేనేడ్చుచుండ, పెండ్లో అని నీవు ఏడ్చెదవేమి? ...రాధాకాంతా! జవ్వనులగు కన్యల స్వాధీనపఱుచుకొనుటకు క్షుద్రమంత్రౌషధాది విధానములు కలవా? వారు రహస్యముగ పెండ్లాడిఉండరుకదా.

రాధా-ఓ, కావలసినన్ని. మీరిట్లు జాలము చేయుచున్న, అదియు ఐపోవును.

త్రివి—సేవకులారా! ముందు త్వరగా నడువుఁడు. రాధాకాంతా! వాని కొంపచూపుము; రమ్ము.

రాధా—రండు, రండు. (అందఱును నిష్క్రమింతురు.)

తురీయరంగము—గృహోపరిభాగము.

[జయదేవును, హయగ్రీవుఁడును ఉందురు.]

హయ—దేవా! ఆముసలివాఁడు, రాజునకు కుడిభుజమువంటి మిమ్ము చెప్పు

టకు వీలుగాని తిట్లు తిట్టినాఁడు. కొండవాఁడు, కోయవాఁడు, నల్లవాఁడు, దొంగవాఁడు మొదలగు పేరులు పెట్టి మిమ్ము దూషించినాఁడు.

జయ—(నవ్వుచు) అవును. నేను కొండవాఁడనే; కోయవాఁడనే; నల్లవాఁడనే. మఱి, వానికుమార్తెను ఎత్తుకొనివచ్చిన నన్ను దొంగ అనక దొర అనునా? మనసు నచ్చినపుడు లోకులు భగవంతునే తిట్టుచున్నారు; నేను ఏపాటివాఁడను? మోసపోయిన త్రివిక్రముఁడు నన్ను తిట్టక ముద్దించునా? ఇంతకు మాట లెన్నియైన, ఒకమాడతో సరిపోలవుకదా. నిద్రాహారములు మానినన్ను తిట్టనిమ్ము. నాకేమి? నాకోర్కి ఫలించినదికదా,

హయ—దేవా! తాము ఆకాంతను గాంధర్వవిధిని వివాహము చేసికొనిరా? ......అన్నా! మీకేమి ముప్పవచ్చునో అని జడియుచున్నాను. త్రివిక్రముఁడు జనప్రియుఁడు; రాజునకుకూడ వానికి ఉన్న పలుకుబడిలేదు, కనుక మిమ్ము దండనీతి వాతపెట్టి బాధించునేమో?

జయ—వానిచేతనైనది చేయనిమ్ము. వానితాతముత్తాతలను వానిపక్షమున వాదించుటకు తీసికొనిరానిమ్ము. వారి వాగ్వాదజలధరాళిని, నేనీరాజ్యమునకు చేసిన సేవానిలము చీకాకుపఱిచి పికాపికలు చేయును. గొప్పలు చెప్పుకొనుటయే ఒకగొప్ప అయిన, వానితలపైనున్న వెండ్రుకలన్నిటికిని నాలుకలువచ్చి నాకు వ్యతిరేకముగా సాక్ష్యమీయ సాహసించినను నావలన వీరస్వర్గమును చూఱగొనిన వైరిసింహులువచ్చి వాకట్టుకట్టెదరు. హయగ్రీవా! పలువలుకులేల?

శా. రానీ సైన్యము నన్ను పట్టుకొనఁగా, రానీబహిష్కారమున్;
పోనీ రాజునకాగ్రహాంబోదవినక్, పోనీ మదుద్యోగమున్;
కానీ కాఁగల కష్టనష్టములు, వే కానీ మఱేదుర్నయం
బైనన్; కాని సతీమణిన్ విడువ నాప్రాణాంతపర్యంతమున్.

(ఒకవంక చూచి) ఏమా వెలుతురు? ఎవరావచ్చువారు?

హయ—మఱెవరు? దురాగ్రహయత్తచిత్తుఁడగు త్రివిక్రముఁడను, వాని

బంధువిత్రాదులును, మిమ్ము పట్టుకొనవచ్చుచున్నారు. నామనవివిని లోనికి వెళ్లిపొందు.

జయ—ఛీ, పిరికిపందా!...రానిమ్ము. అస్మదురుబాహుసారమును రుచిచూడనిమ్ము. ఇట్టి పురకముల అనేకముల నిమిషమాత్రమున నిర్మూలము చేసిన ఈజయదేవు వెన్నుచూపునే?... కారు, వారు కారు. నానహోదోగ్యోగియు, రాజభటులును వచ్చుచున్నారు.

[రాజభటులును, కేశవవర్మయు ప్రవేశింతురు.]

జయ—అయ్యలారా! స్వాగతము. ఎక్కడనుండి ఈసమయమున ఇంతలొందరగా వచ్చుచున్నారు? విపరీతమేమైన కలదా?

కేశ—తమకొఱకే ఇల్లు వెదకుచు వచ్చుచున్నాము. మిమ్ము ఉన్నపాటున తీసికొనిరమ్మని రాజుగారు మమ్ము పంపినారు. ఇదివఱకు మీకై మువ్వురు భటులను పంపిరఁట.

జయ—(ఆశ్చర్యముతో) భూపతి నాకై కబురంపెనా? మువ్వురు కబురంపెనా? ఛా! ఎంతపొరపాటు జరిగినది? కేశవా! ఇన్నిసారులు నాకై ఈరాత్రిపూట కబురంపుటకు కారణమేమైయుండును?

కేశ—నాకంత బాగుగా తెలియదు. కాని పైకబురులవలన తురుష్కులు సర్వద్వీపమును ముట్టడింపవచ్చుచున్నట్లు తెలిసినది. కాన త్వరగారండు; పోదము. ఆదేశమునుండి కబురుపై కబురు వచ్చుచున్నది. రాజుగారు సభ్యులనుకూడ రప్పించి సభచేయుచున్నారు.

జయ—ఆలాగుననా? ఇప్పుడేవచ్చెదను. ఆఁగుము. (లోనికి పోవును.)

కేశ—(నవ్వుచు మెల్లఁగ) హయగ్రీవా! నేఁడు ఈయన నడతఅంతయు అనుమానాస్పదముగ ఉన్నది. ధుందహోనముతో 'ఇప్పుడే వచ్చెద', నని ఇంటిలోనికివెళ్లె. అమ్మగారిని సంపాదింపనా ఏమి?

హయ—(తనలో) ఏమి వీని చమత్కారపుమాటలు! తానేమియు ఎఱుఁగనట్లు నటించుచున్నాఁడు. (పైకి) ఈరాత్రి అమూల్యవస్తువొకటి తనవశ

ము చేసికొనినాఁడు. అటుల చేయుట రాజశాసన సమ్మతంబైన, కాని అదృష్టవంతుఁడని చెప్పవచ్చును.

కేశ—నీ అభిప్రాయమేమో నాకు కొఱుకఁబడుట లేదు.

హయ—బ్రహ్మచర్యాశ్రమమును విడచి గృహస్థాశ్రమమున ప్రవేశించినాఁడు.

కేశ—వీనికి అంతయు అపుడే తెలిసినట్లున్నది. (పైకి) ఎవరీపిల్ల?

జయ—(ప్రవేశించును.)

హయ—ఎవరిపిల్లా?

జయ—హయగ్రీవా! రహస్యమును వెల్లడి చేయకుము; నిన్ను నమ్మినాఁడను.

కేశ—అదిగో, మఱికొందఱు మిమ్ము వెదకుకొనుచు వచ్చుచున్నారు.

హయ—త్రివిక్రముఁడు! త్రివిక్రముఁడు! అగ్గితోఁడు-అతఁడే. లోనికి పోండు.

జయ—ఛీ! మూర్ఖా, రానిమ్ము...మనమే ఆయన నెదుర్కొందము రండు.

(నిష్క్రమింతురు.)

పంచమరంగము—రాజసభ.

[హర్షసాగరుఁడు, సభ్యులు, ఉద్యోగులును భటులునుందురు.]

రాజు-ఉ. దుర్భరనాగఘోటక మదోద్ధత సైనిక పాదఘట్టనా
విర్భితభూపరాగపరివేష్టితదుస్సహసంగరస్థలుల్
నిర్భయవృత్తిఁ జొచ్చి, రిపునేతలఁ గీటడఁగించి, బాహువీ
ర్యార్భటిఁ వైరిసింహుఁడయి రాజిలు ఆజయదేవు నంపెదన్.

సభ్యులు—చిత్తము. మన జయదేవే తురుష్కులను సాధింపఁగలవాఁడు. అతనినే పంపవలెను.

[ఇద్దఱు భటులు ప్రవేశింతురు.]

భటులు—మహాప్రభో, జయము జయము.

రాజు—మీరేమి వార్త తెచ్చినారు?

1. భటు—తురుష్కులు రోహిణీప్రక్కనుండి సర్పద్వీపమును ముట్టడించుట

కే వచ్చుచున్నారని, తమకు జయరుద్రప్రభువుగారు విన్నవింప మన్నారు.

రాజు—మంచిది. ఎన్నిఓడలతో వచ్చుచున్నారు?

2. భటు—ముప్పది ఓడలతో వచ్చుచున్నారు.

రాజు—సర్వద్వీపమునకే అని ఇపుడు స్పష్టపడినది. కాని, జయదేవెక్కడ?

1. సభి—అదిగో, జయదేవ త్రివిక్రమవర్మాదులు వచ్చుచున్నారు.

[జయదేవు, త్రివిక్రమవర్మ, రాధాకాంతుఁడు మొదలగువారు వత్తురు.]

రాజు—సేనానీ, మనవిరోధులు తురుష్కులపైకి నిన్ను పంప పిలిపించినాము. అయ్యా, త్రివిక్రమవర్మా, దయచేయుఁడు. తమ సహాయ్యము నేఁడు మాకు లభింపనందుకు విచారించుచున్నాము.

త్రివి—నేనుకూడ విచారించుచున్నాను. తామంపిన వర్తమానము నాకందలేదు. ఇంతకును నేనింటిలోలేను. మహావిచారప్రవాహమున పడి కొట్టుకొనిపోవుచు, పార్థివనాకచేతికందుబడిలో నున్నదని విని, ఆశాబలంబున ఇటు ఈఁదుకొనుచు వచ్చితిని. నన్ను కాపాడుభారము తమమీఁద వేసితిని. పిమ్మట తమచిత్తము, నాభాగ్యము.

రాజు—మీకువచ్చిన ఆపద ఏమి?

త్రివి—ఏమిచెప్పుదు? సిగ్గు! సిగ్గు! నాలుక ఆడకున్నది. హా! పుత్రికా!

రాజు, సభ్యులు—చనిపోయినదా!

త్రివి—చనిపోయిన, నాకింత విచారమే ఉండదు. కొండలపైనుండి సాధించిన మంత్రౌషధప్రభావమున నాకుమార్తె మతిపోఁగొట్టినాఁడు. నాయింటినుండి లేవఁగొట్టినాఁడు. ఆమెకు నాపైనున్న ప్రేమను, గౌరవమును పాడుచేసినాఁడు. నన్ను పరాభవించినాఁడు. హా! కుమారీ! కుమారీ! నిన్ను చూచుభాగ్యము నాకింక లేదా?

రాజు—ఎంత ఘోరము! ఈఅపరాధమును నాకుమారుఁడు చేసినను, తప్పక దండించెదను. అయ్యా, ఆనీచునిపేరు త్వరగా చెప్పుఁడు.

త్రివి—దేవా! ధర్మస్వరూపులగు తమకనేకవందనములు. ఈ అపరాధి తమమన్ననలందుచు తమరాజ్యాంగణమణి కొక అలంకారమై యొప్పుచున్న ఈజయదేవే.

రాజు, సభ్య—(ఆశ్చర్యముతో) ఇతఁడా!

రాజు—జయదేవా! నీపై మోపఁబడిన నేరమునుగూర్చి నీవేమైన చెప్పుకొనెదవా?

త్రివి—చెప్పకమానునా! అంకునేర్చినవాఁడు, బొంకనేరఁడా?

జయ—న్యాయమార్గానువర్తీ, ధర్మదేవతావతారమూర్తీ, శ్రీహర్షసాగరచక్రవర్తీ! నిష్పక్షపాతహృదయులారా, సభ్యశిరోమణులారా! నేను ఈ వృద్ధునికుమారిని తీసికొనిపోవుట నిజము. నిజముగా ఆమెను నేను గాంధర్వవిధిని స్వీకరించితి. ఈకార్యంబులు మొదట తమచిత్తములకు నేరములని తోఁచవచ్చును. కాని, మావృత్తాంతము సాంతముగా వినిన పిమ్మట వేరుగా తోఁచవచ్చును. మొదటినుండి తమవలె నాగరీకతలేని మోటుమానిసినగుటచే మీహృదయకమలములను ఆకర్షింపఁగల శక్తియుక్తినైపుణ్యంబులు నామాటలం దుండకపోవచ్చు. పైపెచ్చు, కర్ణకఠోరముగా ఉండవచ్చు. అదియునుగాక, నాకు యుక్తవయస్సు వచ్చినదిమొదలు భీకరసంగ్రామభూముల నిరంకుశాధికారినై నిల్చి, రౌద్రరసావేశమున పరుషవాక్బాణములతోకూడ మత్తరిపుచిత్తకంజాతముల చిందఱవందఱ కావించుటయందే అలవాటుపడి ఉండుటచేతను, గడియాక్రిందట ముష్కరులగు తురుష్కభటులు సర్వద్వీపమును ముట్టడింపవచ్చుచున్నారని విని ఉండుటచేతను, శాంతరస మొలుకుపలుకులతో నేను నిర్దోషినని ఋజువుచేయ నావల్లకాదు. స్వలాభమునకై ముఖస్తుతులు చేయుట నావంశమునలేదు. నక్కవినయములు నాకసహ్యములు. కాన నాస్వభావమెఱిఁగిన తాము, నామోటుమాటలకు కుద్ధుబొనరను నమ్మకమున, యథార్థస్థితిని చెప్పెదను. ఆయనపుత్రిని లోఁబఱచుకొనుట

ను నేనేమి మంత్రతంత్రౌషధముల వినియోగించితినో హెచ్చుతగ్గులేకుండ విన్నవించెదను; చిత్తగింపుఁడు.

త్రివి—నీయందము చూచి మెచ్చి, ఆమెయే వచ్చి పైఁబడినదో?

ఉ. మొన్ననె కన్నులన్ తెఱచె; మోహమదేమొ ఎఱుంగదింకనా
చిన్నికుమారి; రాట్సుతుల చిత్రపటంబులు చూచి సిగ్గునన్
కన్నులు చేతమూసికొను; గట్టిగపిల్చిన ఏడ్చు ముద్దరా
లన్న! నిశీథమందున గృహంబు బెడఁబాయునె? వీనినమ్మునా?

క్షుద్రమంత్రౌషధసాధనముల నాపుత్రికను దొంగిలించినాఁడని సుకీర్తి చెప్పఁగలను.

రాజు—అయ్యా, సుకీర్తి చెప్పినంతమాత్రమున లాభము లేదు. దోషి అని నిర్ధారణ చేయుటకు తగిన సాక్ష్యముగాని, గుఱుతులుగాని, ఉండవలెను. కష్టము వచ్చినపు డీనాలుక పలుతెఱఁగుల పలుకుచుండును. అనుమానముపై నిగాని, ఒక్కనిమాట నమ్మికాని, ఒకని దండించుట శాస్త్రవిరుద్ధము: అధర్మము.

2. సభి—జయదేవా, నీపై జనము మాకు కరతలామలకమే. ఆనవలను నీవు మాయచేసి వశపఱచుకొంటివో లోకాచారప్రకారము వలచి వలపించుకొంటివో చెపుము.

జయ—అయ్యా, నాయింటనున్న ఆసుందరిని ఇక్కడకురప్పించి, ఆమె తండ్రి ఎదుటనే ఈ అంశమునుగూర్చి అడుగుఁడు. ఆమె నేను మోసగాఁడను, మాంత్రికుఁడను అని చెప్పిన, వెంటనే మీరు నన్నుద్యోగమునుండి తప్పించుటయేకాక, శిరచ్ఛేదముకూడ చేయవచ్చును.

రాజు—భటులారా, శీఘ్రముగా వెళ్లి, ఆకాంతను తీసికొనిరండు.

జయ—హయగ్రీవా, నీకామె ఉన్నచోటు బాగుగా తెలియును. కనుక వారికి దారిచూపుము.

హయ—చిత్తము- (సేవకులతో నిష్క్రమించును.)

జయ—ఆమె వరుసంతలో మాయిద్దఱకు మొదట సమావేశ మెట్లైనదో, పిదప అన్యోన్యానురాగ మెట్లు కలిగెనో మనవిచేసెదను. నాయందు దయయుంచి శ్రద్ధతో విన వేఁడెదను.

రాజు—మంచిది. అనృతవాదియు శిష్టుఁడని నీకు తెలియును కదా.

జయ—చిత్తము. త్రివిక్రమవర్మగారికి నాయందు చాల అభిమానము. ఆయన అనేకపర్యాయములు నన్నింటికి రమ్మని పిలిచెను; నేను వెళ్లితిని. ఎప్పుడెప్పుడు ఏయేయుద్ధములకు పోతినో, ఏయేదేశముల ముట్టడించితినో, ఎక్కడెక్కడ ఎట్టిసుఖదుఃఖములను చవిచూచితినో, వినఁగోరెను. నేను చెప్పుట కొప్పుకొంటిని. మిక్కిలి ఆశక్తితో మృణాళినికూడ ఆముచ్చటల వినుచుండెను. నాబాల్యదశయందు, ఒకనాఁడొక మహారణ్యములో నేను వినోదార్థము సంచరించుచుండ, యౌవనమదంబున మిన్నుమన్ను కానక, మహాంధకారభూతము భాస్కరకిరణబాణాగ్నిజ్వాలలకు తాళలేక అవనసీమను దాఁగికొనవచ్చుచున్నదో అని చూపఱ భ్రమింపఁజేయుకాయముతో, పుడమి గడగడవడ కెదువడుపున నడుచుచు, తన దారికడ్డువచ్చు వృక్షరాజముల ఉక్కుకంబమును ధిక్కరించు తుండంబుతో మట్టఁబెట్టి నిజసామర్థ్యవిశేషంబున సంపాదించిన కీర్తిచిహ్నములనఁదగు దీర్ఘదంతములతో పెల్లగించి సూర్యునిముఖముపై విసరుచు ఒకపున్నాగము నన్ను చూచి వెంటాడి నానడుమును పట్టుకొని బంతివలె ఎంతమీఁదికి విసరినదో, అపుడు ధైర్యముపోనాడక నడుమ నుక చెట్టుకొమ్ము నుపట్టుకొని, దానికాలిక్రిందపడి చావకుండ ఎట్లు కాపాడుకొంటినో, యౌవనగర్వాతిశయమున నేనుకప్పుడొక పెద్దపులితో పిలిచికయ్యము తెచ్చి, ఇరువురము కలయఁబడి దండపట్టుపట్టిపట్టి అలసిసొలసి, తుదకు దానిని కొఱప్రాణములతో ఇంటికెటుల లాగుకొనిపోతినో, భీకరసంగరరంగములందు వినువారికుండె లవియఁజేయు మహోపద్రవములే చొప్పున తప్పించుకొంటినో, మామకప్రచండదోర్దండబలాతిశయమున

ఏయే పట్టణముల మట్టిమల్లాడి నిర్మానుష్యము చేసి విడిచిపెట్టితినో, అస్మదుగ్రప్రతాపశిఖిశిఖాదయమునఁబడి, శత్రుశలభంబు లేవిధంబున మందునకైన కానరాకుండ దగ్ధమైరో, ఒకపట్టున విరోధులచే పట్టువడి బానిసెగా అమ్ముఁబడి పలుబాముల పాలై, ఎట్లు తప్పించుకొని వచ్చితినో; అహోరాత్రములు నిద్రాహారములు లేక నెలలకొలఁది శాత్రవులను తఱుముచు, వారినిపట్టుకొన అంధకారబంధురములై క్రూరసత్వాశ్రయములైన ఏయే గుహల దూఱితినో, మేఘముల మూర్ధాడఁబోవుచున్న పర్వతముల నెట్లెక్కితినో; అప్పడములవలె మనుజులను వెళ్లవెళ్ల విఱిచి విందారగించు నరభుక్కుల ఎక్కడెక్కడ తాఱ్కొంటినో, చంకలలో తలలుండు మనుజుల నెచ్చట చూచితినో, ఇంకను వివిధములగు వింతల నెక్కడ కాంచితినో ప్రతిదినమును చెప్పనారంభించితిని. మృణాళిని మిక్కిలి ఆసక్తితో వినుచుండెడిది. ఇంటిలో ఏదైన పనిఉన్న వెళ్లి చేతనగునంత త్వరలో చేసివేసి తిరిగివచ్చుచుండెడిది. నన్ను ప్రతిరోజును చూచుచుండుట చేతను, నా చరిత్ర ఆమెకు రుచికరముగ ఉండుట చేతను, ఆమెకు నాదగ్గఱ చాల చనువు కుదిరినది. ఆమె తండ్రి ఇంట లేనపుడు కూడ నేనామెకు ముచ్చటలు చెప్పువాడుకకలదు.

త్రివి—అదే నాకొంపతీసినది.

జయ—ఇటుల కొన్ని దినములు జరిగినపిమ్మట,

చ. నను కనినప్పుడెల్లఁ జిఱునవ్వుల నవ్వుచు, పాదుసిగ్గు రాఁ
గనె తలదించి నన్ను కడఁగన్నుల చూచుచు, టక్కు టెక్కులన్
కనులకు విందుచేయుచు, మనస్సు కలంప ఒకింత పైఁటకొం
గును సడలించి, మాటుపడి గోటుగ దాఁగుడుమూఁతలాడుచున్,
చనుతిఱి తెప్పవేయక విచారముచే ముఖమింత వాడఁగా
కనఁబడునంతఁదాక నను కాంచుచు, 'తప్పక నాన్నగారు ర

మ్మనుచుని రెల్లి', అన్ను కబురంపుచు సొంపుగలట్టి, నామనం
బు నపహరించె ఆచెలియె మోహనమంత్రవిశేషమై పుణేన్.

ఒకనాఁడు నేమిద్దఱమే యుంటిమి. అపుడు నాకష్టములను తెలుపుమండ, ఆమెవిని విచారించుచున్నదనుటకు ఋజువుగా నేఁడికన్నీటిబొట్టులరాల్చెను. పిదప నావిజయంబుల నాలకించి సంతోషించుచున్నదనుటకు సూచనగా లేనవ్వుపువ్వుల వెదజల్లెను. అంతట, ఆకాంతామణి నాయిడుమలు తనచెవులఁ బడకుండనుండిన బాగుండునని నిట్టూర్పువిడిచి, సాంతముగా వినుటకు చాలినంత ధైర్యము దేవుఁడు తనకిచ్చినందుకు సంతోషించి, చెప్పినందుకు నాకు వందనములర్పించి, నర్మగర్భితముగా ఇట్లువచించెను. నాస్నేహితుఁడెవఁడైన ఆమెను పెండ్లాడఁగోరిన, నాచరిత్రము నేను చెప్పినచొప్పున అతఁడు చెప్పునటుల నేను నేర్పిన, తప్పకాతఁడు మనోరథసిద్ధి నొందఁగలఁడని మందహాసముతో నుడివెను. ఆ హెచ్చరిక నామనోభీష్టమును వెల్లడించుటకు అవకాశమిచ్చెను. ఆమె నాచరిత్రమును విని నన్ను వరించినది. నాకష్టసుఖములను తనవిగా భావించుటచే నేనామెను వరించితిని. ఇదియే నిజస్థితి. ఇందేమి మంత్రతంత్రౌషధము లున్నవో బుద్ధిమంతులగు తాము ఆలోచించి తీర్పుచెప్ప ప్రార్థించెదను. అదిగో, ఆమెయు వచ్చుచున్నది.

[హయగ్రీవుఁడు, మృణాళిని, రాజభటులు ప్రవేశింతురు.]

రాజు—వీని అద్భుతచారిత్రము నాకూఁతురు డెందమునైన హరింపఁజాలును. అయ్యా, త్రివిక్రమవర్మా!

గీ. చెడిన సుతనువిడిచి దుఃఖపడుటకంటె
తప్పుసైచి ప్రేమించుటే ఒప్పిదంబు;
రిక్తహస్తముకంటె వేరెట్లు హెచ్చు
కాదె పోరాడ విఱిగిన కత్తియైన?

త్రివి—దేవా, దయచేసి యీమె యేమిచెప్పునో చిత్తగింపుఁడు. ఈమె కూడ వానిని మనసార వలచినట్లు చెప్పిన, నిరాశ చేసికొనెదను. అమ్మా, ఈసభలో నీవు ఎవరికెక్కువ విధేయత చూపవలెనో ఎఱుఁగుదువుకదా!

మృగా—ప్రియజనకా! నన్ను కనిపెంచి విద్యాబుద్ధులు చెప్పి చెప్పించి, ఇంత దానిఁగా చేసిన తమకెంతయు విధేయురాలను. నాచర్మమొలిచి చెప్పులుగాకుట్టి మీకిచ్చినను మీఋణము తీర్చుకొనలేను. కాని పెండ్లి అగునంతవఱకే పుత్రిక తల్లిదండ్రులసొత్తు. పెండ్లియైన, నాథునిసొత్తగును. అందుచే నాతల్లి తనతండ్రికంటె ఎక్కువగా మిమ్ములను చూచినట్లే నేనును నాప్రభువును చూడవలయుననుట నిరాక్షేపణమనియు లోకాచారమనియు నానమ్మకము.

త్రివి—ఓసీ, మందమతీ! నాఆశ నిరాశచేసి, నాపరువు తీసివేసితివికదే!

చ. వరకులశీలరూపవిభవాదులఁ బేరు గడించి మించు స
ద్వరునకు ధారపోసి నిను తత్ఫలమందెదు వేడ్కనుండ, ఈ
సరణిని ఒక్కనీచకులసంభవు మాటల నమ్మి లేచిపో
నరిదె గృహంబునుండి? మఱి క్షత్రియకాంతల కిద్దికూడునా?

మృగా-ఉ. కూడిన, కూడకున్న, మదిఁ గోరినకాంతుని ఈమహాత్మునిన్
వీడఁగలేక, మీదరిని నేనిఁక నిల్వఁగ వీలుగాక, మీ
వేడుక తీర్పలేక, మఱి పేర్మియునాజ్ఞను మీఱఁబోక, మా
రాడఁగ నోరురాక, ఇటులయ్యె; క్షమింపుఁడు తప్పులున్నచో.

త్రివి—ఓసీ, కులటా!

సీ. కాటుకకంటెను కడునల్లగా నుండు
వానిమోమునుచూచి వలచినావొ?
రుబ్బుఱాయివిధాన దుబ్బుగా పెఱిగిన
వానిపెదవిచూచి వలచినావొ?

గుండుపిల్లికనుల కైవడి నొప్పెడు
వానికన్నులుచూచి వలచినావొ?
రావిచిగుళ్ల సరణిఁ ఎఱ్ఱగానుండు
వానితలనుచూచి వలచినావొ?
వానిరసికత్వమునుచూచి వలచినావొ?
వానిమాటనేర్పునుచూచి వలచినావొ?
దేవుఁ డిచ్చినకన్నులు తెఱచి, మంచి
వరుని తగువాని, ఎంచుకో వలదె? తులువ!.

మృణా—నాన్నగారూ! మీరాయనను నాకన్నులతో చూచిరేని, రూపజితమారుఁడని సంతోషింపక మానరు. మీకంటికి ఇంపుగాఉండువాఁడు నాకు కురూపివలె అగపడును. నాకంటికి ఇంపుగాఉండువాఁడు, మీకు కురూపివలె కనఁబడును. కనుకనే పూర్వులు, 'లోకోభిన్నరుచి', అని విశేషానుభవముపై అన మొదలుపెట్టినారు.

శిబి—నీవాక్చాతుర్యమున నానోరు మూయనెంచుచున్నావా? పశువా?

గీ. నిన్నుపోలు కృతఘ్నుల నీచమతుల
మోయఁజాలక భూదేవి మూల్గుచుండు
అప్పుడప్పుడు; భూకంప మందురదియె:
కాన అల్లుఁడ నేమోయఁగలనె? పొమ్ము.

జయదేవా! ఇటురమ్ము. నామనస్ఫూర్తిగా నీకీయఁదలంచుకొనని కాంతను నీవె చేకొంటివి; కావున ఇపుడు మనస్ఫూర్తిగా ఇచ్చుచున్నాను. చేకొనుము. పుత్రికారత్నమా! నీతరువాత ఇంకొక కూఁతురు లేనందుకు సంతోషించుచున్నాను. ఉండెనేని, నీవలె ఆమె చేయకుండ కట్టుదిట్టములు చేసి బాధింపవలసివచ్చును. దేవా! ఇఁక తమపని కానిండు.

రాజు—అయ్యా, ఈరమణీరమణులు భవత్ప్రీమాస్పదులగుటకు నేను రెండు

మాటలు చెప్పెదను. ప్రయత్నములు నిష్ఫలములైె అనుకొనని మహాద్విపత్తువచ్చినపుడు ఓర్పును చిక్కఁబట్టుటే శ్రేయము. మఱి విచారించుట, లేనికష్టమును కోరితెచ్చుకొనుట. దొంగనుదూచినన్విన, వానివిజయోత్సాహము శూన్యమగును. పోయినవస్తువునకై విచారించువాఁడు, తన మనశ్శాంతిని తానే దొంగిలించినవాఁడగును.

త్రివి—నిజము, నిజము. తమహితములు మనరాజ్యకార్యములందుకూడ వర్తించును. ఒకవేళ తురుష్కులు సర్వద్వీపమును తీసికొనినను, మనము నవ్వుచున్నంతవఱకు, మనకదొకనష్టము కానేరదు...ఇట్టినీతులు చెప్పుట సులభమేకాని అవి విచారగ్రస్తుని మఱింత బాధించును. నేనింతవఱకును, మనోవేదన కల్గారు హితవచనౌషధంబులను చెవులలో పోయుట, ఎక్కడను చూడలేదు. దానికేమి? ప్రస్తుతాంశమును ఆలోచింపుఁడు.

రాజు—సేనానీ, మితిలేని తురుష్కసైన్యములు సర్వద్వీపమును ముట్టడింప వచ్చుచున్నవి. అక్కడ చాలినంత సేనయున్నను, నిన్ను పంపకున్న కార్యము చెడునని సభ్యులేకగ్రీవముగా చెప్పుచున్నారు. నూతనదంపతులను ఎడఁబాపుట పాడికాకున్నను, జనవాక్యంతు కర్తవ్యమ్మను ఆర్యోక్తి ననుసరించి నిన్ను పంపనిశ్చయించితిమి.

జయ—దేవా, నేనేపాదునక్షత్రమున పుట్టితినో కాని నాకు రణరంగస్థలములే క్రీడోపవన సాంద్రతూలికాతల్పములాయె. మఱి వానియందే నాకెక్కువమక్కువ. కాన తప్పక వెళ్లి శత్రుసంహారము చేసెదను. నేను వచ్చువఱకు, ఈసుకుమారిని తగునటుల కాపాడ వేఁడెదను.

రాజు—నీకిష్టమైన, ఆమెను తండ్రియింటనే ఉండనిమ్ము.

త్రివి—నాగృహములో అడుగుపెట్టుటకు వీలులేదు.

జయ—నాకంతకన్న ఇష్టములేదు.

మృణా—నాకుకూడ అనిష్టమే. ఆయనకు నేను ప్రతిదిన మగపడుచున్న, మఱింత బాధాకరముగా ఉండును. కాన, నన్ను నానాథుని వెంటపోనీయ

జేఁదెదను. ఆయన బలధైర్యసాహసములు విని ప్రేమించిన నాకు వానిని కన్నార చూచుభాగ్యముకూడ ప్రసాదింతురుగాక.

జయ—పూజనీయులారా! నామందయాన మనవి చెల్లింతురుగాక. ఆమె నా వెంటవచ్చిన, నేను చేయఁబోవుకార్యము మఱింత జయప్రదముగా జరుగునేకాని పాడుకాదు. ఆమెనిచ్చట విడిచివెళ్లఁగలను కాని, అనిమొననిల్చి హోరాహోరి పోరుచున్నపుడు, మోనగాఁడగు మారుఁడు నామనసును నాప్రియురాలివైపు త్రిప్పిన దానిని మరల్చుట దుర్ఘటము. నాచిత్తమిక్కడకు పాఱివచ్చిన, ఏమియుద్ధము చేయఁగలను?

రాజు—సరే, నీయిష్టము. నీవిక్కడమాత్రము జాగుచేయక రెండుగంటలలో బయలుదేఱి వెళ్లవలెను. సభ్యులారా! మనము మరల పొద్దుట తొమ్మిదిగంటలకు కలిసికొందము. సేనానీ! నీ ఉద్యోగికుక్కని ఇక్కడ విడిచివెళ్లము. మాఆజ్ఞాపత్రాదులను వానిచే పంపెదము.

జయ—చిత్తము. నాయందు చాలభక్తి విశ్వాసములు కల హయగ్రీవుని విడిచి వెళ్లెదను. అతఁడే నాభార్యను నావెనుక తీసికొనివచ్చును.

3. సభ్య—మృగాళినిని నీప్రాణసమానముగా చూచుకొనుచుందుము.

త్రివి—తండ్రినెట్లు మోసపుచ్చినదో నిన్నును అట్లే మోసపుచ్చును.

రాజు—త్రివిక్రమవర్మా! సౌందర్యముకంటె సచ్చరిత్రమె శ్రేష్ఠమగుటచే, అల్లుఁడు నల్లవాఁడనిమాత్రము విచారింపవలదు. రండు; పోదము.

(రాజు, సభ్యులు, రాధాకాంతుఁడు, భటులును నిష్క్రమింతురు.)

జయ—విశ్వాసనిధీ, హయగ్రీవా! నాప్రాణము మెవంచనుంచివెళ్లెదను. నీనతిని ఈ మెకుపచారములు చేయనియమించి, మీరుముగ్గురునుకలిసి సురక్షితముగ రేఁపు బయలుదేఱిరండు. నేను నేఁడే వెళ్లెదను. మానినీమణీ! మనవిజయమునుగూర్చి ముచ్చటించుటకు వేళచాలదు. రమ్ము. (పోవుదురు)

తృతీయాంకము.

ప్రథమరంగము—చావడి.

[రాధాకాంతుఁడును, హయగ్రీవుఁడు నుందురు.]

రాధా—హయగ్రీవా!

హయ—ఏమి మిత్రరత్నమా! ఏమి చెప్పఁబోవుచున్నావు?

రాధా—ఇప్పుడు నేనేమి చేయుదుననుకొనుచున్నావు?

హయ—ఇంటికివెళ్లి ప్రయాణమునకు సర్వమును సిద్ధము చేసికొనెదవు.

రాధా—చక్కఁగా కనిపెట్టినావు. నీవు పడవలో ప్రయాణము చేసెదవు. నేను నీటిలో ప్రయాణము చేసెదను.

హయ—ఏమీ? నీటిలోపడి చచ్చిపోయెదవా? నాగర్భశత్రుఁడగు జయపేవునకైన, అట్టి బలవన్మరణము రాకుండుఁగాక! మృణాళినితో చెప్పుట అబద్ధముకాని ఇపుడు నీయెదుటనే నీకు వెఱ్ఱియెత్తినదని చెప్పఁగలను.

రాధా—జీవముతో ఉండుట దుర్భరభారముగా ఉన్నప్పుడు చావునకు వెనుకదీయుట తెలివితక్కువ.

మ. ధనమున్ పెద్దలనాఁటిభూషణములున్ తర్లెన్ గదా చాల; వ
చ్చిన నారీజనరత్నమా పరునిచేఁ జిక్కెన్ గదా; నేఁటితో
మనపేరాశలు నాశమాయెఁ గద; నామర్యాద పోయెన్ గదా;
నను లోకుల్ కని నవ్వుటాయెను గదా, నాజన్మ మింకేటికిఁ?.

హయ—నీటిలోపడి చచ్చిపోయెదవా? అన్నా! నీటిదయ్యమై నేనెక్కి వెళ్లు పడవను ముంచివేసెదవు కాఁబోలు? వెఱ్ఱివాఁడా! చచ్చి ఎవరిని సాధించెదవు? నీటిలో పడుమని నీకు ప్రోత్సాహము చేయుచున్న విచారపిశాచమును నడిసముద్రములో ముంచి చంపుము. అరిషడ్వర్గమును జయింపఁ

గల మనోబలములేనివాఁడు ద్విపాదపశువుగాని మగవాఁడా? పంచేంద్రియాశ్వములను, బుద్ధి అనుకళ్లెము లేకుండ, విడిచిపెట్టిన మనుజరథమెందుకైన పనికివచ్చునా?

రాధా—చావసిద్ధముగా ఉన్నప్పుడు, ఈసంధ్యామంత్రమెందుకు? గౌరవము పోయినతరువాత, కాకివలె నూఱేండ్లు బ్రతుకుటకంటె చచ్చుటే మేలు.

హాయ—ఛా! ఇవేటిమాటలు? ఉత్తమక్షత్రియకుల సంజాతుండవయ్యు, బా వనివలె అపజయము కలిగినపుడు బెగిలిపోయి చావసిద్ధపడెదవేమి? నీ పట్టుదల ఏపంచలపాలైనది? నీవు ప్రాణత్యాగము చేసికొనిన, లోకులు మఱింతనవ్వరా? గౌరవముపోయిన మరల సంపాదించుకొనవచ్చును. కాని, ప్రాణముపోయిన తిరిగివచ్చునా? ఇపుడు నీకువచ్చిన అపకీర్తి ఏమి! నీచేతిలో డబ్బులు ఉన్నంతవఱకు గౌరవమేకాని అగౌరవ మావంతయు రాదు. తెలిసినదా?

రాధా—ఎంతధనమున్న ఏమిలాభము? నాకోరిక ఈడేరలేదుకదా. పైపెచ్చు నేను మోహించిన చంచలాక్షిని ఆకొండవాఁడు నిండుసభలో చేపట్టినాఁడు. ఈపరాభవమును నేను భరింపలేను. నాకిఁక మరణమే శరణము. మిత్రమా, పోయెదను; నన్ను మఱచిపొమ్ము. (పోఁబోవును.)

హాయ—(పట్టుకొని) నామాటవినుము. చెడిపోకుము; ధైర్యముచిక్కఁబట్టుము. స్నేహితుఁడు దుర్మార్గములో పడి పాడగునపుడు, వానిని సన్మార్గములోనికి త్రిప్పి బాగుచేయుట స్నేహితోత్తముని విధి. కనుక నిన్ను నేను విడిచిపెట్టను. కొద్దిరోజులలో నీమనోరథము సఫలమగును; నామాటనమ్ముము. నిరుపమ నిష్కళంక గౌరవనిదానము ధనము; సర్వజనవశీకరణ సాధనము ధనము; సకలాభీష్టసంధానము ధనము; సకలకష్టధ్వానము ధనము; శత్రుహృదయ పుటభేదనము ధనము. అధనము నీయింటిలో పెట్టెలలో పెట్టి బంధించఁగా ఊపిరాడక మూలుగుచున్నది. అది పైకి తీయుము. నాతో యుద్ధమునకు రమ్ము; ఒరులు నిన్ను పోల్చుకొనకుం

డ మాయగడ్డము పెట్టుము; సొమ్ము తెమ్ము. వృగాళిని అనల్లవానిని సదా ప్రేమించుచుండుననుమాట కల్ల; నీవుమాత్రము సొమ్ము తెమ్ము. కొండ వాండ్రు చపలచిత్తులు; కోఁతి కొబ్బరికాయ ననుభవింపనేరదు. కనుక సొమ్ము తెమ్ము. రాజునుచూచిన కన్నులతో మగనినిచూచిన మొత్త బుద్ధి పుట్టుట సహజము; తేఁగలిగినంత సొమ్ముతెమ్ము. ముమ్మాటికి ఆమె న్మైలా డి నీసొమ్మే; సొమ్ము తెమ్ము. ఏరీతినైన నీకాసుందరిపొందు లభింపఁజే సెదను; త్వరగా సొమ్ము తెమ్ము. నామాట నిలుపుకొనెదను. ఆకోయవా నిని వరాభవించితీఅదను. పొమ్ము; సొమ్ము తెమ్ము. నీకింకను చావవ లెనని ఉన్న, ఆదివ్యమంగళ విగ్రహమును మనసార కౌఁగిలించి ము ద్దాడి పిమ్మట చచ్చిపొమ్ము; పొమ్ము; సొమ్ము తెమ్ము.

రాధా—నీకు కావలసినంత సొమ్ము తెచ్చెదను. కాని, ఆముద్దుగుమ్మను ఒ క్కసారి ముద్దిడుకొను భాగ్యము నాకు లభింపఁజేసెదవా?

హాయ—అబ్బ! ఎన్నిసారులు చెప్పమందువు? నీఅనుమానమే కార్యసిద్ధికా కుండ చేయుచున్నది. అనుమానము పెనుభూతమందురు; ఎఱుఁగవా? కార్యసిద్ధి అగునని దృఢనిశ్చయుండవై ఉన్న, ఈసరి కాకేసరిమధ్య నీతో సరసనల్లాపము లాడవలసినదే. కాని తేలిపోయినది. ఇప్పుడైన మించిపోలేదు. నేను చెప్పినటుల చేయుము. సొమ్ము తెమ్ము.

రాధా—ఎప్పుడు ప్రయాణము?

హాయ—ఈవేళనే.

రాధా—సరే. నేనింటికివెళ్లి సర్వమును సిద్ధము చేసికొనివచ్చెదను.

హాయ—మంచిది; ఎందుఁగానిపడి చనిపోకుమా...సొమ్ము తెమ్ము.

రాధా—ఇపుడు నాబుద్ధి మాఱిపోయినది. ఎవరినైన పడఁద్రోసెదనుకాని నేను పడను.

ఉ॥ అమ్మెద........................॥ పోనెదను. (పోవును.)

హాయ—(తనలో) ఎవఁడైన కష్టపడకుండ ధనము సంపాదింపఁగోరిన,

ఇట్టి అమాయికుని వెదకి పట్టుకొనవలెను. వీనితాతముత్తాతలు గడించిన ద్రవ్యమును వీనిదగ్గఱనుండి గరళము పిండినట్లు పిండకుండ విడుతునా? ......ఎప్పుడైన, ఒకఁడు చెడినఁగాని వేరొకఁడు బాగుపడఁడుకదా. ఒకనిసొమ్ము అపహరించుట పాపమనియు, అన్యాయార్జితము నిలువదనియుకొందఱందురు. ఆమాటలు వట్టిబూటకములు. ఏవిధముననో పదివేలు కూడఁబెట్టినవాఁడే మగవాఁడు. యముఁడు పాపాత్ములను దండించునని పాపాత్ములు వ్రాసినపుస్తకములలో నున్నది. ఆపాపులవ్రాఁతలు సత్యములా?......ఒకవేళ నిజమైనను, ఆయముఁడు నేను బ్రతికియున్నంతవఱకు నన్ను ముట్టుకొనలేఁడుకదా. అంతవఱకు సుఖముగా నుండవచ్చునుగదా. పాలునేతుల వర్ధిల్లుచున్న నానుకుమారశరీరమును ఏమియు చేయలేఁడుకదా. చచ్చినతరువాత నేనైనఁడనో యముఁడెవఁడో? కాలమునుబట్టి మనుష్యుఁడు నడువవలెను. ఈరోజులలో న్యాయముగా నడిచిన, కడుపునిండ తిండికూడ దొరకదు. అన్యాయమునకు లోఁబడిన కావలసినంతడబ్బు. కష్టార్జితమునుబట్టి ఎవఁడును ఒకనాఁటికి భాగ్యవంతుఁడుకాలేఁడు. పరులకొంపలుకూల్చిరో, దివాలాలుతీసిరో, తప్పుపత్రములువ్రాసిరో, అమాయికులను బెదరించిరో, లంచములు లాగిరో, నమ్మినవారికి పంగనామములుపెట్టిరో, ఎందఱో ధనవంతులైనారు. వారందఱు నరకములోపడిన, నేనును పడెదను. నలుగురితో చావు పెండ్లితోసమానము. (పోవును.)

ద్వితీయరంగము—సముద్రము.

[మృణాళినీ హేమాంగులు, హయగ్రీవ రాధాకాంతులు,
జాలరులును పడవలో నుందురు.]

1 జాలరి—ఓరె, పైడిగా, నక్కసాగ వళ్ళిగిలిచ్చుకోని సోద్దెం సూత్తుండావేటా? చెయ్యిరా, చెయ్.

2 జాలరి—ఓరే! వల్లకోరా, సారపాట్లూ! నాకేస్తుండాను గానంటావా?

1 జాలరి—పెదబాబో! ఆలకించావంటావా? ఆడిమాట్లు? గుండెకవిఁకిపోయీనాగ గుమికీడునా?

2 జాలరి—అఁ- గుమికేర్కత్తాడా? తండేలుబాబు! ఇంకెనాగ? ఆడిముక్కు, ఆడోటం, సిలకట్టుకట్టుకోని- సిన్నమాఁవ। నన్నుసూసినవ్వినాడు- సిన్నమాఁవ॥- అని ఆడిసిలకట్టు సూడండావా?

3 జా—వల్లకోండావా, వల్లకోండావా. సరింగాఎయ్యండావా- అమ్మగారు జడుత్తాలు. బాబుగారు ఇనాంఇత్తాలు.

రాధా—ఓయీ, జాలరులూ! దెబ్బలాడక మంచిపాటపాడుఁడు. బహుమాన మిచ్చెదను.

4 జా—మాకేటి ఒత్తాయిబాబూ. మీలాంటికావందులు పాడితే మాలాంటి మూర్కులు ఇని సంతోసిత్తాలు.

రాధా—మీకువచ్చినపాటే పాడుఁడు. నేనును మీతోకలిసి పాడెదను.

అందఱు—బేస్, బేస్. అదిబాగుంది.

పాట:—సంతాలో మేలైన సీరకొంట- రామొగుంట॥ సంత॥
చక్కానిగుళ్లపేరు తప్పకుంట- నీకెకొంట॥ సంత॥
వావివరుసలడ్డులేదు నీకునాకు- సిట్టిపిల్ల!
నీవంతె కోడలాదు నానంతె మామాదు- హైలెసా॥ సంత॥
నిన్నుసూసి నామనసు సెదిరిపోయె- సిన్నిపిల్ల
నన్నుసూడెకన్నులిప్పి నీకునాకుజోడాసుమా- హైలెసా॥ సం॥

తృతీయరంగము—సముద్రపుటొడ్డు.

[మృణాళినీహేమాంగులును, కేశవరాధాకాంత హయగ్రీవులును పొరులు నుందురు.]

కేశ—అయన ఇంకను రాలేదు. ఎక్కడ ఉన్నదియు తెలియదు.

మృణా—అయ్యో! ఇదేమి మాయ? మీరిద్దఱును ఎప్పుడెక్కడ విడిపోయినారు?

కేశ—నడిసముద్రములో తుపాను మమ్ము విడఁదీసినది.

(లోపల. 'పడవ, పడవ', అను కేకలు ఫిరంగులధ్వనులు వినఁబడును.)

పౌరు—అయ్యా, మేము ఆసందడి ఏమో చూచివచ్చెదము. (పోవుదురు.)

కేశ—కాంతామణీ! విచారింపకుము. నీనాథుఁడు వచ్చుచున్నటులున్నది.

హాయ—(తనలో) వీరిద్దఱు ఇంత చనువుగా ఉండుట చూడ నాకడుపు మండుచున్నది. ఈచనువను పవనలో జయదేవుని యీర్ష్యాగ్నిని రాఁజబెట్టి ఆ కేశవశలభమును భస్మము చేసెదను. (ప్రకాశ) అదిగో! భాంకారనాదము సేనాధిపతిరాకను చాటుచున్నది.

మృణా—కేశవా! రమ్ము. ఆయన నెదుర్కొందము.

[జయదేవ, పౌరులు, సేవకులును ప్రవేశింతురు]

జయ—ఆహా! ప్రాణేశ్వరీ!

మృణా—హా! ప్రాణేశ్వరా!

జయ—నీవెక్కివచ్చిన పడవగతి ఏమైనదో, నీవేమైతివో, ఎట్టివార్త వినవలసి వచ్చునో అనుభయవిషాదములపాలై తొట్రుపడుచు వచ్చుచున్నాను. నాకంటె ముందుగ నీవే సురక్షితముగ ఒడ్డునపడితివా? ఓ నాహృదయానందమా! నీమందహాసశరదిందుకాంచితసుందరముఖారవిందమును దర్శింపఁగానే నాశ్రమలన్నియు సన్నగిల్లెను. కష్టములవెంటనే ఇట్టిసౌఖ్యము వచ్చునేడ, ఎన్నికష్టములైన భరింపవచ్చును గదా. నిన్ను కన్నారఁజూచితిని; ఇఁక చనిపోయినను విచారము లేదు.

మృణా—(చెవులుమూసికొని) అమంగళవాక్కులు శమించును గాక! మనతోనె మనప్రేమాభిమానములును వర్ధిల్లుఁగాక!

జయ—తథాస్తు! మనము సదా ఉమాశంకరుల కరణి నుందుము గాక!

హాయ—(తనలో) ఆరే, దురాత్మా! నీసౌఖ్యానందములను దగ్ధము చేయ నీగర్భశత్రుఁడొకఁడున్నాఁడని ఎఱుంగకున్నావు కదా! తొందరపడ

కము. కొద్దిరోజులలో నీపొంగు పాలపొంగులీల నేలపాలగును.

జయ—కొమ్మా! రమ్ము; మనము కోటలోనికిపోదము. పౌరులారా! యుద్ధములైపోయినవి. తురుష్కులు నీటిలో మునిఁగిచచ్చినారు. హయగ్రీవా! నావడవలోని సామగ్రిని తీసికొనిరమ్ము. కేశవా! రమ్ము.

(హయగ్రీవ రాధాకాంతులుతప్ప తక్కినవారంతయునుపోవుదురు.)

హయ—రాధాకాంతా! మృణాళినీకేశవుల నడువడిని జాగ్రత్తగా కనిపెట్టుచున్నావా? ఆచపలహృదయ కేశవునిపై కన్నువేసినది. వారిద్దొంగచూపులు, మందహాసములు, కనుసైగలును నీవుచూచియేయుందువు.

రాధా—అఁ! ఆమెమనసిపుడు వానిపైపోయినదా? ఛా! పాపపుమాటలాడకుము; నేను నమ్మను.

హయ—ఈ హయగ్రీవుఁడు నవ్వులాటకైన కల్లలాడఁడనిమాత్రము నమ్ముము. దూరపుకొండను సమీపించుచున్నకొలఁది దానిలోపములు బయలుపడురీతిని, ఆరామామణికి ఆకొండవానికోఁతిచేష్టలు, మోటుతనము, విరసము, కురూపము, అనుభవములోనికివచ్చుచున్నవి. మఱొకరహస్యము. అందము చందములేక కాలిన చింతదుక్కవలెనున్న ఆదయ్యముతో ఎన్నాళ్లాసుకుమారి కాపురము చేయఁగలదు? బిత్తరులచిత్తములు క్షణచిత్తములు; వారికన్నులకన్న చంచలములు. కనుక మృణాళినిబుద్ధి ఎప్పుడునుఒక్కరీతిగా ఉండదు. ఆమాలకాకిని మోసపుచ్చి ఏఅర్ధరాత్రముననో ఎవనితోనో లేచిపోవుట నిశ్చయము.

రాధా—ఆమెమదిని ఆకర్షింపఁగల అందగాఁడీలంకలో ఎవఁడున్నాఁడు?

హయ—లేకేమి? స్వదేశీయుఁడు, పరిచయుఁడు, సొగసుకాఁడునగు కేశవుఁడులేఁడా? వాఁడు మొదటినుండియు ఆమెపై కన్నువేసి కుక్కవలె ఆమెచుట్టును తిరుగుచునేయున్నాఁడు. వాఁడు బల్లక్కరి. ఆకొండవానిని మధ్యపెట్టి ఆమెను ఇంటినుండి లేవఁదీసినాఁడుకదా. ఇపుడు తగుసమయమున కెదురుచూచుచున్నాఁడు.

రాధా—అయితే నాగతియేమి? చెల్లని కాసువలె తిరుగుటయేనా? అన్నివిధముల నాకు క్షౌరమే?

హాయ—నేనుండఁగా నీకు క్షౌరము చేయువాఁడెవఁడు? కొద్దిరోజులు తాళుము; నీకు పెండ్లికత్తెర వేయించెదను. కొండవంటి జయదేవుని మనము లక్ష్యపెట్టినపుడు, పక్షిగాఁడు కేశవుఁడొకలెక్కా?

రాధా—విశ్వేశ్వరుని పెండ్లికి వేయివిఘ్నములను సామెత నాకును సరిపోయినది. అడుగడుగునకును గండమే? ఈక్రొత్తగండము గడుచుట ఎట్లో బోధపడకున్నది.

హాయ—మొదట మనము కేశవుని అణఁచివేయవలెను. అందుకొక ఉపాయము చెప్పెద; వినుము. నేఁటిరాత్రి వాఁడును నేనును దండుదిగిన తావున కావలిఉండక తప్పదు. నీవుకూడ అక్కడకు రమ్ము. వానితో ఎట్లైన పిలిచికయ్యము తెమ్ము. వాఁడు ముక్కోపి; రెండు దెబ్బలు కొట్టినను పడును. చేతనైన నీవును తన్నుము.

రాధా—ఓ; ఒకనిముషములో దెబ్బలాట తెచ్చెదను. నీవుమాత్రము నాకు దగ్గఱగా ఉండవలెనుసుమా.

హాయ—అలాగే ఉండెదను. నీవు దెబ్బలాట ఎట్లైన తెచ్చితివేని, నేనీద్వీపమంతయు అల్లకల్లోలము చేసెదను; కేశవునికి ఉద్వాసము చెప్పించెదను. మూఁడువంతు లీఉపాయమున మనకోర్కె కావచ్చును. ఈఅడ్డు తెగఁగొట్టకున్న, మనకార్యము సాగదు; ముఖ్యముగా నీవాంఛ తీరదు.

రాధా—అలాగా? బూతులు తిట్టినైన, ఱాళ్లు రువ్వినైనను జగడము పెట్టెదను.

హాయ—సంతోషమే. నీవు రాత్రి తప్పక రమ్ము. నేను కోయవాని సామాను తెచ్చుటకు వెళ్లెదను.

రాధా—సరే; పోయెద. (పోవును)

హాయ—(స్వగతముగ) కేశవుఁడామందయాన పొందుకై చాపక్రింది నీరు

చందమున ప్రయత్నించుచున్నాఁడనుటకు సందియము లేదు. ఆటక్కలాడికూడ వానిపైకన్ను వేసినది. కాని, పాపము! జయదేవు, నావగవాఁడైనప్పటికిని, నిష్కళంక ప్రేమాభిమానములతో ఆమెను చూచుచున్నాఁడు... పాపమునకు జంకనినాకును తత్ఫలమును రుచిచూడవలెనని యున్నది. ఇందుకు ముఖ్యకారణము నాకాకోయవానియెడఁగల ద్వేషమే కాని కామేచ్ఛ కాదు.

చ. నయవినయంబులన్ మసలునన్నొకఅల్లునిగా తలంచి, ని
ర్భయమున నాపనిన్ మఱొకబాలికు కిచ్చుటెకాక, భూవర
ప్రియుఁడగుటన్ మదించి, తన పెండ్లముతోడుతఁ తృప్తిగాక, దు
ర్నయుఁడయి నాసతిన్ చెఱచినాఁడని నాకనుమానమయ్యెడున్.

ఈద్రోహమును తలఁచుకొనిన, అగ్గిపై గుగ్గిలము చల్లినటుల నాఒడలు భగభగమండుచున్నది. ఇంతకంటె పరాభవమున్నదా? కుక్కకాటునకు చెప్పుదెబ్బయే మందనునట్లు, ఏరీతినైన వానియిల్లాలిని చెఱచినఁగాని నాకు తృప్తి కాదు. కంటికికన్ను, పంటికిపన్ను, అనునటుల నతికి నతియే సరి. ఒకవేళ ఈయెత్తుసాగకున్న, నామనసిపుడెంత కలఁతపడుచున్నదో అంతకు వేయిరెట్లు, ఆకొండవానిమనసు కలఁచి, వాని సౌఖ్యానందములను చెఱచి, తుదకు వెట్టియెత్తించి విడిచెదను. (పోవును)

చతుర్థరంగము—కోటలో చావడి

[హయగ్రీవుఁడు, కేశవుఁడు నుందురు.]

కేశ—హయగ్రీవా! చాలరాత్రి అయినది. రమ్ము, సైన్యస్థానమునకు పోదము. నేఁటిరాత్రి తప్పకుండ అక్కడకు వెళ్లి కావలియుండుమని సేనాని సుక్కి సుక్కి నాతో చెప్పిపోయెను.

హయ—వెళ్లుదము. తొందరెందుకు?

ఉ. అమ్మదహంసగామినిని హాయిగ ఆజయదేవు కూడి సౌ

ఖ్యమ్ముల౯ తేలుచుండ, మన మక్కటా! ఈచలిలోన అర్ధరా
త్రమ్మున వెళ్లి దండుగలతావున కావలి ఉండు టెట్లు? సం
ద్రమ్మునఉన్న బల్ తురకదయ్యపుదండు పయిఁబడుంగదా.

కేశ—పీనుఁగులమధ్య నిలిచి పోరాడు మనకడకు దయ్యములు రావు; రమ్ము.

హాయ—వచ్చినను మానినను వెళ్లకతప్పదుకదా. కేశవా! మనసేనాని మంచిఅందగత్తెనే సంపాదించినాఁడు.

కేశ—సందేహమేమి? అందగత్తెలం దందగత్తెఅని చెప్పనొప్పు. చాల అదృష్టవంతుఁడు.

హాయ—ఆవాలుచూపులును, ఆచిఱునవ్వులును, ఆవగలాడి మనోభిప్రాయములను నిశ్శబ్దముగా వెల్లడించుచుండును. జయదేవుమాటకేమి? నీవు చాల అదృష్టవంతుఁడవు. ఆమెమనోహరదృష్టిపథమున నున్నావు.

కేశ—ఆమెకు నాయందు చాలఅభిమానముకలదు. రమ్ము; పోదము.

హాయ—నేస్తమా! ఇంక పదిగంటలు కాలేదు; ఉండుము. నాకాయాత్ర చేసిచేసి ప్రాణము విసిగిపోయినది. అదియునుగాక, చలిచే ఒడలు వడవడవడఁకుచున్నది. కనుక నాలుగుచుక్కలు ద్రాక్షరసము పడినఁగాని చుఱుకుపుట్టదు; రమ్ము.

కేశ—వద్దు, వద్దు. ఈరాత్రి దానిజోలు తలపెట్టవద్దు. అప్పుడే నేనొకగిన్నెడు సేవించినాను. నాకేమియు హెచ్చరికగా లేదు.

హాయ—అమితాయాస విధ్వంసన కారణము, సకలకష్ట నిర్మూలన సాధనము, ఆశ్రితజనసంతానమునకు ద్రాక్షరసాయనమును మించిన సత్పదార్థము వేరొకటికలదా? ఏపనినైన సగము సగము చేసినలాభముండునా? రమ్ము. ఇంకొకగిన్నెడు పుచ్చుకొనుము. ఎవరోవచ్చుచున్నట్లున్నది.

కేశ—నేను చూచివచ్చెదను. (వెళ్లును.)

హాయ—(తనలో) వీనిని బాగుగా త్రాగించి మఱిపోఁగొట్టితినేని, నాయెత్తు నిరభ్యంతరముగా సాగును. జయదేవునకు త్రాగుఁబోతులను చూచిన మి

క్కిలికొనము. కేశవుఁడు త్రాగి అల్లరి చేయక మానఁడు. ఆఅల్లరి హెచ్చు చేయుటకు రాధాకాంతుఁడున్నాఁడు. మఱికొందఱు వచ్చుచున్నారు. అందఱను త్రాగించి పెద్దఅల్లరి చేయించి, మొఱగంటవాయించి, సేనానిని ఇక్కడకు రప్పించెదను. పిమ్మట జరుగుచర్యనుబట్టి మఱొకపన్నాగము పన్నెదను.

[మహేశవర్మ, కేశవుఁడు, రాధాకాంతుఁడు, కొందఱుపౌరులును, సారానీసాలతో సేవకులును ప్రవేశింతురు.]

హాయ-(ఎదురుగ వెళ్లి) దయచేయుఁడు, దయచేయుఁడు-ఈదినమే సుదినము.

మహే—మీకోఱకే మే మిటువచ్చుచున్నాము.

హాయ—చిత్తము. దయచేయుఁడు. కేశవా! జంకెదవేమి? కూర్చుండుము.

కేశ—ఆబుడ్లవైపుచూడ, నాకు భయమగుచున్నది. మంత్రప్రభావమున, ఆతురకదయ్యములను ఈసీసాలలోనికి దించినట్లున్నది.

మహే—మనకసిరీఱ గర్భస్థాపనము చేయుదము; రమ్ము. సేవకులారా! బుడ్లువిప్పి గిన్నెలలో పోయుఁడు.

(సేవకులు గిన్నెలలో సారా పోయుచుందురు.)

హాయ—(ఒకగిన్నె నందుకొని) నేస్తమా, కేశవా! ఈలంకలో సారా నీవెపుడును రుచిచూడలేదు. ఇదే మచ్చుచూడు.

కేశ—(ముఖముత్రిప్పి) నన్నిట్లు బలవంతపెట్టుట నీకుధర్మము కాదు. ఆదుష్టదార్థమును నాకంటఁబెట్టకుము.

హాయ—తప్పు, తప్పు. మనయిలువేల్పు పెరుమాళ్లను నిందింపకుము.

సీ. అఖిలమనోవిచా రాంధకారంబును,
తూలించి దయఁ బ్రోచు ద్యుమణి ఏది?
తనువుపై జగముపై ధ్యానమున్ పోఁగొట్టి,
పరమయోగిగ చేయు గురువ దేది?

కనుల మూసినను లోకవిచిత్రములను క
నఁబఱచు దివ్యాంజనంబదేది?
మహిషాసురాదుల మర్దించుటకు శక్తి
శక్తికిచ్చునమహా శక్తి ఏది?
వానచలికాలముల నిజభక్తవరుల
చలిని పోకార్చు కాశ్మీరశాలు వేది?
అద్ది మనపెరుమాళ్లదయామృతంబు,
సత్పదార్థంబు, ద్రాక్షరసాయనంబు.

నీవు త్రాగకున్న, నన్ను చంపుకొనితినినట్లే. వీరందఱినంతోషమును పా
డుచేసినవాఁడ వగుదువు.

కేశ—సరే; కానిమ్ము. నలుగురితోపాటు నారాయణా. పెద్దలు మహేశవ
ర్మగారికి మొదట ఇమ్ము.

మహే—నాకొకరందీయవలెనా? ఇదిగో త్రాగెదను. మిత్రులారా! ఉప
క్రమింపుఁడు. (అందఱును త్రాగుదురు.)

హయ—(త్రాగినట్లు నటించి) ఏదీ? ఒకచిన్నపాట ఎవరైనను పాడుఁడు.

రాధా, పారులు—ఇదిగో పాడెదము.

కల్యాణి—అట.

కడుపునిండ త్రాగవలె- కమ్మనిసారా, హేమైనసారా।
బలే! బలే! దీనిముందున- పనికిరాదుగా, పంచదార॥ కడుపు॥

హయ—(నిలఁబడి) నిలఁబడి అడుగులువేయుచు పాడిన మఱింత రక్తిగా
ఉండును; లెండు (కేశవుఁడుతప్ప అందఱును నిలఁబడి పాడుదురు.)

ధనము కర్చుపెట్టలేక- త్రాగుటతప్పు మిక్కిలితప్పు।
అనుచు ప్రేలుచుందురు- అజ్ఞములైన ల్రుద్ధులు॥ కడుపు॥
(మరల అందఱును త్రాగుదురు.)

కేశ—(లేచి) ఈయూరిసారారుచి- ఏయూరిసారాకు లేదు।
హాయి! హాయి! ఇంకొకగిన్నె- హయగ్రీవ! ఇటుతెమ్ము॥ కడుపు॥

హయ—(తనలో) ఇప్పటికి వీనికి మత్తెక్కినది. (పైకి) ఇదిగో తాగుము.

కేశ—(తాగి) సానిమేళ మెుక్కటున్న- జావళీలు పాడుచున్న।
ఈనాఁటిసంతోష మెన్న- ఎవ్వారి కలవికాదన్న॥ కడుపు॥

హయ—అవునవును. అది గట్టిలోపమే. సానిలేనిసారా, తావిలేని పూవురీతి శోభింపదు. ఇపుడదికూడ ఉన్న, బ్రహ్మానందములో మనమందఱ మైక్యమైపోవుదుము. కాని ఈసమయమున సానులెక్కడ చిక్కరు. కాని, సానికంటె బాగుగా నృత్యగానాభినయములను నేర్చిన విద్యావంతుఁడొకఁడిక్కడనే ఉన్నాఁడు. అతనిచే పాడించి ఆనందింతము.

మహే, పౌరులు—మంచిఉపాయమే; బాగున్నది. ఆవిద్యావంతుఁడెవరు?

హయ—(రాధాకాంతుని తట్టుచు) ఇతఁడే. అయ్యా, ఈసంతోషసమయము మఱొకప్పుడు రాదు. అందఱికిని మీపాట వినవలెనని ఉన్నది; శ్రమఅని తలంపక ఇందుకంగీకరింపవలె.

రాధా—అబ్బ! నావల్లకాదు. నాకు చాల ఆయాసముగ ఉన్నది.

మహే—అయ్యా! కోరిపాడుమనినప్పుడు మఱిపించుట గాయకులకు లక్షణమైనను, మాప్రార్థన వినకతప్పదు.

హయ—(రాధాకాంతునకు సంజ్ఞచేసి) ఇతఁడు చాలమంచివాఁడు. అందఱును కూర్చుండుఁడు; పాడును. (కూర్చుందురు.)

కమాచి—ఆది.

రాధా— మోడిచేయఁబోకురా- మోహనాకారా! ॥మో॥
నాఁడావదకటింట- నాతో చేసినబాస।
నాఁడే మరచిపోయి- నావా? మనోహర!॥ మోడి॥
(కేశవునిదగ్గఱకువెళ్లి అభినయముపట్టును)

నిన్ను చూచినదాది - నీపై నామది నిల్చె!
అన్నా! కాముని దాడి - కాఁగఁజాల, రార;
వెన్నెల రాత్రులిట్లు - వృథా చేయఁగనేల?
నన్ను కౌఁగిటఁజేర్చి - నాకొక ముద్దియరా॥ మోడి॥

కేశ—ఛీ! త్రాగుఁబోతా, దూరముగా పొమ్ము. (త్రోసివేయును)

రాధా—ఛీ! తులువా, ఏమి నీఆగడము? (గుద్దును)

కేశ—ఇదే వచ్చితివి; కాచుకొనుము. (కత్తితీయును)

మహే—(అడ్డుపడి) కేశవా, ఆగుమాగుము. నీకింత కోపము తగదు.

కేశ—నన్ను విడిచెదవా? లేక నా కృపాణమును రుచిచూచెదవా?

మహే—ఆఁ! ఏమి ప్రేలుచున్నావు? నీమస్తు విఱిచెద; రమ్ము! త్రాగుఁబోతా!

(ఇరువురును పోరుదురు.)

హయ—(రహస్యముగ) రాధాకాంతా! త్వరగా వెళ్లి గంటవాయింపుము.

రాధా—(వెళ్లి గంటవాయించును.)

హయ—అయ్యో! అయ్యో! కేశవా! ఆర్యా, మహేశా! ఆగుఁడాగుఁడు. అయ్యలారా! చూచెదరేమి? అడ్డుపడుఁడు, అడ్డుపడుఁడు. ఎవరా గంట వాయించువారు? కొంప పోయినది. ఓదయ్యమా! గంట నాపుము. కేశవా, నామాటవినుము; ఆగుము.

జయ—(ప్రవేశించి) ఏమీఅల్లరి? ఎవరా దెబ్బలాడువారు?

మహే—హయగ్రీవా, వచ్చితి! కాపాడుము. (మూర్ఛిల్లును)

హయ—కేశవా! ఎవరు వచ్చినారో ఇటుతిరిగిచూడుము.

జయ—మీరిటుల కుక్కలవలె కొట్లాడుటకు కారణమేమి? మనలో మనము పోరాడుట నీచము కాదా? మిమ్ము మున్నీట మునిఁగివచ్చినతురకలు దయ్యములై పట్టుకొనినా ఏమి?... ఛీ! ఛీ! ఆగంట నాపరేమి?

హయ—చిత్తము, చిత్తము. (వెళ్లిగంటనాపివచ్చును)

జయ—ఆభయంకర నినాదము యుద్ధభయవ్యాధిగ్రస్తులగు గ్రామవాసుల

గుండెల చెండువడఁజేయుచున్నది. కేశవా! ఈజగడమునకు కారణ మేమో సాంతముగా చెప్పుము. స్మృతితప్పియున్నావె!

కేశ—దేవా! మీకనేకవందనములు. ఇపుడుచెప్పలేను; మన్నింపుఁడు.

జయ—అయ్యో, మహేశవర్మా! రాజసమ్మానమందుచున్న తమ ప్రస్తుతావస్థను చూచి నాకు చాలవిచారమగుచున్నది. గొప్పయుద్యోగులగు మీరు క్రిందియుద్యోగులకు బుద్ధిచెప్పుటకుబదులుగా, ఇట్లు వారితో కొట్లాడుట తగునా? గౌరవముండునా?...మాటాడరేమి?

మహే—సైన్యాధ్యక్షా! క్షమింపుఁడు, నోటమాట రాకున్నది. ఈకలహకారణమంతయు హయగ్రీవుఁ డెఱుఁగును. ఒకని ప్రాణమును రక్షించుటయు, తన ప్రాణముపోకుండ కాపాడుకొనఁ బ్రయత్నించుటయు దోషములైన, నేనుదోషినే.

జయ—ఏమీ? ఎవరును చెప్పరా? ఈనీచకార్యమునకే నాయొడలు గుల్ల సున్నమువలె ఉడుకెత్తుచున్నది. ఇఁక నాకు పూర్తిగా కోపమువచ్చిన నా ఖడ్గశక్తికెవరు బలియయ్యెదరో తెలియదు. దోషిఎవఁడైననేమి? దండించితీరెదను. హయగ్రీవా, చెపుము.

హయ—అక్కటా! ఆబాధ నాకే వచ్చినదా? ప్రాణమిత్రుఁడగు కేశవునకు విరోధముగా నానాలుక చెప్పఁగలదా? అధికారివచ్చి అడుగుచున్నప్పుడు చెప్పక తప్పదుకదా. ఏమిచేయుదు?...సైన్యాధిపా, అందఱము అన్నదమ్ములవలె కలసిమెలసి ఆటపాటల వినోదించుచుంటిమి. అంత, కేశవుఁడెందుచేతనో కుపితుఁడై, ఇక్కడకువచ్చియున్నవారలో ఒకని తన్నసాగెను. అపుడు మహేశవర్మగారడ్డుపడి కేశవునిపట్టుకొనిరి. పిదప ఇద్దఱకు వాగ్వాదము జరిగినవెనుక కత్తులెత్తి పోరాడిరి. ఇదంతయు వేళావిశేషము. కేశవుఁడు ప్రథమకోపియనుసంగతి తమకు విశదమే. కోపమువచ్చినపుడు మైమఱచుట కొందఱిస్వభావము. మైమఱచి చేసిననేరములను పెద్దలుమన్నింపరా?

జయ—హయగ్రీవా! నీవు విశ్వాసపాత్రుఁడవే కాని ఈ అంశమున అభిమానపాశబద్ధుండవై నీచెలికాని విషయమై నర్ధిచెప్పినావు. సారామత్తు తలకెక్కుటచే కయ్యమునకు కాలుద్రవ్వినాఁడు; కాని, కోపావేశమున కాదు. పశువా, కేశవా!

మ. అడఁచున్ జ్ఞానము శక్తియుక్తుల, పరధ్యానంబులో ముంచు, కా
ఱులుకూయించును, దేహగేహముల నిర్మూలించు నానాఁటికిన్,
తలవంపుల్ కలిగించు, గౌరవమునే ధ్వంసంబు కావించు, ఆ
ప్తులకున్ దూరముచేయు, తుట్టతుద కుద్యోగంబు పోఁగొట్టి శి
ష్యుల దారిద్ర్య మహాసముద్రమున ముంచుంగాదె సారా, ఇసీ!

నీవు చాలమంచివాఁడవే, కాని మన్నించుటకు వీలులేని తప్పుచేసినావు. మిత్రుఁడైనను శత్రుఁడైనను అపరాధి శిక్షార్హుఁడు. త్రాగుఁబోతు నాకడపని చేయుటకు తగఁడు. కనుక నిన్ను ఉద్యోగమునుండి తీసివేసితిని. భటులారా! మహేశవర్మగారిని లోనికితీసికొనివెళ్లుఁడు. నేనేమందు వేసెదను. హయగ్రీవా! పురమును జాగ్రత్తగా చూడుము. (పోవును)

(కేశవుఁడు, హయగ్రీవుఁడు తప్ప తక్కినవారందఱును నిష్క్రమింతురు)

హయ—అక్కటా! మిత్రమా! నీకు గట్టిదెబ్బయే తగిలినది కాఁబోలు?

కేశ—సందేహమేమి? ఈ జన్మములో మానని దెబ్బయే తగిలినది.

హయ—ఛా! అశుభవాక్యము లాడకుము.

కేశ—ఓ గౌరవమా! గౌరవమా! గౌరవమా! నిన్ను సంపాదింప నెక్కెంతో కష్టపడిననన్ను, ఒకక్షణములో విడనాడిపోతివా! అవ్యయంబగు కీర్తికాంత నన్ను త్యజించుటచేత, నేనిపుడు ద్విపాదపశువునైతి. ఓహయగ్రీవా! ఇంక నేనెట్లు జీవింతును?

హయ—గౌరవమున కేమి? వచ్చును, పోవును. గౌరవములేని గౌరవమునకింత వగవనేల? అది సాధారణముగా అపాత్రుని పొందును, అకారణముగ పోవుచుండును. ఈరోజులలో వేషధారులే గౌరవనీయులు.

వేదమునకుతోడు విత్తముకూడ ఉన్న కావలసినంత గౌరవము. ధనార్జనమునకు ఉద్యోగ మొకమార్గము. కనుక, పోయిన ఉద్యోగమును మరల సంపాదింప ప్రయత్నింపుము.

కేశ—సిగ్గులేక ఏమొగముతో సేనాని ఎదుటఁబడుదును? ఉద్యోగమిమ్మని అడుగుటకు నా కాలు కెట్లాడును? ఒకవేళ అడిగినను, త్రాగుఁబోతునని నన్ను నిందించును! శేషునివలె వేయిజిహ్వలు నాకున్నను, ఆమాట వాకట్టు కట్టునుకదా.

హాయ—కేశవా! ఆపిల్లిగడ్డము వాఁడెవఁడు? దీనికంతకును వాఁడే కారకుఁడు.

కేశ—నాకు తెలియదు. మహేశవర్మతో వచ్చినవారిలో వాఁడొకఁడు. వానిని నిందింపనేల? దీనికంతకు కారణము నాగ్రహపాటే.

హాయ—అదిగో! నీకింకను తెలిపిరానటులున్నది. పాటువడ సెల్లని సాపాటురామునివలె మాటాడెదవేమి? మాయాగ్రహపాశకునకు నవగ్రహంబులును జడియునని ఎఱుఁగవా?

కేశ—మాయచే సంపాదించినధనగౌరవములు మీసాలపై తేనెలే. అట్టిధనగౌరవములు నాకక్కఱలేదు.

హాయ—అవును. జయదేవు నీప్రాణసఖుఁడైయుండ నీకేమితక్కువ? నిష్పక్షపాతియని అనిపించుకొనుటకై అంత కఠినముగా మాటలాడినాఁడు. కాని నీయందు దయలేకపోలేదు. అత్తగారిపైకోపమున తనపిల్లను కొట్టుకోడలివలె, మహేశవర్మను ఏమియుననలేక నిన్ను శిక్షించెను.

కేశ—నిజముగా ఆగ్రహము వచ్చియే శిక్షించెను. త్రాగుఁబోతును చూచిన వానికి అఱకాలిమంట నెత్తికెక్కును. ఓ తెల్వితేటలదహించు విషమా! ఆశ్రితులను పశువులుగ మార్చు ద్రాక్షరసమా! నిన్ను చేరుట డబ్బిచ్చి తద్దినము కొనుటయేకదా. నీవు సీసాలో ఉన్నప్పుడు, అమాయికురాలివలె కనఁబడుదువు. కాని, ఈతోలుతిత్తిలో ప్రవేశించితివేని సృష్టికి నాయకమణియగు మనుజుని కోఁతివలె ఆడించి, వానిని అపకీర్తిపంకమున త్రోసెదవుకదా దయ్యమా!

హాయ — ఛా! మాటిమాటికి దాని నిందించెదవేమి? మోహాంధుఁగావాడిన, అది మంచిదయ్యెనే. లోకమున ఒకప్పుడైన, త్రాగనివాఁడెవఁడు? నీమేలు కోరువాఁడనగుటచే ఒకఉపాయము చెప్పెద; వినుము. జయదేవు విపరీత మోహపరవశుఁడై మృణాళినిచేతిలో కీలుబొమ్మవలె చిక్కియున్నాఁడు. ఆమె ఎట్లాడించిన, అట్లాడును. ఆమెకు నీయందు చాలఅభిమానముకదా. కనుక, నీవు ఆమెదగ్గఱకువెళ్లి చేసినతప్పు ఒప్పుకొని, సాయము చేయుమని వేఁడుము. ఆమె శాంతిసమేత; అపారకరుణోపేత. ఆమె తప్పక నీపనిని నీకిప్పించును.

కేశ — సెబాసు! మంచిఉపాయమే. తప్పక వెళ్లెదను.

హాయ — రేపుప్రొద్దుట ఈపని మొదట చేయుము. నీమేలు కోరి చెప్పితిని.

కేశ — రేపువెళ్లి ఆయిల్లాలిఉల్లమును కరఁగించివచ్చెద; సెలవు. (పోవును)

హాయ — మంచిది. మృణాళిని వీనికి తప్పక తోడ్పడకమానదు. కేశవునకు పని ఇప్పుడు, ఆకొండవానిని బ్రతుకనీయను. వాఁడిచ్చిరీరును... అన్నా! నావ్రేలితో నాకన్నే పొడిచికొంటినే! వానిని పాడుచేయుటకే కష్టపడిన నేనేల ఈయుక్తు చెప్పితిని?... అరే, కేశవా! వందిని నందిగాను, నందిని వందిగాను చేయఁగలనేను బ్రతికిఉండ, నీకు మరల పనివచ్చునా?... మంచి ఎత్తుఎత్తినది. వాఁడు ఆకాంతను బతిమాలుచున్నపుడు, జయదేవుని అక్కడకు తీసికొనివెళ్లెదను. తనభార్య పరపురుషునితో రహస్యముగా మాటాడుచుండుట చూచిన ఎవనికైన అనుమానము పుట్టకమానదు. పుట్టకున్న, నేను పుట్టించెదను. దానిని బలపఱచెదను; మఱి స్థిరపఱచెదను. ఆకోయవానిమనసుకలఁచెదను. తుదకు వారిని చెఱచెదను; నాకసితీర్చుకొనెదను. ఇందుకు మొదట కేశవుఁడు నిర్దోషి అని మృణాళినికి ముందుగా నాభార్యచేత చెప్పించెదను. పిమ్మట వారిద్దఱును మాటాడుచున్నపుడు జయదేవుని తీసికొని వెళ్లెదను. (పోవును)

చతుర్థాంకము.

ప్రథమరంగము—కోటలోనితోఁట.

[మృణాళిని, హేమాంగి, కేశవవర్మయు నుందురు]

కమాచి—ఆది

కేశ—తవ ఆశ్రితుఁడను నేను - తల్లీ! శ్రితకల్పవల్లీ!
క్షమించి నానేరమును - సాయము చేయవేఁడెద॥ తవ॥

మృణా-చింతింపఁబోకుమట్టె - చెప్పెద నేనానితోడ।
ఇంతగా బలిమాలు - టెందుకు నన్ను? కేశవా!॥ చిం॥

హేమా-ఈయన కడుమంచివాఁడు - సాయము చేయవలె మీరు।
ఈయనకై నానాథుఁడు - ఎంతో వగచుచున్నాఁడు॥ ఈయ॥

మృణా—అతఁడుకూడ చాలమంచివాఁడు.

కేశ—ఏమైనను నరేకాని - నేమానను మీసేవ।
నామాట నాయజమానుఁ - డేమరకుండ చూడుఁడీ॥ తవ॥

మృణా-పరమానందమయ్యె నీ - స్వామిభక్తికి, కేశవా!
తరమా నినుమరువ మా - యిరువురకీజన్మమున? ॥చిం॥

కేశ—నేను కనఁబడకపోవుటచేతను, నావనిలో మఱియొకఁడప్పుడే ప్రవేశించుటచేతను, నాయజమానుఁడు నాసేవను మఱచిపోయి నాయందలి అభిమానము వదలునేమో అని భయపడుచున్నాను.

మృణా—ఎంతమాటాడినావు? వివాహము చేసినపురోహితుని మఱచుదురా? హేమాంగిసాక్షిగా చెప్పుచున్నాను; వినుము. నీఉద్యోగము నీకిప్పించి నిద్రపోయెదను. మఱి నాపతిని నిద్రపోనిచ్చెదను. అహర్నిశలు నీగుఱించి వాదించెదను. తిరిగి నీకుఉద్యోగమిచ్చువఱకును చెదపురుగునై ఆయనచిత్తవిశ్రాంతిని కలఁచెదను. వేయేల? నీవిషయమై తుదకు నాప్రా

గనులనైన అర్పింప సిద్ధముగాఉన్నాను. కాన విచారము మానుము.

సోమా—అమ్మా! అదిగో ఆయనకూడ వచ్చుచున్నారు.

కేశ—అమ్మా! పోయెద; సెలవిండు. ఆయనకంటఁబడ భయముగాఉన్నది.

మృణా—ఉండుము; నీగురించి ఇప్పుడే ఆయనతో మాటాడెదను.

గీ. ఎండవళమున సాగరుండెంతో పైకి
కాకగాఉన్న శాంతరసాకరుండు
కాఁడెలోన? నానాథుఁ డాగ్రహావశమున
పరుషముగఉన్న, కడుశాంతభావుఁడునుచు.

కేశ—నేఁటికి నన్నుపోనిండు. నామనసేమియు బాగులేదు. అదియునుగాక నన్నుఁగూర్చి మీరుమాటలాడుచున్నపుడు, నేనుండుట మంచిదికాదు.

మృణా—అవునవును. నీవున్న నాతోసరిగా ఆయన మాట్లాడరు.

కేశ—(వడిగా పోవును.)

[జయదేవును, హయగ్రీవుఁడును ప్రవేశింతురు.]

హయ—ఛా! అదినాకిష్టములేదు.

జయ—ఏమనినావు?

హయ—ఏమియు లేదు. కాని...ఆ—అదేమో నాకు తెలియదు.

జయ—ఇప్పుడు నాభార్యకడనుండి లేచిపోయినవాఁడు కేశవుఁడు కాఁడా?

హయ—కేశవుఁడా? ఛా! అతఁడు కాఁడని నానిశ్చయము. అతఁడే అయిన, అంత దొంగతనముగా, మిమ్ము చూడగానే ఏదోగొప్పనేరము చేసినటుల పాఱిపోవునా?

జయ—అతఁడే అని నానిశ్చయము.

మృణా—(ఎదురుగ వచ్చి) మనోహరా! దయచేయుఁడు. తమకోపానలమున పడి పరితపించుచున్న ఒకమిత్రుని మొఱవినుచున్నాను.

జయ—ఎవఁడా మిత్రుఁడు?

మృణా—మఱెవఁడు? తమసహాయసైన్యోద్యోగి, కేశవవర్మ. చేసిననేరము

గను మిగుల చింతించుచున్నాఁడు. మొన్న ఏదో ఒకతప్పు తెలివిమాలి చేసినాఁడేకాని మిమ్ము మోసపుచ్చుటకు కాదు. అతఁడు సర్వదా మీమేలు కోరువాఁడు; కాన, మన్నించి చేరఁదీయ ప్రార్థించెదను. నాపై మీకు ప్రేమ ఉన్న, ఈమనవి చెల్లింపుఁడు.

జయ—నీదగ్గఱనుండి ఇపుడు వెళ్ళిపోయినవాఁడు కేశవుఁడేకదా?

మృణా—అవును; అతఁడే. మీకంటఁబడుటకు భయపడి వెళ్ళిపోయినాఁడు. వానిమొఱ వినినప్పటినుండియు, నాకుబాధగా ఉన్నది. ప్రాణేశ్వరా! వానిపని వానికిచ్చివేయవేఁడెదను.

జయ—సుందరీ! తొందరపడకుము, కొలఁదికాలములో నీకోర్కెతీర్చెదను;

మృణా—కొలఁదికాలమన ఎన్నిరోజులు?

జయ—నీయిష్టమువచ్చినపుడు.

మృణా—నేఁటిరాత్రి వానిని మీముందుపెట్టెదను.

జయ—వద్దు, వద్దు.

మృణా—రేపుప్రొద్దట.

జయ—రేపుప్రొద్దుట నేనింటిలో ఉండను.

మృణా—ఎప్పుడో స్పష్టముగ చెప్పరాదా? నేఁడా? రేపా? ఎల్లుండా? మూఁడురోజులలోపుగా నామనవి చెల్లింపవలెను. అతఁడు పశ్చాత్తాప పడుచున్నాఁడు. ఈశిక్ష చాలును. యుద్ధభూమినుండు పట్టుదలను, ఇంటిదగ్గఱయూపవలెనా? వానిని ఎప్పుడు రమ్మనెదరు?... చెప్పరేమి? మీరునన్ను అర్ధరాత్రమున దొంగతనముగా నాతలిదండ్రులను విడిచి రమ్మనినప్పుడైన, నేనింత జంకలేను. అతఁడు మనమధ్యవర్తియై మనకోర్కెతీర్చిన పురోహితుఁడు. బాల్యమునను నేను మీరూపాదులను నిందించినపుడు, అతఁడు మిమ్ము ఇంద్రుఁడు చంద్రుఁడు అని నుతించుచుండెడివాఁడు.

జయ—అబ్బ! ఎందుకీసోది? వానియిష్టమువచ్చినపుడు రానిమ్ము. నీమాటకు అడ్డుచెప్పలేను.

మృణా—అబ్బా! ఎందుకింత అహంకారము? నగలడిగితినా? నాణెములడిగితినా? ఉపకారికి ప్రత్యుపకారము చేయుట సజ్జనులకు విధి. కాన మిమ్మది చేయుమనుచున్నాను.

జయ—నీచిత్తానుసారముగ కానిమ్ము. నన్నట్టే చంపక లోనికి పొమ్ము.

మృణా—చిత్తము. మీమాటకు అడ్డుచెప్పలేను; హేమాంగీ! రమ్ము. నాథా! సెలవు. (పోవుదురు)

జయ—(తనలో) మేడిపండా! నీచర్య నాకునేఁడు అనుమానము కలిగించుచున్నదికదా! ఏమి చేయుదు? నీపై నాకింకను మోహము పోలేదే.

హయ—దేవా! మీరాకాంతాగుణిని వరించినారనురహస్యము కేశవునకు మొదట తెలియునా?

జయ—తెలియకేమి? తెలియును. ఆసంగతి నీకెందుకు?

హయ—మఱేమియు లేదు. నాసందేహనివృత్తికొఱకు అడిగితిని.

జయ—ఏమా సందేహము?

హయ—అతఁడామెను ఎఱుఁగఁడని అనుకొంటిని.

జయ—ఎఱుఁగకేమి? మాకుంటెనకాఁడై మాకోర్కెలను తీర్చినవాఁడతఁడే

హయ—(బొమముడిచి) నిజముగా?

జయ—అవును; నిజముగానే. అతఁడు విశ్వాసపాత్రుఁడు కాఁడా?

హయ—అతఁడు విశ్వాసపాత్రుఁడా!

జయ—విశ్వాసపాత్రుఁడు కాఁడా! విశ్వాసపాత్రుఁడే.

హయ—నా అనుభవమునుబట్టి కాఁడనుకొనెదను.

జయ—నామాట నమ్మవా?

హయ—నామాట నమ్మరా?

జయ—(తనలో) హా! దైవమా! ఇదేమి? ఇతఁడు, 'నామాటనమ్మరా?' అని నిర్భయముగ అనుచున్నాఁడు! వీనిమనసునందు ఏదో ఘోరరహస్యమును దాఁచుకొని [illegible] యగ్రీవా!

నీసందిగ్ధవచనములనుబట్టి ఏదో మోసము జరిగినట్లును, నీవు చెప్పటకు జంకుచున్నట్లును తోఁచుచున్నది. ఇందాఁక కేశవుఁడు నాభార్యదగ్గఱ నుండి వెళ్లిపోవుచున్నపుడు, 'ఛా! అది నాకిష్టములేదు,' అని అన్నావు. నీకిష్టములేనిది ఏది? అతఁడు మాకుంటెనకాఁడని చెప్పినపుడు బొమముడితో, 'నిజముగా,' అనిప్రశ్నించినావు. నిజముగా నాయందు నీకభిమానమున్న, నీఉద్దేశమును వెల్లడింపుము.

హాయ—దేవా! మీపై నాకెంత అభిమానమున్నదో మీకు తెలియదా?

జయ—తెలియకేమి? అందుచేతనే నీమాట లింతగా పాటింపవలసివచ్చెను. ఆలోచనచేయకుండ నోటికివచ్చినట్లు నీవు మాటాడవని నానమ్మకము. కనుకనే, నీమాటలిపుడు మఱింత బాధించుచున్నవి. దయ సంపాదింప, కొందఱు ధూర్తులిట్లు నటింతురు. కాని నీవట్టివాఁడవు కావు.

హాయ—మహాలక్ష్మీ సాక్షిగా కేశవుఁడు నమ్మఁదగినవాఁడే అని తలంచెదను.

జయ—నేనట్లే తలంచుచున్నాను.

హాయ—మనుజుల త్రికరణములందు భేదముండకూడదు. కాని గోముఖవ్యాఘ్రములను బ్రహ్మ అక్కడక్కడ సృజించి నిందలపాలగుచున్నాఁడు.

జయ—నిజము. త్రికరణశుద్ధికలవారే మనుజులు. కాని,

గీ. ఎదుట, మేలుకోరెడు ప్రాణహితులరీతిఁ
అతివినయముతో మధురోక్తు లాడుచుండి
వెనుక, పంగనామంబులు పెట్ట, కుత్ర
లెన్నొ పన్నుచుందురుకదా హీనమతులు.

హాయ—దానికేమి? మొత్తముమీఁద కేశవుఁడు నమ్మఁదగినవాఁడే.

జయ—ఛా! ఇంకను నీమనసులోనిమాట చెప్పకున్నావు. ఎంతహైన్యమైనదైనను, జంకక చెప్పుము.

హాయ—క్షమింపుఁడు. నానియమితకార్యములను చేయుటకే నేనుబద్ధుఁడను. కాని, నాఉద్దేశములను చెప్పుటకు బద్ధుఁడను కాను. ఒకవేళ చెప్పిన

ను, అవి అసత్యములును నీచములును కావచ్చును. దానికేమి? ఒకమాట. కట్టుకట్టము లెన్ని చేసినను, ఒకప్పుడైన లోపమున కెడమీయని అంతఃపురంబును, దురుద్దేశమునకు చోటీయని నిర్మలహృదయమును ఎక్కడైన కలదా.

జయ—నీస్నేహితుఁడనగు నన్నే బాధించెదవా? నాపరాభవమును నీవెఱిఁగియు నాతో జెప్పకుండుట నీకు తగునా?

హాయ—మీకనేకవందనములు. నన్ను బలవంతపెట్టకుఁడు. నాయూహలు చెడ్డవికావచ్చును. మీతో జెప్పనేమి? పైవారియందు లోపములు వెదకుటే నాపాడునైజము. అసూయచేత ఇతరులు చేయుమంచిపనులుకూడ నాకు నింద్యములుగా తోఁచును. నేను చాలఅనుమానపుమనుష్యుఁడను. కాన, బుద్ధిమంతులగుతామ నాదురుద్దేశములను వినరాదు; నమ్మరాదు; మఱి బాధపడరాదు. తమతో నేనుచెప్పుటయు భావ్యము కాదు.

జయ—చెప్పవా?

హాయ—చెప్పుటకేమున్నది. మంచిపేరు మనుజులకమూల్యాభరణము. దానిని పాడుచేసినవానికి రవంతయు లాభములేదు. కాని పోఁగొట్టుకొనినవాఁడు జీవన్మృతుఁడు. కాని లక్ష్మి చంచల. నేఁడు నన్నును, రేపు మిమ్మును, ఎల్లుండి వేరొకనిని వేశ్యవలె పొందుచుండును. దానికై విచారింపఁబనిలేదు. ఏలనన, కష్టపడిన మరల దానిని సంపాదింపవచ్చును.

జయ—అప్పనాయనా! నీతలంపు నిప్పటికి గ్రహించితిని.

హాయ—వట్టిమాట. నాహృదయమును మీచేతపెట్టినప్పటికి గ్రహింపలేరు. అది నాపెదవి దాఁటనంతవఱకు మనుష్యమాత్రుఁడు తెలిసికొనలేఁడు.

జయ—హా! హతవిధీ! మానవులకు పరులచిత్తవృత్తుల గ్రహించు జ్ఞానమేల ఈయవైతివి?

హాయ—దేవా! అనుమానపిశాచమునకు లోఁబడకుఁడు. అది తనదాసులమతి చెఱచి, కోఁతులవలె ఆడించి తుదకు పలుకడగండ్లపాలు చేయును.

గీ. అలిని కడుప్రేమించుచు ఆమెనడత
మంచిదో కాదో అనిఅనుమానపడుచు
వలపు విడలేక చింతించువానికంటె
మోహమును ద్రెంచువాఁడెపో బుద్ధిశాలి.

జయ—ఏమీ? అనుమానపుసుడినిబడి నేను కొట్టుకొనుచుండుననుకొనుచున్నావా? ఛీ! నాఅనుమానమే నిర్ధారణము. నీమాటలనుబట్టి నీతలంపు గ్రహించితిని. నానతి చక్కనిది; అందఱితో చనువుగ మాటలాడును; ఆడును; పాడును. ఇవి చూచి నీకు అనుమానము కలుగవచ్చును. కాని నాకు కలుగలేదు; కలుగదు. మఱియు, ఆమె నన్ను కన్నారచూచి వరించినది. కనుక నాలోపములను చూచి, నన్ను నిరసించుననుభయము లేదు. అనుమానించుటకు ముందు కనిపెట్టెదను. అనుమానము తగిలిన రుజువు కావలెను. రుజువైన, అనురాగానుమానములందేదో ఒకటి తెగిపోవును

హాయ—సంతోషమే. తొందరపడకని సెలవిచ్చినారు. కనుక, నేనిఁక జంకక చెప్పెదను. ఒకరింటి మంచిచెడ్డలు పైవారు వచ్చి చూపరాదు. దాన విరోధమువచ్చును; అందుచే జంకితిని. దేవా! రూపవతియగు భార్య శత్రువను లోకోక్తి మీకు తెలియనిది కాదు. జాగ్రత్తగా ఆమెను, కేశవుని కనిపెట్టుచుండుఁడు. మాఊరినారులచర్యలు మీకన్న నాకు బాగుగా తెలియును. పతులముందు ముద్దరాండ్రవలె నటించుచు, వెనుక నెఱజాణలవలె ప్రవర్తింతురు. వారిరహస్యము లోకపిట్టకైన తెలియనీయరు.

జయ—నీపలుకులు నిజమే కావచ్చును. కాని,

మ. కనులారన్ నను గాంచి, నాచరిత మాకర్ణించి, ప్రేమించి, నా
మనసున్ మెల్లఁగదొంగిలించి, జనకున్ మాతన్ విసర్జించి, నా
వెనువెంటన్ చనుదెంచి, నిండుసభలో వృద్ధున్ పితన్ ఈసడిం
చి, నిజప్రేమను చూపినట్టి సతి ఇస్సీ! నన్ను వంచించునే!.

హాయ—అదే మనకున్నగట్టిలోపము; పడఁతులపై వేషములను నమ్మి మోస

పోవుచున్నాము. కనిపెంచిన తలిదండ్రులకే అనుమాన మానంతయు కలుగకుండ నటించి, అర్ధరాత్రమున వారిని మోసపుచ్చి, ఆ మెయింటి నుండి పాఱిరాలేదా? అట్టిచో మధ్యవచ్చిన తానెంకలెక్కా? స్త్రీ బుద్ధిః ప్రళయాంతకీ అను లోకోక్తి నాకుస్ఫురించినపుడెల్ల, సంసారముపై విరక్తి పుట్టుచుండును. మఱియొకరహస్యము.

సీ. సతుల నమ్మఁగలేక సతిని దేహమునందు
గంగను తలను శంకరుఁడు దాల్చె;
చంచలాత్ములు నాగులంచు వక్షస్థలిన్
శ్రీహరి లక్ష్మిని నిల్పుకొనియె;
లలనలు నూత్నప్రియులంటంచు బ్రహ్మ ని
జాంగనన్ జిహ్వాగ్రమందె ఉంచె;
పడఁతులతో పోరుపడలేక మునివరుల్
పెండ్లిమాటయె తలపెట్టరైరి;
అమ్మహాత్ములే కొమ్మల నమ్మలేక
ఎన్నొ కట్టుదిట్టంబులు పన్నుకొనఁగ
దినముఁ బొట్టకై తిరుగాడు మనుజుఁడేడ?
వెలఁదిమాఁయ లరయుటేడ? వెఱ్ఱిమాట.

జయ—(దగ్గుత్తికతో) నిజము నిజము.

హాయ—అన్నా! నావలుకులకు తమమనసు కొంచెము నొచ్చినట్లున్నది. నేనెంత దుర్మార్గుఁడను! దైవము నాకింత స్వామిభక్తి ఎందుకిచ్చెను!

జయ—లేదు లేదు. రవ్వంతయు నొవ్వలేదు.

హాయ—నేను నొచ్చినదనే భయపడుచున్నాను. ప్రేమబలము మనోబలమును జయించి ఈరహస్యమును వెల్లడించినది. కాని తాము తొందరపడక కనిపెట్టుఁడు. తొందరపడిన, నన్నుచంపుకొని తినినట్టే.

జయ—నేనెంతమాత్రము తొందరపడను.

హయ—ఇప్పుడే తొందరపడిరేని, నేనుకలనైన అనుకొనని ఘోరములు జరుగును. ఆపాపము నన్నుచుట్టుకొనును. కేశవుఁడు నాప్రాణస్నేహితుఁడే—అదిగో మీరాందోళనపడుచున్నట్లున్నది.

జయ—అట్లే ఆందోళనపడ లేదు. ఆమె నన్ను మోసపుచ్చునని అనుకొనను.

హయ—తథాస్తు! ఆమె పతిభక్తికలిగి చిరకాలము మనుఁగాక! తామిట్లే అనుకొనుచు బహుకాలము సుఖింతురుగాక!

జయ—కాని, ఆమెతనస్వభావమునకు వ్యతిరిక్తముగా—

హయ—ఆఁ! అదే ఇపుడు యోచింపవలసినసారాంశము. స్వదేశీయులు స్వజాతీయులునగు రూపవంతులెందఱో [illegible], వారినెవరిని పల్లకపళ్ళాదులుకూడ అతిక్రమింపనివంశాచారము నతిక్రమించుట స్వభావవిరుద్ధమని చెప్పకతప్పదు. మఱియు ఆమెస్వభావ మెట్టిదో నాకు తెలియకున్నను, స్ఫురద్రూపులగు తనదేశీయులకును మీకును రూపాదులందుకల భేదము మనసుకుతట్టినపుడు, మిమ్ము వరించినందుకామె విచారించుననుభయముమాత్రము నాకు కలదు.

జయ—మంచిది; వెళ్లుము. ఇంక ఏమైన ముందు నీవు కనిపెట్టిన, నాతో చెప్పుము. ఆమెను జాగ్రత్తగా కనిపెట్టుమని నీభార్యతోకూడ చెప్పుము.

హయ—చిత్తము, చిత్తము. (పోవును)

జయ—హా! దైవమా! నేనేల వివాహమాడితిని? బ్రహ్మచారికి ఇట్టివిచారము లుండవుకదా. విచారములన్నిటిలో గట్టివిచారమిదేకదా. బ్రహ్మచారియే నిర్విచారి; వాఁడే నిరంజనుఁడు. హయగ్రీవుఁడు నమ్మఁదగినవాఁడు. నాయింటిగుట్టు నాకంటె వానికి చక్కఁగా తెలియును. కాని చెప్పుటకు జంకుచున్నాఁడు.

హయ—(ప్రవేశించి) దేవా! ఈవిషయమై తాము, మనోవేదనపాలుగాకుఁడు. ఱంకుతనమును దొంగతనమును కాలక్రమమున ముఱిగి కంపుకొట్టకమానవు. కాన ఓర్పిఉండుఁడు. కేశవునకుమాత్ర మింతత్వర

లోపని యీయకుఁడు. అపుడు మృణాళినీకేళవుఁచర్యలనుబట్టి మీరు కొంతగ్రహింపవచ్చును. ఆమెను మునుపటివలెనే స్వేచ్ఛగాఉండనిండు. తొందరపడిన, కార్యము చెడును.

జయ—మఱేమియు భయము లేదు.

కాచ—చిత్తము; సెలవు. (పోవును)

జయ—ఇతఁడు నమ్మఁదగినవాఁడు; పరహృదయవేది. నేను నల్లఁగాఉండుటయేకాక, సుందరీమణులను రంజించు సౌందర్యవాక్చాతుర్యములు నాకులేకుండుట సత్యము...హా! నన్ను మోసపుచ్చినది! నాకు అపకీర్తి తెచ్చినది! కనుక నాప్రేమాభిమానము లింతటితో చాలించెదను. హా! పాపిష్ఠపరిణయమా! సతులశరీరములను పతులకును, వారిచిత్తములను విటులకును తార్చుచుండు స్త్రీకై వేలకొలఁదీ కర్చుపెట్టుట తెలివితక్కువేకదా. వ్యయప్రయాసములుపడి పెండ్లాడువాఁడొకఁడు; తత్ఫలమును అనుభవించువాఁ డింకొకఁడగుచుండ, పెండ్లిఆడుట కెవఁడొప్పుకొనును? ఆంకటాలితో కాఁపురము చేయుటకంటె సన్యసించుట మేలు. అదిగో మృణాళిని వచ్చుచున్నది. జారిణీచిహ్నములేమియు లేకుండ బ్రహ్మ సృజించినపుడు, ఆదుర్గుణమీమెకు ఎట్లబ్బును! అబ్బినచో బ్రహ్మ సిందార్హుఁడు కాఁడా? కాన నీలాపనిందయే; నేను నమ్మను.

[మృణాళినీహేమాంగులు ప్రవేశింతురు.]

మృణా—నాథా! అతిథులువచ్చినారు. మీరింక ఇక్కడనే ఉన్నారా?

జయ—ఆలాగునా? అన్నా! ఎంతపొరపాటు!

మృణా—హీనస్వరముతో మాటాడుచున్నారేల? ఉష్ణము రాలేదుకదా.

జయ—తలనొప్పిగా ఉన్నది.

మృణా—నిద్రలేకుండుటే కారణము. (చేరుమాలుతో కట్టఁబోవును)

జయ—వద్దు, వద్దు. ఆరుమాలు చాలదు. (రుమాలులాగికొని జాఱవిడుచును)

మృణా—(రుమాలును తీయఁబోవును.)

జయ—దానిమాటకేమి? రమ్ము. (మృణాళినీజయదేవులు పోవుదురు.)

హేమా—అప్రయత్నముగ ఈరుమాలు దొరకినది. (తీసి) ఇది జయదేవు మొదట తనప్రియురాలికిచ్చిన అనురాగచిహ్నము. చపలుఁడగు నామగఁడు దీనినైటులైనతెచ్చి తనకిమ్మని నన్ను వందసారులడిగెను. ఇచ్చిన ఏమిచేయునో? ఆగొడవనాకెందుకు. ఇంవలి పూలలతలను తీసికొని ఆయనకిచ్చి మన్ననలందెదను. అదిగో ఆయనవచ్చుచున్నారు. (పోవును)

[హయగ్రీవుఁడు ప్రవేశించును.]

హయ—ఈరుమాలును రహస్యముగా కేశవునిబసలో పడవేసెదను. ఇదివనికిమాలిన పాతనూలుగుడ్డముక్కయే. కాని, ఎంగిలాకువెళ్లి మేడలను మిద్దెలను తగులఁబెట్టునట్లు, మృణాళినీజయదేవకేశవుల అనురాగోద్యోగములను నాశనముచేయుటయేకాక, వారినడుమను పచ్చగడ్డివేసిన భగ్గున మండునట్లు చేయును. నేనువేసిన మాత్రయొక్కసారము వానితలకెక్కి పనిచేయ ప్రారంభించినది. మలయాద్రిపై పరుండినను, రంభాదులువచ్చి జోలలుపాడినను, మకుటిమత్తుమందిచ్చినను, కంటిపై ఱెప్పపడనీయదు. వానిమానసాబ్ధిని నాఅనుమానమందరము చిలుకుచున్నది. అదిగో అతఁడిటు వెఱ్ఱివానివలెవచ్చుచున్నాఁడు. (రుమాలు దాఁచివేయును)

[జయదేవు ప్రవేశించును.]

జయ—హా! నన్ను మోసపుచ్చినది! మోసపుచ్చినది!!

చ. నడువడులెన్న పాములు,మనంబు లగమ్యములౌ అగాధముల్,
వలపులుక్రొమ్మెఱుంగు లలవాక్కులు తేనియ తేటజాలు, చే
ష్టలు నుసికప్పునిప్పుకలు, చక్కఁదనంబులు మేడిపండ్లనె
అలను; సతీజనంబు పురుషావళిపాలిటిమృత్యుదేవతల్.

హయ—దేవా! కూడదు, కూడదు. ఆనంగతి మఱచిపొండు.

జయ—చీ! నాయెదుటనుండి లేచిపొమ్ము. నాచిత్తమును అనుమానమనుకొఱతనువేసి బాధించుచున్నావు. సగము సగము చెప్పి నన్ను వేధించుట

కంటె, పూర్తిగాఁజెప్పి నన్నుదుఃఖాగ్నిలోఁ ద్రోయరాదా?

హాయ—ఇపుడు తామింత కలఁతపడనేల?

జయ—ఆమెరహస్యకృత్యములు నాకు తెలియనంతవఱకును, నాకేవిచారము నులేదు. ఆమెకు పరపురుషసాంగత్యమున్నటుల, నాకనుమానము కలుగలేదు. నీవు చెప్పకున్న, నాకింతమనస్తాప ముండునా?

హాయ—నిజము, నిజము. కాని, నిజము నిలుకడపైకదా తేలును.

జయ—సైనికులును సేవకులును మఱిఅందఱునుకలిసి తత్ఫలమును నాకు తెలియకుండ అనుభవించిన, నాసంతోషమునకు భంగములేదు. హా!

సీ. ఏవిచారంబెఱ్ఱుఁ గని హృదయమా!
తులలేనిసంతృప్తి! సెలవుసెలవు;
తతయుద్ధభూముల తల్లినా నన్ను ర
క్షించిన కవచమా! సెలవుసెలవు;
రణమున ముదమందు ఘనఘోటకోత్తమా!
శితఖడ్గరాజమా! సెలవుసెలవు;
పోరాటమునకెంతొ పురికొల్పు రణభేరి!
విలసద్యశోరమా! సెలవుసెలవు;
నన్ను ప్రేమించుభటులార! నన్నుచూచి,
వలచివచ్చిన జయలక్ష్మి! సెలవుసెలవు;
ఈదినంబుతో మనబుణ మెల్ల చెల్లె;
సెలవు, మరచిపొం డిఁకనన్ను; సెలవుసెలవు.

నేఁటితో జయదేవు సైనాధిపోద్యోగముకూడ పోయినది.

హాయ—దేవా! తగదుతగదు; ఇట్టిఅమంగళవాక్యములాడుట తగదు.

జయ—

శా. ఔరా! దుర్మతి! మేకవన్నెవృకమా! ఔరా! అసూయానిధీ!
నారామామణి ఱంకులాడి అని నే నమ్మంగ నాకిఁక క

న్నారన్ చూపుము; కానిచో, రుజువుచేయంగావలెన్: లేనిచో,
నా క్రోధాగ్నిశిఖాచయంబున నినున్ భస్మంబు కావించెదన్;

హయ—ఇదా నాస్వామిభక్తికి తామిచ్చుకానుక?

జయ—ఇంక నీతిపిమాటలును, పరనిందయు కట్టిపెట్టుము. నన్నట్లు బాధపెట్టకుము. ఇంతకంటె నీవుచేయఁగల మహాపాప మింకొకటిలేదు.

హయ—హా! దైవమా! ఈనిర్దోషిని కాపాడుము. అయ్యా! మీమతిపోయెనదా? అలిమీఁదికోపము దూలుపై చూపనగునా? మీకును మీరిచ్చిన ఈద్యోగమునకును పదివేలనమస్కారములు. ఓరా! లోకజ్ఞానశూన్యా! హయగ్రీవా! ఈకలికాలమున న్యాయమన్న పాపము. అట్టి న్యాయమార్గమును తప్పని నీకు తగినపరాభవమే అయినది. అనుభవింపుము. ఓజనులారా! నిజముచెప్పకుఁడు; న్యాయమార్గమును విడువుఁడు. లేకున్న, నావలెనే చెడిపోదురు. దేవా! నాభక్తివిశ్వాసములకు తగుఫలమిచ్చినారు. ఇంక జాగ్రత్తగా నడుచుకొనెదను. (పోఁబోవును)

జయ—నిలు. ఆమె మోసకత్తెయని రుజువుచేయుభారము నీపైనున్నది.

హయ—ఓ. మీకు కావలసినన్ని విధముల రుజువుచేసెదను. దాన తమమనస్సు మఱింత కుదురునుకదా. అపుడు నన్నేమి—

జయ—మాటలతో కాలయాపనము చేయక, నీకు తెలిసినది త్వరగ చెపుము.

హయ—చిత్తము. కొద్దిరోజులక్రిందట కేశవుఁడును నేనును ఒకచోటపరుంటిమి. నిద్రావస్థయందును, జాగ్రస్మృతి తప్పియున్నప్పుడును కొందఱు తమపరమరహస్యములు వెల్లడిచేయుచుందురు. మనకేశవుఁడును అట్టివాఁడే. పన్ను నలువుచుండుటచేత నాకునిద్రపట్టలేదు. అతఁడు గాఢనిద్రలోమునిఁగి, 'మనోహారిణీ, మృగాక్షినీ! నిన్ను ఎన్నిసార్లు రహస్యముగ ముద్దుపెట్టుకొనినను తృప్తి కాకున్నదే. ఆనల్లవానిని నీవుపెండ్లాడుట నాకేముకుఱ్ఱగకు దొండపండుకట్టినటులున్నదే. వాఁడింటలేఁడు; రావే, కౌఁగిలీయవే,' అనుచు నన్ను కౌఁగిలించుకొన్నాఁడు.

జయ—(పండ్లుకొఱుకుచు) ఓరీ! విశ్వాసఘాతకా, కేశవా! ఉండుండు; నీగుండెలు చీల్చెదను.

హయ—శాంతింపుఁడు. కల కల్లఅని పెద్దలందురు.

జయ—నిజమేకాని, ఈసంగతి వానిరహస్యసాంగత్యమును వెల్లడించు చున్నది. నానందేహమును దృఢపఱుచుచున్నది.

హయ—అవునవును.

జయ—ఆకులటను పోఁకవలె తుత్తునియలు చేసి నాకసి తీర్చుకొనెదను.

హయ—తొందరపడకుఁడు. మృణాళిని దోషురాలని ఇంతలో నిర్ధారణము చేయ వీలులేదే! ఆమె నిష్కళంకచరిత్ర కావచ్చును...అయ్యో! ఇం కొకరహస్యము. తామువెన్నఁడైన గులాబిపూలలతలుగల చేరుమాలును తమభార్య వాడుక చేయుట చూచితిరా?

జయ—అట్టిదొకటి నాజ్ఞాపకార్థము నేనామెకు మొట్టమొదట ఇచ్చినాను.

హయ—ఆసంగతి నాకు తెలియదు. కాని, అట్టిచేరుమాలు...తమసతిదగ్గఱ దే నేఁడు కేశవుని చేతిలో చూచినాను.

జయ—అలాగునవా? అదే అయినయెడల—

హయ—అదో? మఱొకటో? ఏదైననేమి? నేరమును రుజువు చేయుటకు చాలదా?

జయ—ఆబానిసకొడుకును కాపాడ ఫాలాక్షుఁడువచ్చినను, నాతీవ్రకోపా నలమున నీఱుచేయకమానను. ఆమాయలాడి జారిణి అని యిప్పటికి స్ప ష్టమైనది. నేఁటితో నా ప్రేమానుబంధము తెగినది. హయగ్రీవా!

గీ. ఇంతవఱకు నాహృత్పేటికాంతరమున,
వలపనెడు మంత్రబలమున అడఁగియున్న
భీకర ద్వేషఫణి నింక విడుతు దాని
ప్రాణవాయువులను మనసారఁ గ్రోల.

హయ—తొందరపడకుఁడు. ఈకోపము ఇంకొకగడియ కుండదు. ఆసుంత

రీరత్నము కంటఁబడిన వలపు తొలకరించి, స్నేహమంకురించి, ఒడలు పులకరించి, కోప మంతరించునేమో?

జయ—ఛా; వట్టిమాట. ఆటంకములాడివలె నేనును చపలచిత్తుఁడ ననుకొనుచున్నావా? (మోకాళ్లపై కూర్చుండి) ఈభూదేవిసాక్షిగా చెప్పుచున్నాను; విను. నన్నింత దుఃఖపెట్టిన ద్రోహులను సంహరించితీరెదను.

హయ—లేవకుఁడు. (మోకాళ్లపైకూర్చుండి) ఓ సూర్యచంద్రాదులారా! ఈస్వామిభక్తిగల హయగ్రీవుఁడు శ్రీజయదేవప్రభుసేవార్థమై ప్రాణములనైన అర్పింప సిద్ధముగానున్నాఁడు. ఏమిచెప్పినను చేయుటకు బద్ధుఁడైయున్నాఁడు. ఇందుకు మీరేసాక్షులు. (ఇద్దఱును లేతురు)

జయ—నీభక్తివిశ్వాసములకు నేనెంతయు సంతసించితిని. ఇప్పుడే నిన్ను పరీక్షించెదను. నేఁటికి మూఁడురోజులలోపుగా కేశవుని మరణవార్త నీవు నాచెవిని వేయవలెను.

హయ—చిత్తము. తమకోర్కిప్రకారము నాస్నేహితుఁడు చచ్చినాఁడని నమ్ముఁడు. కాని, ఆమెనుమాత్రము—

జయ—ఛీ! ఆమెయులేదు; గీమెయులేదు. నీవు వెళ్లుము. ఆదురాత్మురాలిని శీఘ్రముగా పరిష్కరించు మార్గ మాలోచించెదను. కేశవునిఉద్యోగము నీకిచ్చితిని; పొమ్ము.

హయ—చిత్తము. ఎప్పటికిని నేనుతమదాసుఁడనే. (పోవును)

ద్వితీయరంగము—చావడి

[మృణాళినీహేమాంగులు ఉందురు.]

మృణా—హేమాంగీ! నేఁడు అకారణముగ నామనసున దిగులుపుట్టుచున్నది. ఇందుకనుగుణ్యముగ నానాథుఁడు మొదట నాకిచ్చినచేరుమాలు కనఁబడకున్నది. నీవెఱుఁగుదువా?

హేమా—అమ్మా! ఆచేరుమా లెట్టిదో నేనెఱుఁగను.

మృణా—నానగలెల్ల పోయినను, నాకింతచింత ఉండదు. ఆయనకు తెలిసిన ఎంతకోపించునో, మఱేఅనుమానము కలుగునో అనిజడియుచున్నాను.

హేమా—అదిగో! ఆయన ఇటే వచ్చుచున్నారు.

[జయదేవుఁ బ్రవేశించును.]

మృణా—(ఎదురేగి) నాథా, తలనొప్పి పోయినదా?

జయ—సుందరీ! నీదయచే పోయినది. (మృణాళిని చేయిపట్టుకొని) ఆహా! ఈయఱచేయియే దూదిపింజకంటె మెత్తగానున్నపుడు, నీహృదయమెంత మెత్తగనుండునో! నీవు పరోపకారపారీణురాలవు.

మృణా—ఎందుకీ ముఖస్తుతులు? నేనెవరికిని ఏఉపకారమును చేయలేదు. చేయఁగోరినను తాముతోడుపడకున్న సాగుటెట్లు?

జయ—తాను చేయు సత్కార్యములను మఱుఁగుట సుజనలక్షణమైనను, ఒకరు చేయుమంచిచెడ్డలు ఎప్పటికైన వెల్లడికాకమానవు. మఱి నేను నిన్ను నమ్మి స్వేచ్ఛగా విడుచుటే నేను నీకు చేయఁగలసాయము.

మృణా—మీమాటలు నాకుబోధపడలేదు. ఏదీ, మీవాగ్దానము?

జయ—ఏమివాగ్దానము? పో.

మృణా—నామాట మీకు జ్ఞాపకముండునా? కేశవునిరమ్మని కబురంపితిని.

జయ—నీకవసరమున్నపుడు కబురంపక మానెదవా? అబ్బ! (కన్నునులుపుకొనుచు) కంటిలో ఏదోపడినది? నీచేరుమాలిమ్ము.

మృణా—ఇదిగో.

జయ—ఇది కాదు. మొదట నేను నీకిచ్చినదితెమ్ము.

మృణా—అదా? ఏమూలనున్నదో కాని కనఁబడకున్నది.

జయ—ఏమీ? కనఁబడలేదా? కాన్యమాడక వెదకితెమ్ము.

మృణా—నిజముగా కనఁబడలేదు. మీతోడు! నమ్ముఁడు.

జయ—ఎంతపొరపాటు చేసినావు? అది ఒకమంత్రవేత్తచే నాతల్లికీయఁబడినది. ఆమె దానిని భద్రముగ దాఁచి నాకిచ్చిపోయినది. దానిని

రెండుగడియలు చేతపట్టుకొనిన, సర్వరోగములు మందువలె మాయమగును. అది పారవేసితివా? మఱెవరికైన ఇచ్చితివా?

మృణా—అందేదియు జరుగలేదు. ఇంట ఏమూలనో పడిఉన్నది. అందంత మాహాత్మ్యమున్నదా.

జయ—అవును. దానిసాహాయ్యమున ఇతరులఉద్దేశములను తెలియనగును. మఱియు నాతల్లి దానిసాయమున నే నాతండ్రిని వశపఱచుకొనుటయే కాక భర్తృప్రేమాస్పదఅయ్యె. అది పోయిన వంశనాశనమగునని నాతల్లి మిక్కిలి మిక్కిలి చెప్పెను.

మృణా—ఒకవేళ అది కనఁబడకున్న ఏమిదారి?

జయ—చీ! మందమతీ! వెదకితెమ్ము.

మృణా—ఎందుకంతకోపము? నన్ను మ్రింగివేసెదరా యేమి?

జయ—పోయినదా? నిజముగా పోయినదా?

మృణా—పోలేదు; కాని కేశవునిసంగతి మఱచిపోవుటకా ఈమోస్తరువన్నినారు? తరువాత అది వెదకెదను. కాని వానిమాటఏమి?

జయ—ముందు ఆరుమాలు తెచ్చి నాకు చూపుము.

మృణా—మొదట నామాట చెల్లింపుఁడు. కేశవుఁడు చాలమంచివాఁడు.

జయ—ఆరుమాలు తెచ్చిచూపి నాఅనుమాన నివృత్తి చేయుము.

మృణా—అంతమంచివాండు దొరకుట దుర్లభము. వానిని పిలువనంపుఁడు.

జయ—ఆరుమాలు తెమ్ము.

మృణా—వానిసంగతి ఇటోఅటో తేలినవెంటనే అది వెదకెదను. ఇంత దీర్ఘకోపము కూడదు. నామనవి చెల్లింపుఁడు.

జయ—ఛీ! కులటా. (లేచిపోవును)

మృణా—(అడ్డుకొని) నాకోర్కితీర్చినఁగాని వెళ్లనీయను.

జయ—(త్రోసివేసి పోవును.)

హేమా—అమ్మా! ఆయనకు మీపై అనుమానము పుట్టినట్లున్నది.

మృణా—ఇంతకష్టముం దెప్పుడును లేదు. ఆచేటిరుమాలునందేమో మాహాత్మ్యముండవచ్చును. దానిమాట తలఁచుకొనిన, నామతిపోవుచున్నది.

హేమా—అమ్మా! క్రొత్తయొకవింత, ప్రాఁతయొకరోఁత అనుసామెత కనుగుణ్యముగ మగవాండ్రు తమమగువలను ఏదోయొక మిషపెట్టి సాధించుచుండుట జగద్విదితమే. మఱియు,

గీ. కడుపు మండుచో అన్నంబు కడువడి దిగ
మ్రింగి కడుపు నిండిన వెన్క మిగత దాని
దిగవిడుచునట్లు, కామాంధులగు పురుషులు
మొలఁతల మొదట ఎంతో ప్రేమించి, మనసు
తీరఁగానె వారిని చాల నీరసింత్రు.

మృణా—నాభర్త స్వభావమట్టిది కాదు. కాని రాజకార్యములేవియో ఆయనమనసును కలఁచుటచేత చిటచిటలాడుచున్నారు. అదిగో హయగ్రీవకేశవులు అక్కడ మనకొఱకు వేచియున్నారు; రమ్ము. (పోవుదురు)

[కేశవుఁడు ప్రవేశించును.]

కేశ—(తనలో) అకటా! నేనెంత దురదృష్టవంతుఁడను! అపరోపకారపరాయణ మృణాళిని నాపేరెత్తఁగానె జయదేవు మండిపడుచున్నాఁడఁట! ఇదివఱకు నాగుఱించి ఆమె మూడుసారు లెంతవాదించినను లాభము లేకపోవుటయేకాక, అతఁడామెపై అలిగెనఁట. కానిమ్ము.

గీ. పతులఁ బెదరించి బుదిరించి వారిచేత
ఎట్టి కార్యములైన చేయించువారు
సతులె; కాన, మృణాళిని సాయమున్న
నామనోరథమీడేరు టేమివింత?

సమయము కనిపెట్టి నీగుఱించి మఱల చెప్పెదననియు, నీయుద్యోగము నీకిచ్చువఱకు నిద్రపోననియు చెప్పినది. కనుక, నేఁడు కాకున్న రేపై

న ఆమెమాట సేనాని చెల్లించును. (రుమాలుతీసి ముఖమూతుడుచుకొని) ఈరుమాలు నాబసలో పడిఉన్నది. ఎవరిదో ఎట్లువచ్చినదో తెలియకున్నది. ప్రాంతదేశాని ఇందుఁగల పూలలత బాగున్నది. ఇట్టిది మారాణిచే ఇంకొకటి అల్లించెదను. ఈఆందోళనలోపడి దానిని రెండు రోజులనుండి చూడలేదు. అదెంతకోపగించునో? (పోవును)

తృతీయరంగము—కోటముందు ప్రదేశము.

[జయదేవును హయగ్రీవుఁడును ప్రవేశింతురు.]

హయ—తాము ఆరాగున జరుగుననుకొనెదరా?

జయ—అనుకొనెద, హయగ్రీవా!

హయ—ఆఁ! రహస్యముగా ముద్దాడుటా?

జయ—పాపభీతిచే జంకుచున్నపుడు, మోహపిశాచ మావహించి, మతిచెఱచి, పాపకూపమున వారిని పడఁద్రోసిఉండును.

హయ—అట్లయిన వారంత అపరాధులుకారు. మతి మతిహీనులకార్యములు క్షమణీయములు. దానికేమిగాని, నేనుక చేరుమాలు నాభార్యకిచ్చిన—

జయ—ఇచ్చిన?

హయ—అది ఆమెదే. ఆమె దానిని ఎవనికిచ్చినను ఈయవచ్చు.

జయ—నిజగౌరవసంరక్షణభారముకూడ ఆమెదే. ఆమెదాని ఎవనికైన ఈయవచ్చునా?

హయ—చేరుమాలువలె అది ఇతరులకీయ వీలుకాదుగదా. గౌరవపుమాటకేమి? చేతిరుమాలుసంగతి—

జయ—హా! దైవమా! ఆమనోవిచారకారణాంశమును నీవు నాకు జ్ఞాపకము చేయకుండ ఉండిన ఎంతబాగుండును! హా! హా!

గీ. మరణవేదన పడుచున్న నరుని యింటి
పై ఎగురుచు, యమభటులఁ బ్రాణములను

తీయుఁడని హెచ్చరించెదు తీతుకవలె
వచ్చె జ్ఞప్తి కా నీచదుర్వార్త; అకట!

హాయ—దేవా! నానందేహనివృత్తికై అసంగతి అడిగితిని కాని తమమనస్సు నొప్పించుటకు కాదు; క్షమింపుఁడు. తమపై నాకుఁగల అభిమానమునుబట్టి, నాకు తెలిసినదియు, నాచెవులార వినినదియు దాఁచక విన్నవించితిని. కొందఱు మందమతులు తమపిటకత్తెలు,'ఇవిఇచ్చిరి-అవిఇచ్చిరి-ఇటు చేసిరి-అటు చేసిరి,'అనుచు గొప్పకై నలుగురితో చాటుటవాడుక.

జయ—ఈవిషయమై వాఁడు ఏమైన నీతో చెప్పెనా?

హాయ—చెప్పెను. తమవంటిపెద్దలుఅడిగిన లేదని ఘోరప్రమాణము చేయును

జయ—ఏమని చెప్పెను?

హాయ—చెప్పుటసత్యము. కాని—ఏమిచెప్పెనో సరిగా జ్ఞాపకము లేదు.

జయ—ఏమేమీ? చేతిరుమాలుఇచ్చుట! పుచ్చుకొనుట! నలుగురితో చాటుట! హా! నా చేతిరుమాలా! ఒప్పుకొనిన ఉరితీయుంచెదను. కాదు, కాదు. మొదట ఉరివేసినఁగాని ఒప్పుకొనఁడు. హా! నాఒడలినుండి పొగలెగయుచున్నవి. నాశరీరము నావశముతప్పి గడగడ వడఁకుచున్నది. తత్కారణము వారిరహస్య సంభాషణములు కావు. ఛా! అవికావు. (తనలో)

ఉ. చిక్కని పాలుగారునునుచెక్కిలి నొక్కెనో? ముద్దులాడెనో?
చక్కఁదనాల కెంపెదవి సారముఁ ఆనెనో? పంటనొక్కెనో?
చొక్కపు పెన్నెదన్ కనులఁ చూచెనో? లేక మఱేమిచేసెనో?
చక్కెరబొమ్మమైసోగనుఁ సన్నుతిచేసెనో? కౌఁగిలించెనో?.

...ఇటుల జరుగునా?...ఒప్పుకొనునా?... హా! చేతిరుమాలా!...ఓదయ్యమా! (నేలఁబడి మూర్ఛిల్లును.)

హాయ—(తనలో) కానిమ్ము. ఓనామంగా, నీపనికానిమ్ము. ఇట్లేకదా ఆ మాయికులగు మందమతులపాట్లు; మఱి నిష్కళంకచరితలగుకులసతులకు చీవాట్లు. (పైకి) ఆఁ! ఆఁ! ఇదేమి? హా! దేవా, దేవా, జయదేవా!

[కేశవుఁడు ప్రవేశించును]

కేశ—అన్నా! ఇదేమి?

హాయ—మూర్ఛిల్లెను. నిన్నటిదానితో ఇది రెండవతూరి.

కేశ—నొసలు గట్టిగా రాయుము.

హాయ—వద్దు, వద్దు. దానిఅంతట అదే తగ్గిపోవలెను. లేనిచో నురుగులు క్రక్కుచు లేచి పిచ్చివానివలె పైఁబడును. అదిగో, కదలుచున్నాఁడు. నీవు అటువెళ్లి ఇటు తిరిగిరమ్ము. ఇతఁడు లేచి వెళ్లిపోవును. పిమ్మట నీతో ఒకముఖ్యాంశము మాటాడవలసిఉన్నది.

కేశ—(వెళ్లిపోవును.)

హాయ—దేవా, పాపము! తలకు గట్టిదెబ్బ తగిలినది కాఁబోలును?

జయ—(లేచి) వెక్కిరించుచున్నావా? దేనికి దెబ్బతగిలెనో ఎఱుఁగవా?

హాయ—మీపాదములాన. వెక్కిరించుటలేదు. హృదయమునకుతోడు తల కూడ గాయపడెనని చింతించుచున్నాను. ఇట్టి సమయములందే కదా మనుజుఁడు తనమగటిమి చూపవలె!

జయ—మోసముచెందిన నేను మనుజుఁడనా?... కాను, వన్యమృగమునే.

హాయ—అట్లయిన, ప్రతిపురంబున అనేకవన్యమృగములును లెక్కలేని గోముఖవ్యాఘ్రములును కలవు.

జయ—వాఁడు ఒప్పుకొనెనా?

హాయ—దేవా! ధైర్యమును విడువకుఁడు. ఈదుర్భరమనోవిచారము ఒక్క తమకేకాదు; పుస్తెకట్టిన మగవారిలో అనేకులకు కలదు. పైవారిమాట ఎందుకు? నాఅవస్థ ఎట్లున్నదో! మొదట, నాసతి నాయెడ ఎట్లు ప్రవర్తించుచున్నదో తెలిసికొని, పిదప నేనెట్లు నడువవలెనో ఆలోచించెదను.

జయ—బాగు, బాగు. తప్పక తెలిసికొనవలసినదే.

హాయ—అయ్యా! తాము రవంత సేపు ఒకమూల దాఁగుకొనుఁడు. ఇప్పుడు

తపశ్చారితము చూపవలెను. కేశవుఁడు నాతోమాటాడ ఇక్కడకు వచ్చును. వానిమాటనే చెప్పించెదను. సాంతముగా వినుఁడు; తొందరపడకుఁడు. ఎక్కడ విలాసున ఎన్నాళ్లనుండి మృణాళినిస్నేహము సంపాదించెనో ముందేమిచేయునో చెప్పించెదను. కోపమును మాని వినుఁడు.

జయ——మంచిది. సాంతముగా వినియే——

హాయ——వద్దు; వద్దు. అది నావని. అదిగో, వాఁడు వచ్చుచున్నటులున్నది.

జయ——(దాఁగుకొనును.)

హాయ——(తనలో) కేశవునితో, వాని ఉంపుడుకత్తెనుగురించి, కదిపెదను. దానికి వానిమీఁదరంగు. దానిమాట వినఁగానె వాఁడు సంతోషముపట్టలేక వెలికి త్రక్కును. [కేశవుఁడుప్రవేశించును.]

వాఁడు నవ్వఁగున్నకొలఁది జయదేవు పిచ్చిహెచ్చుచుండును. (పైకి) అహో! సహాయసైన్యపతీ! దయచేయుము.

కేశ——అవని నాఁడే పోయినది. నీహేళనచే నామనస్తాపము హెచ్చుచున్నది.

హాయ——మృణాళిని నీవశమైఉండ, నీవని ఎక్కడకు పోవును. (మెల్లగా) పని ఇప్పించుశక్తి మాణిక్యమున కున్న, నీకింతశ్రమఉండదుకదా!

కేశ——(నవ్వుచు) ఇంకను అడుగుదువా!

జయ——వాని కెంతసంతోషముగా ఉన్నది!

హాయ——నీమీఁద మిక్కిలి రంగఁట?

కేశ——(నగుచు) ఆతొత్తుకా? పైనటనవలన నాకును అట్లే తోఁచుచున్నది.

జయ——ఔరా! అనుమానాస్పదముగా చెప్పుచు, నవ్వుచే స్థిరపఱుచుచున్నాఁడు.

హాయ——నీవు ఆమెను పెండ్లాడెదవని విన్నాఁడ. నిజమేనా?

కేశ——వా, వా! విచారముపోయి నవ్వువచ్చుచున్నది.

జయ——ఔరా! విశ్వాసఘాతకా! నీఅవిశ్వాసపిశాచకామితార్థము చేఁజిక్కినదని సంతోషించుచున్నావా? వైశ్యాధమా!

కేశ—ఆ ఎంగిలిమంగలము ఎవరికి కావలెను?

హాయ—చాలచక్కనిది; నీవు మంచి అదృష్టవంతుఁడవు.

కేశ—చక్కఁదనములో లోపము లేదు.

ఉ. తమ్ములు కన్నుదోయి జలదమ్ములఁ బెన్నెఱిబారుమీాలు, కుం
దమ్ములఁ ద్రోసిరాజను రదమ్ములు, బుగ్గలు చేయుముక్కల
ద్దమ్ముల, సత్పథమ్ము లలితమ్ముగుమధ్యము, సైకతమ్ము లం
దమ్ములఁ బ్రోవు తుంట్లు, ద్విరదమ్ముల మేలములాడు సెన్నడల్.

జయ—హా, హతవిధీ! నాభార్య అవయవములను ఒకసేవకాధముఁడు వర్ణించుచుండ వినుచు ఎటులూరకుందును! నాఅనుమానము నిజమైనది.

హాయ—శాంతము! శాంతము! తొందరకూడదు.

కేశ—ఏమనుచున్నావు?

హాయ—మెల్లఁగా చెప్పుము. మంచి అనుభవజ్ఞునివలె వర్ణించితివే.

కేశ—నా అనుభవమును బట్టియే వర్ణించుచున్నాను.

క. రాలుజవరాలుపలుకవరాలు,నగవులమగటాలురాలుఁగదా,శ్రీ
రాలోలుకుబుగ్గలంట;కరాలుకరాలు,పసిముద్దరాలా మెసువూ.

నన్నువిడిచి ఒకగడియ ఉండలేదు. నేనుకనఁబడఁగానె ఎదురుగావచ్చి కౌఁగిలించి గదిలోనికి కొనిపోయి లాలించి మెప్పించును.

జయ—హా, కేశవా! నిన్నునమ్మిన నన్నెంత మోసపుచ్చితివిరా, పశువా! నావడకగదిలో కాలుపెట్టితివా! ఎంతసాహసము!

[మాణిక్యము ప్రవేశించును.]

మాణి—(కోపముతో) ఇప్పుడేవచ్చెదనని చెప్పి ఇక్కడ ఏమిచేయుచున్నారు? ఆచేరుమాలిచ్చిన లంజకొడుకు ఎదురుచూచుచున్నారా? అట్టిరుమాలు నేనుకటి తయారుచేయవలెనా? చేసిన, దానిని ఆతొత్తుకు బహుమతి చేసెదరా? నావల్లకాదు; నేను చేయలేను.

కేశ—సుందరీ! ఎందుకంతకోపము?

జయ—హో, దైవమా! అది నా చేరుమాలై ఉండవలెను.

మాలి—అరుమాలు తవ్వటలో దొరకినదట! ఏమి సంగనాచిమాటలు! మంచిది; రాత్రిభోజనమునకు రారా? అప్పుడు...(పోవును)

హయ—వెళ్లు, వెళ్లు.

కేశ—ఇదే వెళ్లెదను. లేకున్న అది ఊరెల్ల చాటును.

హయ—రాత్రి అక్కడనే కదా భోజనము? మీరైన వచ్చి కలిసికొనెదను.

కేశ—సరే. (పోవును)

జయ—(ప్రవేశించి) హయగ్రీవా! దానిని చంపుటెట్లు?

హయ—దాని దౌర్జన్య విజయోత్సాహమును కనిపెట్టినారా?

జయ—హా, పాపపుదైవమా!

హయ—చేరుమాలు చూచినారా?

జయ—నాదేనా?

హయ—సందేహమా? ఆమందమతి మృణాళినిని ఎట్లువర్ణించెనో వింటిరా? ఆమె దానిని వానికిచ్చినది. వాఁడు దానిని తనలంజకిచ్చినాఁడు. ఇపుడు మీరారుమాలు కావలెననుట ఎఱిఁగి, అట్టిది మఱొకటి తయారు చేయుమని దానిని తొందరపెట్టుచున్నాఁడు.

జయ—దానిని ఒకఁడుసారి చంపిన, నాకసితీఱదు. ఏండ్లతరబడి దానిని చిత్రవధ చేయవలెను. హా! సుందరీ! సుందరీమణీ! జగదేకసుందరీమణీ!

హయ—హా! కూడదు, ఇపుడామె సౌందర్యము తలంచుట కూడదు.

జయ—నిజమే. గిజగిజ తన్నుకొని చావనిమ్ము. నేటిరాత్రితో దానిపని సరి. ఇఁక నాహృదయము వజ్రమే. కాని, అట్టిసుందరి మఱెందును గానరాదుకదా. చక్రవర్తులను పాదాక్రాంతులగునట్లు చేయఁగల సౌందర్యరాశి.

హయ—వద్దు వద్దు. తమమనస్సు ఆముసిఁడిపండు పై మెఱుఁగులకు లోనైన నిజపౌరుషమును చంపును.

జయ—వట్టిమాట; దానినేచంపును. నాదుర్వారాగ్రహశక్తికి బలిసేయ నున్న ద్విపాదపశువెట్టిదో నీతోచెప్పుచున్నాను; అంతే...హా! హా!

హయ—ఎన్ని సుగుణములున్నను, ఎంత చక్కఁదనమున్నను, వ్యభిచార గుణముగల కులకాంతపొందు పాపలేని కన్నువలె నిస్సారముకదా.

జయ—నిజమునిజము. కాని అతిసాధుస్వభావము సుమా.

హయ—అవును. ఆసంగతి ఆమెచర్యలే చాటుచున్నవి.

జయ—వెక్కిరించుటలేదు,; నిశ్చయమే. కాని హయగ్రీవా! ఎంతవిచా రింతును! ఓహయగ్రీవా! ఏమిచేయుదును? హా! ప్రాణపదమా!

హయ—అంతవిచారమెందుకు? ఆమెచేష్టలు తమకిష్టమైన, మాటాడక ఊరకుండుఁడు. కండకే దురదలేకున్న, బచ్చలికుండునా?

జయ—ఆకులటను క్షమాచేసిరీతిఅదను. కాకున్న నన్నీపేర పిలువకుము.

హయ—అంతదుర్న్యయమా!

జయ—నాసేవకునితో పోవుటో!

హయ—అది మఱింత దుర్న్యయము.

జయ—త్వరగా విషముతెమ్ము. ఆమె నాకంటఁబడిన నామనను చెదరిపో వును; కాన వాదులాడక చల్లఁగాపరిష్కరించెదను. లెమ్ము; ఈరాత్రియే

హయ—విషముపెట్టవద్దు. ఏపఱుపుపై విటునితో సౌఖ్యమనుభవించినదో, ఆపఱుపుమీఁదనె ఆమెపీఁకె నులిపివేయుఁడు.

జయ—బాగు, బాగు. అదే తగినశిక్ష.

హయ—ఇఁక కేశవునిసంగతి నాది. ఈరాత్రి మీకే తెలియును.

జయ—సంతోషమే. (లోపల భేరిధ్వని) ఎవరి దాభేరీనాదము?

హయ—ఏదో విదిశాపురవార్త. అదిగో, రాజుగారిదగ్గఱనుండి లక్ష్మణశ ర్మగారు వచ్చినారు. ఇటువచ్చుచున్నారు తమభార్యతో.

జయ—రమ్ము. అతని నెదుర్కొందము. (పోవుదురు)

పంచమాంకము.

ప్రథమరంగము—కోటలోనిగది.

[హేమాంగీ జయదేవులుందురు.]

జయ—నీవేమియు చూడలేదా?

హేమా—చూడలేదు సరేకదా వినలేదు; మఱి అట్టిఅనుమానము కలుగలేదు.

జయ—వారిద్దఱును మాటలాడుకొనుట నీవు చూచియుంటివికదా.

హేమా—చూచుటే కాదు. వారినోటినుండివచ్చు ప్రతిఅక్షరమును విన్నాను.

జయ—ఏమీ? వారెప్పుడును గుసగుసలాడుకొనలేదా?

హేమా—ఎప్పుడును లేదు.

జయ—నామాటవిను; చెడిపోకు. నిజముచెప్పితివేని, నీకు మంచిబహుమానము చేసెదను. ఇదిగో ఈహారము పుచ్చుకొనుము. (ఈయఁబోవును)

హేమా—ఈతుచ్ఛలాభమునకు అబద్ధమాడుదునా? వట్టిది.

జయ—నిజము చెప్పవా?

హేమా—అయ్యో! తాముకన్ను లెఱ్ఱఁజేసినంతనే జడిసి మాటలఁ దడఁబడుదానను కాను. లేనిపోని అనుమానము కల్పించుకొని మీమనస్సు చెఱుచుకొనుచున్నారేకాని వారు నిర్దోషులు. ముమ్మాటికి నిర్దోషులు.

జయ—ఆలాగుననా? ఇదితెమ్ము; అదితెమ్ము- అని నిన్నెప్పుడును ఆమె లోనికి పంపివేయలేదా?

హేమా—లేదు, లేదు. నేనెప్పుడును ఆమెవెంటనే నీడవలె ఉందును. ఎవఁడో అధముఁడు మీఅపరూపదాంపత్యము చూచి ఓర్వలేక ఈనీలాపనింద కల్పించినాఁడు. మృణాళినియే మగని మోసపుచ్చిన, మఱి భూలోకమున పతివ్రతలేరీ?

జయ—సరే. నీవువెళ్లి ఆమెనుపంపుము.

హేమా—(పోవును.)

జయ—దాసి ఎవ్వడును యజమానురాలిపక్షముననే వాదించును. ఇది జాణ. ఇట్టి ఫీచరహాస్యార్థమును దాఁచుటలో చాలగట్టిది.

[మృణాళినీ హేమాంగులు ప్రవేశింతురు.]

మృణా—నాథా! ఏమి సెలవు?

జయ—కన్నులు సరిగా విప్పి నాముఖమువైపు చూడుము.

మృణా—మీమాటలు వింతగా ఉన్నవే.

జయ—హేమాంగీ! విటులను కార్చినపిమ్మట నీవు చేయుదుందువని వీథిగుమ్మముదగ్గఱ కాపుండుకేకదా. ఎవ్వరైనవచ్చిన దగ్గుము; లేదా గట్టిగ మాటలాడుము. నీవ్యాపారధూర్తములు నీకే తెలియును వెళ్లు.

హేమా—(పోవును.)

మృణా—నాథా! మీమాటలు నాకు అర్థముకాలేదు. ఎందుకింత కోపము?

జయ—ఛీ! నీనక్రభినయములు నీవగకాని ప్రక్కనుంచి మాటాడుము.

మృణా—నావగకాని ప్రక్కనుండియే మాటాడుచున్నాను.

జయ—కులటా! ఎవఁడే నీవగకాఁడు?

మృణా—ఇపుడు నాయెదుటనున్న అందగాఁడే నావగకాఁడు

జయ—చేసినపాపమునకు అనృతిమహాపాపమునుకూడ జతచేసితివేని నక్కలుకూడ నిన్ను ముట్టుకొనవు. నిజమాడుము; చెడిపోకుము.

మృణా—(మోకాళ్లఁబడి) పంచభూతములుసాక్షిగా, ఈపావనపాదపంకజములసాక్షిగా, ఇపుడునాయెదుటనున్న అందగాఁడే నావగకాఁడు.

జయ—(కన్నులు చేతులతోమూసికొని) హా! మృణాళినీ! పోవే, కదలిపోవే, నాయెదుటనుండి లేచిపోవే.

చ. కొలువు తొలంగినన్, సిరులుకూలిన, బంధుహితుల్ నశించినన్,
కలిగిన దీర్ఘజాడ్యములు, కట్టఁగ మూరెడుగుడ్డ, పొట్టకున్
పిడికెడుతిండియున్, నిలువ నీడయు చిక్కకయున్న, ఆజిలో
పడినను, నామనంబిటు లపారవిచారములో మునుంగునా?

మృగా—హా! నేఁడెంతదుర్దినము! నేను కనఁబడఁగానే ఆనందబాష్పధారలు కార్చు కన్నులు, నేఁడినీటిబొట్లు ఇపుడేల కార్చుచున్నవి? (చేరుమాలుతో కన్నులుతుడుచుచు) వెంటనే విదిశాపురమునకు రావలసినదని మాఅన్న మీకు తెచ్చిఇచ్చిన రాజాజ్ఞాపత్రమునకు కారకుఁడు మానాన్నగారైనను, నేను నిర్దోషినికదా. ఆయన తమకువిరోధియైన, నాకును విరోధియేకదా. ఆయనమీఁదికోపము నాపై చూపుట ధర్మమా?

జయ—ఎట్టి ఇబ్బందులైన భరింపవచ్చును గాని గుణవతికానిసతితో కాఁపురము చేయుట కష్టము, కష్టము, మిక్కిలికష్టము. నాఁడా కుటిలాత్ముండు దుర్యోధనుండు నిండుపేరోలగంబున పాండవపత్నిని నిజాంకభాగమున కూర్చుండుమని కనుసైఁగ చేసినపుడుకూడ కోపమెఱుఁగని ధర్మజుఁడైన ఇట్టి అపకారమును సహించునా?... నేను ఏఅమూల్యమంగళవిగ్రహమునందు నాపంచప్రాణము లుంచితినో- నేను ఏదివ్యపదార్థరాజమును నాకన్నులపండువుగ ఎన్నుకొనుచుంటినో- ఏఫలరాజమును నాపూర్వజన్మకృతార్జితపుణ్యసత్ఫలరాజమని సంతతసంతోషసాగరమున తేలుచుంటినో- అది ఇప్పుడు నాప్రాణములుతీయుచు, కంటికసహ్యమగుచు నన్ను దుఃఖకూపమున త్రోసివేసె. దానిబాధ తప్పించుకొనుట ఎట్లో?

మృగా—అట్టి బాధకలిగించినదానను నేనుకానుకదా?

జయ—(నిందాగర్భముగ) అచ్చే! నీవేమి? బాధకలిగించుటేమి? నీవున్న హతనులతాప్రభాతిశయమున కనులు మిఱుమిట్లుకొనుటయేకాక, నీపాతివ్రత్యమహిమాధిక్యమున తలనొప్పి ఎత్తుచున్నది.

మృగా—అయ్యో! నాకు తెలియనిపాపము ఏమిచేసితిని?

జయ—ఓమతిమాలినపాపపుదయ్యమా! 'రూపవతీ భార్యాశత్రుః', అను ఆర్యోక్తి సార్థకము చేయుటకా ఈజగన్మోహినిని సృజించినావు? చంద్రమండలమునకు మచ్చఉన్నది; కాని, నాసతిమోము నిష్కలంకమై

నదని సంతసిల్లుచుండ, నాకు తెలియకుండ జీడితో,'లంజ' అని వ్రాసి ఉంచితివా! ఓవాడవదినా! ఏమిచేసితివా? చేసితివి! నన్నుచెప్పమందువా? ఎఱుఁగవా? ఏమిచేసితివా? జారిణీ!

మృణా—హా! ఏమేమి? పాపపుమాటలాడకుఁడు.

జయ—నీవు అంకులాడివి కావా?

మృణా—కాను, ముమ్మాటికి కాను. నాశరీరంబును సూర్యచంద్రాదులసాక్షిగా నాప్రాణేశ్వరునకు అర్పించితిని, కాన దీనిని ఒకఁడు ముట్టుకొనుటకు వాకుఁ లేదు.

జయ—ఏమీ? నీవు లంజవుకావా?

మృణా—మనదాంపత్యమును దైవము రక్షించుఁగాక!

జయ—అటులనా? పొరపడితిని; క్షమింపుము. ఈదౌర్భాగ్యుఁడగు జయదేవుని పెండ్లాడి మోసపుచ్చిన ఆవిదిశాపురపులంజవని అనుకొంటిని.

మృణా—తమమాటలు ఈమూర్ఖురాలికి బోధపడలేదు. నేను తమసతినే.

జయ—మృణాళినీ! ఈరాత్రి నీకు బోధపఱచెదను. పడకగదిలో నీవు ఒకఁతెవే ఉండుము. (పోవును)

హేమా—(ప్రవేశించి) అమ్మా! ఏమిసమాచారము?

మృణా—ఏమియులేదు. నన్ను అడుగకుము. నేను ఏడువలేను; మఱి చెప్పుటకు మాట నోటినుండి రాకున్నది. కనుక, ఆపనులను నాకన్నులకు అప్పగించితి. హేమాంగీ! నేటిరాత్రి నాపెండ్లిదుస్తులను నామంచముపై ఉంచుము; మఱచిపోకుము. వెళ్లి హయగ్రీవుని తీసికొనిరమ్ము.

హేమా—ఏదో విపరీతము జరుగనున్నది. (పోవును)

మృణా—గౌరి, బంధువులతో దెబ్బలాడి, పెండ్లాడినందుకు మంచిశాస్తి అయినది. తనప్రేమాభిమానములనంద నేనెంతజాగ్రత్తగా ప్రవర్తించుచున్నను లాభములేకపోయె.

[హేమాంగీ హయగ్రీవులు ప్రవేశింతురు.]

హయ — అమ్మా! ఏమటుల దిన్నపోయియున్నారు?

మృణా — ఏమిచెప్పుదు? అంతయు అయోమయము. పిల్లలకు బుద్ధులు చనువునను భయమునఁ జేకదా పెద్దలు చెప్పుదురు. నేను చిన్నదానను కానా? ఆయన నాకటులే కసరి బుద్ధి చెప్పకూడదా? నాతప్పు చూపి దిద్దరాదా?

హయ — ఆమన ఏమనెను?

హేమా — అనరానిమాటలాడెను; లంజ అనితిట్టెను. ఏ ఇల్లాలిమనసు నొవ్వదు?

మృణా — ఆపేరు నాకుచెల్లునా? హయగ్రీవా!

హయ — అమ్మా! ఏపేరు?

మృణా — నీభార్య ఇపుడు చెప్పలేదా?

హేమా — ఈసాధ్విని వాడవదిన అనిపిలిచెను. తప్పత్రాగి మతిచెడి వీధులలో దొర్లు నీచాధముఁడైన తనలంజను లంజఅని దానిఎదుట అనజంకునుకదా.

హయ — అట్లనుటకు కారణమేమి?

మృణా — నాకు తెలియదు. ఆపేరు నాఇంటి కుక్కకైన చెల్లదు.

(కన్నులు తుడుచుకొనును)

హయ — అమ్మా! ఏడువకుము. నేఁడెట్టి దుర్దినము!

హేమా — లంజ అని పిలిపించుకొనుటకే కాఁబోలు గొప్పగొప్ప సంబంధములను, తల్లిదండ్రులను, స్వస్థలమును, స్నేహితులను దిగనాడి ఈమె ఇటువచ్చినది? ఆమాటవిన, నాకే ఏడుపు వచ్చుచున్నది.

మృణా — దీనికంతకు కారణము నాదురదృష్టమే.

హయ — అమ్మా! నీకసితీర వానిశపింపుము. పతివ్రతాశాపమమోఘముకదా

మృణా — అది పతివ్రతకు లక్షణమే కాదు. పరాత్పరుఁడు లేఁడా?

హేమా — ఎవఁడో పరమనీచుఁడు, ముఖస్తోత్రపాఠకుఁడు, గౌరవములేని గాడిద, స్వలాభమునకై ఈనింద కల్పించినాఁడు.

హయ—ఛీ! అట్టివాఁడు ఎవఁడును లేఁడు. అలాగున జరుగనేరదు.

మృణా—అట్టివాఁ డెవఁడైననున్న, దైవము వానిని క్షమించును గాక!

హేమా—ఉత్రాడు వానికంఠమును చుట్టుకొనుఁగాక! రాపులుగులు వానికన్నులఁ బొడుచుఁగాక! అకల్లరీనినోట పెద్దపుండుపుట్టి ప్రేలెడంత పురుగులు ఎడతెగక పడుఁగాక! వానిజిహ్వ పడిపోవును గాక! వానిదేహమును పెద్దరోగము ముట్టడించును గాక! వాఁడు కుళ్లికుళ్లి దిక్కుమాలినకుక్కవలె చచ్చును గాక! వాఁడే మగవాఁడైన, వానికే అవగింజంత ధైర్యమున్న, నానిరక్తనాళములలో ప్రవహించురక్తము నిర్మలమైనదైన, ఈసాధ్వి ఎప్పుడు- ఎక్కడ- ఎవనితో- ఱంకుపోయినదో నలుగురిలో రుజువుచేయరాదా? ఓ దైవమా! ఆమేకవన్నె తోడేలు బయల్పడిన ఎంత బాగుండును! వానిని దిగంబరునిచేసి, కొఱతవేసి, చచ్చువఱకు కొరడాలతో కొట్టిన కొంత కసితీరుఁగదా.

హయ—ఛీ! నోరుమూసికొనుము. ఎవ్వరైన వినిన, నవ్వెదరు. నేఁటికి గొప్ప తగవరివి బయలుదేఱినావు! ఇది అఁడుమళయాళము కాదు.

హేమా—ఇంతకుముందు, ఎవఁడో తుచ్ఛుఁడు నాకును సైన్యాధిపతికిని రహస్యసంబంధ మున్నదని మీతో చెప్పలేదా?

హయ—ఛీ! ఛీ! పో.

మృణా—ఓసజ్జనోత్తమా, హయగ్రీవా! నానాథుఁడు తిరిగినన్ను ఆదరించుటకు ఏమి చేయుదును? నీవైన నాఅమాయకత్వమునుగుఱించి ఆయనతో గట్టిగ చెప్పవా? ఆయనకింత కోపము వచ్చుటకు కారణము నాకింతవఱకును స్ఫురింపకున్నది. దైవము సాక్షిగా చెప్పుచున్నాను; విను. త్రికరణశుద్ధిగా నేను ఆయననే దైవముగా భావించి సేవించుచున్నాను. నా పంచేంద్రియంబులందు ఏదియు పరపురుషుని కోరలేదు, కోరఁబోదు. నిర్దయ ఏదైన చేయఁగలదు. కాని, నేను ఆయన పవిత్రనామమంత్రమును పఠించుచు కాలము పుచ్చుదాననే కాని వేరొకలాగున ఎంతమా

త్రము జరుగనేరదు. నన్ను విడిచిపెసిన ఇహలోకసుఖములకు చెడుదు నే కాని పరలోకసౌఖ్యములకు చెడను.

హయ—అమ్మా! విచారింపకుము. కేశవుని తనస్థానమున నియమించి మఱొకదేశమునకు వెళ్లవలసినదని రాజు ఆజ్ఞాపించుటచే, ఆయనమనస్సు కలఁగి ఇటుల పరిణమించెను.

మృణా—నిజము చెపుము. దీనికంతకు కారణము అదేనా?

హయ—మీపాదములతోడు. అదే. (లోపల భేరీ నాదము)

అదిగో, రాత్రి భోజనమునకు రమ్మని భేరి పిలుచుచున్నది. అతిథులు కూడ వచ్చి ఉన్నారు. శీఘ్రముగా వెళ్ళుఁడు. విచారింపకుఁడు. త్వరలోనే కలిసికొనెదరు.

మృణా, హేమా—(పోవుదురు.)

హయ—దైవానుగ్రహమున నేను వేసినమాయ అను విత్తనము మొలకెత్తి, పెరిగి పెద్దదై ఫలింప సిద్ధముగా ఉన్నది. ఈరాత్రికూడ దేవుఁడు నాకు తోడ్పడిన, అది ఫలించి నన్ను సంతోషాబ్ధిని తేలించును. జయదేవుమృణాళినిని ఈరాత్రి చంపుట నిశ్చయము. ఇక, కేశవుని చంపుటకు రాధాకాంతుని పురికొల్పెదను. (పోవును.)

ద్వితీయరంగము—రాజమార్గము.

[రాధాకాంతుఁడును, హయగ్రీవుఁడును ప్రవేశింతురు]

హయ—రాధాకాంతా! ఈమూల నిలఁబడుము. వాఁడిప్పుడు ఈదారినే వచ్చును. ఒఱనుండి కత్తిదీయుము; సిద్ధముగా ఉండుము. నీశక్తికొలఁది ఒక్కపోటుపొడువు; భయపడకు. నేను నీదగ్గఱనే ఉండును. ఈదెబ్బతో మనపని పండో కాయో తెలియును. ఒక్కదెబ్బతో వానిని వాని అబ్బపక్కఁ చేర్చితివా మృణాళిని నీప్రక్కఁ చేరును.

రాధా—నాదగ్గఱనే ఉండుము. ఒకవేళ నాదెబ్బ తేలిపోవునేమో?

హయ—అట్లే ఉండెదను. భయపడకు; సిద్ధముగా ఉండుము. (వెనుకకుపోవును)

రాధా—(తనలో) వానినిచంపుట నాకంత ఇష్టము లేదు; కాని, హయగ్రీవునిమాటలనుబట్టి ఒప్పుకొంటిని. ఇంకను వాఁడుచచ్చిన లోకమునకేమి లోటు? అరే దురాత్మా! ఇదే చచ్చితివి. (కత్తినద్దును.)

హయ—(తనలో) ఊపిచ్చివానిని మెల్లగ ఉసికొల్పితిని; కోపము తెప్పించితిని. వీఁడు కేశవుని చంపినను, కేశవుఁడు వీనిని చంపినను నాకు లాభమే. ఇద్దఱును చచ్చిన నాకు మఱింత లాభము. రాధాకాంతుఁడు బ్రతికిఉన్న, వానిని మోసపుచ్చి మృణాళినికిచ్చెదనని నేను పుచ్చుకొనిన ద్రవ్యాభరణములకైనను రక్షకు ఉద్యుక్తమానఁడు. కాఁబట్టి వాఁడు చావవలసినదే. మఱి కేశవుఁడా నాటొమ్ముపై కుంపటి.

[కేశవుఁడు ప్రవేశించును.]

రాధా—అదుగో! అరే, దుర్మార్గా! ఇదే చచ్చితివి. (కేశవుని పొడుచును)

కేశ—హా, దురాత్మా, నామైమర్మమును నీకత్తి జయింపలేదు. ఇదే, చచ్చినావు. (కత్తితీసి రాధాకాంతుని పొడుచును.)

రాధా—(నేలఁబడి) హా! చచ్చితి. చచ్చితి.

హయ—(వెనుకనుండి వచ్చి కేశవుని కాలుపై పొడిచి పాఱిపోవును.)

కేశ—(నేలఁబడి) హా! కాలుపోయినది. కాపాడుఁడు, కాపాడుఁడు. చంపివేయుచున్నారు.

జయ—(ప్రవేశించి తనలో) ఆ ఆర్తనాదము కేశవునిదే. హయగ్రీవుఁడు ఆడితప్పనివాఁడు. అరే, స్వామిద్రోహీ! చావుము, గిజగిజతన్నుకొని చావుము. కిలంజా! నీకాళ్ళముప్పుటకిదే వచ్చుచున్నాను. (పోవును.)

[లక్ష్మణవర్మయు, మహేంద్రవర్మయు ప్రవేశింతురు.]

కేశ—హా! ఎవరును రారేమి? బాటసారులైనను లేరా? అయ్యో! అయ్యో!!

లక్ష్మ—ఆ ఆర్తధ్వని హృదయమును పగిలించుచున్నది.

కేశ—రక్షింపుఁడు, రక్షింపుఁడు.

రాధా—హా! నేనెంత దిక్కుమాలిపోతిని?

లక్ష్మి—ఇద్దఱు మగలు ఉన్నటులున్నది. వీండ్రు ఎవనినో మోసపుచ్చుటకు అకృత్రిమార్తధ్వనులను చేయుచున్నట్లున్నది. మనము తోడులేకుండ ఆచోటికి వెళ్లరాదు.

రాధా—ఎవరును సాయము చేయరా? నెత్తురుకాఱి నేను చావవలసినదేనా?

మహేం—ఎవఁడో దీపము పట్టుకొని ఇటు వచ్చుచున్నాఁడు.

[దీపము పట్టుకొని హయగ్రీవుఁడు ప్రవేశించును.]

హయ—ఎవరక్కడ? ఆ ఆర్తనాదము ఎవరిది?

మహేం—మాకు తెలియదు.

లక్ష్మి—ఓహో! హయగ్రీవా! సమయమునకు వచ్చినావు.

కేశ—ఇక్కడ, ఇక్కడ. మీకు చాల పుణ్యము; రక్షించుఁడు, రక్షించుఁడు.

హయ—(వెళ్ళి) ఎవరు నీవు? ఏమి సమాచారము?

కేశ—ఎవరో దుర్మార్గులు నాపైనిపడి నాకాలు నఱికినారు.

హయ—హా! దైవమా, ఎంత ఘోరము! కేశవా! ఎవరా దుర్మార్గులు?

కేశ—వారిలో ఒకఁడు ఇక్కడనే పడి ఉన్నటులున్నది.

హయ—హా! లంజలకొడుకులు ఎంతపని చేసినారు? అయ్యలారా! అక్కడనే నిలఁబడి ఉన్నారేమి? రారేమి? సాయపడరేమి?

లక్ష్మి, మహేం—(దగ్గఱకు వెళ్లుదురు.)

రాధా—అయ్యా! నాకు సాయము చేయరా?

కేశ—ఆదుర్మార్గులలో వాఁడొకఁడు.

హయ—ఓరా, నరహంతకా! ఇదే, నాసాయము. (పొడుచును.)

రాధా—ఓరీ! కృతఘ్నా! విశ్వాసఘాతుకా! హయగ్రీవా! (మూర్ఛిల్లును)

హయ—చీఁకటిలో దారికాచి పగతీర్చుకొను అధమాధములు కూడ లోకమునకలరా? అయ్యా! ఇతఁడు మనసహాయసైన్యపతి, కేశవవర్మ.

[రాజభటులు ప్రవేశింతురు.]

మహేం— ఆఁ! అలాగుననా? ఎంతపని?

హాయ— దీనికంతకు కారణము లంజ. ఇది లంజతనవేకాని మఱొకటి కాదు. ముండలకొఱకు రాత్రులందు తిరుగు మహానుభావులకు అప్పుడప్పుడు ఇట్టి సన్మానములు జరుగుచుండును. భటులారా! వీనిని వైద్యశాలకు కొనిపొండు. అయ్యా! మనమునువెళ్ళి దగ్గఱనుండి కేశవునిగాయమునకు కట్టుకట్టింతము. (పోవుదురు.)

భటులు— (కేశవుని రాధాకాంతుని మోసికొనిపోవుదురు.)

తృతీయరంగము— పడకగది.

[మృణాళిని నిద్రించుచుండును.]

జయ— (ప్రవేశించి) అదే కారణము; నామనస్తాపమునకును, నాకృతనిశ్చయమునకును అదే కారణము. ఓతారా! ఆకారణమును నీతోకూడ చెప్పుటకు నాకు సిగ్గగుచున్నది. మగఁడన ఏమోఎఱుఁగని బాల్యదశను, నీతలిదండ్రులు నీకు కట్టిపెట్టిన ముసలిమగని, జ్ఞానమువచ్చినపిమ్మట విడనాడి నీమనసుకు నచ్చిన చంద్రుని వరించి వానిని ఎన్నికష్టములువచ్చినను విడనాడవైతివి. ఈకులటకంటె నీవే వేయిమడుఁగులు గుణవంతురాలవుకదా...అదిగో, నాభికలిపినజున్నుముక్క— నాసౌఖ్యమును చెఱుపపుట్టిన శనిముక్క— నామనసును మోసపుచ్చిన ముసిఁడిపండు— నాకనులను ఆకర్షించిన మంచుకొండ— కొండంతపాపము చేసి హాయిగానిద్రించుచున్నది... కేశవుఁడు ప్రక్కలో లేఁడే? దీనికెట్లు నిద్రపట్టినదో! ...ఓసీ, నక్కులకంటకమా! నేను తలఎత్తుకొని తిరుగకుండ చేసితివి కదే దయ్యమా. నాకంటికి చుంచులాగున అగపడుచు, నావెనుక పందికొక్కువై నాసౌఖ్యసంతోష ధాన్యరాశి కిమ్మగు సెమ్మది అను గాదిక్రింద పెద్దకన్నము చేసితివికదే.

ఉ. నీవెలివన్నెచిన్నెలకు నివ్వెఱగొందుచు ముందు లెందఱో
నీవలఁజిక్కి మాడుదురు నిక్కము దుర్యశోవహ్నికీలలన్
నావలె; కాన, చంపెదను నాపగతీఱఁగ; కాని, కత్తితో
ఈవిల సత్తనూలతను వ్రేఁచను; ముంగలివాని అద్దమా!.

(దగ్గఱకు వెళ్లి) ఆహా! ఈపరిపూర్ణముఖవిధుబింబము నిద్రావస్థయందు ఎంతమనోహరముగా ఉన్నది! పార్వతీపరమేశ్వరులు భూలోకచిత్రములు చూడ బయలువెడలి, పాపులగు మానవుల దృష్టిచెదర్పవిడిచిన విద్యుల్లత విధమున వెలుగొందుచున్నది...చంపను, చంపను...కత్తితో చంపను. గులాబిపూవుతావి కోసినపిమ్మట తగ్గుట సహజముకాని ఇంకను చెట్టుననున్న, నలుగురికంటఁబడి చెడును. కాన, కోయకముందే తత్పరిమళసుఖ మనుభవించెదను. (ముద్దుపెట్టుకొని) అన్నా! ఈసుందరాంగిబుగ్గ నాపెదవికి తాఁకుటచే ద్వేషానలమున పడి ఉడుకుచున్న నాశరీరము చల్లఁబడి పులుకలెత్తుచున్నది...మనసా! నీవును ఆకులటకే సాయపడెదవా? నా ఉద్దేశము రద్దుచేసెదవా? నన్ను అపకీర్తిపాలుచేసెదవా? ఇంకొకసారి ముద్దాడెదవా? వద్దు, వద్దు; ఎంగిలికూటికాశింపను.

మృగా—ఎవరిది? ప్రాణేశ్వరా!

జయ—ఆఁ, సుందరీ!

మృగా—(లేచి) నన్నొంటిగ విడిచిపెట్టి తామింత సేపు బైనుండుట ధర్మమా?

జయ—నేనాలస్యము చేయుట నీకుమంచిదేకదా. నీకుతోడుండువారేలేరా?

మృగా—నన్నొకతెనే ఉండుమని తాము చెప్పలేదా?

జయ—అహా! ఈనాఁటికైన నామాట పాటించితివే. నీకు స్వర్గము రాఁగలదు. ఏదేనిపాపము చేసిన, క్షమింప దేవుని వేఁడుకొనుము. త్వరపడుము.

మృగా—హా! నాథా! నన్ను చంపుటకా వచ్చినారు?

జయ—నీమేలుకోరి నేను చెప్పినపని చేయుము. లేదా నీకు నరకమే గతి.

మృగా— కమాచి—ఆది.

ఇదేమినాథా- ఇట్లాడెదరు?॥ ఇదే॥
సదయానాతప్పు- దయ్యెన తెలుపరే॥ ఇదే॥

(కాళ్లు పట్టుకొనును.)

జయ—ఛీ! కులటా, నన్నంటకుము, నీపాపము నీకే తెలియదా?

మృగా— కటకటా! మీరిట్టి- కఠినోక్తులాడఁగా
ఎటువంటినేరము- నేఁ జేయఁగాలేదే॥ ఇదే॥

జయ—ఎవరితప్పులు వారికి ఒప్పులుగానే తోఁచును. ఆలోచింపుము.

మృగా— ఎంతయోచించిన- ఏమియు కానరాదు!
ఇంతకోపమేల- హృదయేశ, నామీఁద॥ ఇదే॥

(లేచి కౌఁగిలించుకొనఁబోవును.)

జయ—ఛీ! దూరముగా పొమ్ము. కుక్కముట్టుకొనిన పదార్థమును సదాచారి తాఁకునే?

మృగా—నన్ను ఏకుక్క ముట్టుకొనినదని తా మనుమానించుచున్నారు?

జయ—కేశవనామమున అల్లాడుచున్న దిక్కుమాలిన దొంగకుక్క.

మృగా—నన్ను దురుద్దేశముతో ముట్టుకొనుటకు వానికి ఎన్ని వేలగుండెలు కావలె. ఎవఁడో కలహప్రియుఁడు ఈనీలాపనింద నాపై వేసినాఁడు. కాని నేనతనిని సహోదరునిగా భావించి ప్రేమించుచున్నాను.

జయ—ఓసీ, చండాలినీ! అంకుఁబోతుల వావివరుసలు నేనెఱుఁగనివాఁడను కాను. పగలు అన్న, రాత్రి బావ; పగలు చెల్లెలు రాత్రి మరదలు. నేను మొదట నీకిచ్చిన నాచేరుమాలును నీవు వానికీయలేదా?

మృగా—లేదు, లేదు. మీపాదములతోడు. వానిని పిలిపించి అడుగుఁడు.

జయ—చేసినపాపము చెప్పిన పోవునని పెద్దలందురు. కాన ఇంకను ఎందుకు బొంకెదవు? నీఅంత్యకాలము దగ్గఱపడినది. నిజము చెప్పుము.

మృగా—హా! అప్పుడేనా? ఓపరమేశ్వరా! ఈనిర్దోషిని రక్షింపుము.

జయ—తథాస్తు!

మృణా—నాథా! ఏపాపమెఱుఁగని నన్నుచంపి, స్త్రీహత్యా మహాపాతకము పాలుగాకుఁడు. తొందరపడక సావధానముగ ఆలోచింపుఁడు. మీకు విరుద్ధముగ నేనెన్నఁడును నడువలేదు. కేశవునిపై నాకుఁగల దయ భూతదయగాని వేరొకటికాదు. ఆరుమాలతనికి నే నీయలేదు.

జయ—ఓసీ! జల్పసీ! నారుమాలు వానిచేతిలో నుండఁగా కన్నారఁజూచిన నన్నే బూకరించుచున్నావా? వద్దు వద్దు; కల్లలాడి చిత్రవధ పాల్గాకుము.

మృణా—వానికది దొరకినదేమో? నాచేతులతో నీయలేను. వానిని పిలిపింపుఁడు. అతఁడు నేను ఇచ్చితినని చెప్పిన నన్ను చిత్రవధ చేయుఁడు.

జయ—పోవే, పో. వాడెక్కడ ఉన్నాఁడు? హయగ్రీవుఁడు వానిని ఇంత వఱకుంచునా!

మృణా—ఏమీ? కేశవుఁడు లేఁడా? హా! కేశవా! ఆరుమాలు నీపాలిట మృత్యుదేవత ఆయెనా?

జయ—అంకులాడి! నాముందే నీ యంకుమగనిఁ గూర్చి ఏడ్చెదవా? (కత్తి తీయును.)

మృణా—నన్ను చంపకుఁడు. చంపకుఁడు. (కాళ్ళపైఁబడును.)

జయ—ఛీ! కులటా! (త్రోసివేయును.)

మృణా—సీ మిమ్ముదైవంబుగా నమ్ముటతప్ప, ఏ
పాప మెఱుంగనో ప్రాణనాథ!
త్రికరణశుద్ధిగా ప్రేమించుచుంటి మిమ్ము,
నానేర మందురా ప్రాణనాథ!
మన మొందు సౌఖ్యముల్ కని ఓర్వ కెవ్వఁడో
ఈనింద కల్పించె ప్రాణనాథ!
కలనైన అన్యుని కామింపనట్టి మీ
పాదసేవకురాలనో ప్రాణనాథ!

పరులమాటలు నమ్మఁగా వలదు, వలదు;
ఇంతతొందరచెందుట హితముకాదు;
రేపు చంపుము నాథ! ఈ మాపు వద్దు;
మనసుతీర నిన్ కననిమ్ము; మనవి వినుము.

జయ—నిన్ను చంపను చంపను. (కత్తి నేలఁబడవేయును.)
మృణా—(దిగ్గున లేచి) హా! ప్రాణదాతా! (కౌఁగిలించుకొనఁబోవును.)
జయ—కత్తితో చంపను. (మంచముపైఁబడఁద్రోసి) లేచితివా చిత్రవధయే.
మృణా—అయ్యో! అయ్యో! మృత్యుదేవతా!

సీ. మొన్ననే కాపురంబునకు వచ్చినదాన,
కోరికలేవియు తీరలేదు;
వలచి పెండ్లాడిన వరునితో మనసార
హాయిగా సౌఖ్యంబు లందలేదు;
నాఆశ తీరఁగా నాగర్భమందున
ఫలమింక ఒకటియు కలుగలేదు;
నగలపై తనువుపై మగనిపై కలనాడు
మమకారమింతయు మాయలేదు;
మొన్న మొన్న నేకద నేను కన్నువిప్పి
నాను; నామీఁద కనువేసి నావె అపుడె?
అమ్మ! మృత్యువా! నీకిది న్యాయమౌనె?
నన్ను మఱచిపొమ్మింకఁ కొన్నాళ్లు తల్లి!.

జయ—ఛీ! నోరు మూసికొనుము. (కంఠము నొక్కఁబోవును)
మృణా—హా! చచ్చితి. దైవప్రార్థన—
జయ—లాభములేదు- (నొక్కివేయును) సరి. పోయినది, నామనోవికార కారణభూతము మాసిపోయినది.

హేమా—(లోపల) దేవా! దేవా! అయ్యో! అయ్యో! దేవా!

జయ—ఎక్కడిదీధ్వని? ఇంకను చావలేదా? పాపము! నిన్నట్టి ఆయాస పెట్టుటకు నాకతినచిత్తము ఒప్పకున్నది (మరల పీఁకనొక్కును.)

హేమా—దేవా! దేవా! తలుపు తీయుఁడు.

జయ—ఎవరది?

హేమా—హేమాంగిని. తమతో ఒకకబురు చెప్పవచ్చితిని.

జయ—హేమాంగియే. ఆఁగుము, ఆఁగుము. వచ్చిపోయినది... కేశవుని మరణవార్త కాఁబోలు చెప్పవచ్చినది. ఇంకను కదలుచున్నదా?... లేదు, లేదు. తలుపుతీయుదునా? కదలునేమో?... పట్టిది. ఆమె లోనికిరాఁగానే, నానతినే పిలుదును. నానతి! హా, సతీ! ఏదీనానతి? ఈనిర్భాగ్యునకు భార్య ఎక్కడ? హా సతీవతంసమా! నేఁడెట్టి దుర్దినము! పట్టపగలు సూర్యుఁడాకస్మికంబుగ మాయమైన, గాఢాంధకారమునఁజిక్కి లోకమెట్లు తల్లడిల్లునో, అటులె నీవస్తమించుటచే నాడెందము ఆందోళనపడుచున్నది.

హేమా—దేవా! ఒక్కకబురు.

జయ—ఇదే వచ్చుచున్నాను. (దోమతెరలాగి తలుపుతీయును.)

హేమా—(ప్రవేశించి) దేవా! ఆవల ఘోరహత్యలు జరుగుచున్నవి. కేశవవర్మ, రాధాకాంతుఁడను ఒకవిదేశాపురవాస్తవ్యుని చంపివేసినాఁడు.

జయ—రాధాకాంతుఁడా చంపఁబడెను! కేశవుఁడో?

హేమా—కేశవునకు కాలుపిఱిగినది. కాని చావలేదు.

జయ—హా! దైవము దుర్మార్గులకే తోడుపడుచుండును.

మృణా—హా! అన్యాయముగా చంపఁబడితిని!

హేమా—అయ్యో! ఇదేమి? ఇక్కడఎవరు!

జయ—ఎవరా? ఏమో?

హేమా—(తెరలాగి) కటకటా! తల్లీ! మృణాళినీ! నీకా ఈదుర్దశ! అమ్మా!

ఒక్కమాట. నేను హేమాంగిని; చూడవా?

మృణా—నిష్కారణముగ చంపఁబడితిని.

హేమా—ఎవఁడా క్రూరాత్ముఁడు?

మృణా—ఎవరును కారు, నేనే. సెలవు, నా నాథునకు నాకుడివందనములని చెప్పుము. సెలవు. (ప్రాణములను విడుచును.)

జయ—హా! కులటా! చచ్చిపోవుచున్నపుడైన, నిజము చెప్పవైతివి. పో, నీకు నరకమే ప్రాప్తము. హేమాంగీ, దానిని నేనే చంపితిని.

హే.మా—హా! పాషాణహృదయా! కిరాతాధమా! ఆదేవి కల్లలాడునా?

జయ—అంకులాడి బొంకులకు పుట్టిల్లు కాదా?

హేమా—మోట వెధవను పెండ్లాడుట ఈమె తప్పుకాదా? ఈసాధ్వి అంకులాడియా? నీనోట గంధకమును కరఁగించి పోసినను పాపము పోవునా? నల నల క్రాఁగునూనెలో చచ్చువఱకు నిన్ను ముంచి ఎత్తుదున్నను నీతప్పు తప్పునే! ఓరా, కొండకోఁతీ! కోఁతికి కొబ్బరికాయ దొరకిన అందలి సారమనుభవింప నేర్చునా? కోడికి కందిగింజ విలువ తెలియును గాని రత్నము విలువ తెలియునా? కుక్కకు నేతిఅన్న మరుగునా? నీవంటి పంది బురదను మెచ్చునుగాని పన్నీటి కాలువను మెచ్చునా? మోట వానికి సుకుమారమగు మొఁగలిపూవు దొరకిన ఇటులే కదా చేయును! ఓరా, ఎలుఁగుగొడ్డా! నీవు వేయిరేండ్లు తలక్రిందుగా తప మాచరించినను, ఇట్టి భువనసుందరి నీకు లభించునా?

జయ—పోవే, పో; ప్రవర్తన మంచిది కానప్పుడు భువనసుందరి యైననేమి? చతుర్దశభువనసుందరి యైననేమి? గడ్డివరక కన్న నీరసంబని ఎఱుఁగవా? పాపము చేసెనేని కడిచేతియైన ఖండింపనగు. మగని విడనాడి లాతివానినికూడుట ఇల్లాలికి చెల్లునే? తగుదునని నన్ను నిందించుచున్నావు.

హేమా—హా! మానినీమణీ, మృణాళినీ!

సీ॥ పతిని దైవంబుగా భావించు ఈసాధ్వి
ఇట్టి పాపముచేయ నెట్టుకొనునె?
కన్నారఁ బెరవాని కనని ఈచిన్నారి
ఇట్టి పాపముచేయ నెట్టుకొనునె?
హాస్యానకేన్కల్ల లాడని ఈరామ
ఇట్టి పాపముచేయ నెట్టుకొనునె?
మనసారఁ బ్రేమించి నిను పెండ్లిఆడెగా;
ఇట్టి పాపముచేయ నెట్టుకొనునె?
తోడి నారుల కెన్నొ నీతులనుచెప్పు
నెలఁత ఇట్టి పాపముచేయ నెట్టుకొనునె?
పరమపావనచరిత ఈ భానురాంగి
ఇట్టి పాపము చేయుట వట్టిమాట.

జయ—ఓసీ, మందమతీ! ఆతొత్తు పరమపావన చరితయని నీవాని రారణము చేయుదానవు? నీవనినట్లు ఆమె సచ్చరిత్రయైన, ఆబ్రహ్మ నిరుపమాన సౌందర్యవతులగు దేవకాంతామణులతో స్వర్గలోకమును తెచ్చి నాముందుంచినను, ఆమెను పోనాడుదునే?

హేమా—ఔరా! మానవాకృతినున్న రాక్షసా! ఈసతీమతల్లి నిష్కళంకచరిత్ర అని ఆమె నిర్మలాననరాజమే సాక్ష్యమిచ్చుచుండ, ఱంకలాడి-అనుటకు నీనాలుక ఎట్లాడెరా!

జయ—అవును అవును. లంజ అను శ్రీకామదేవ మహామంత్ర బీజాక్షరంబు ఈమె ముఖముపై చక్కగా చెక్కఁబడి ఉండుట చేతనే ఱంకులాడి అని అన్నాను. మొదట విపరీత కామాంధుఁడనగు నాకు అది కనఁబడనందున మోసపోతిని.

హేమా—నిజముగా మోసపోతివి. విశుద్ధమగు అద్దమున చూచువాని రూప

మండలి మంచి చెడ్డలు స్పష్టముగా అగపడునట్లు, ఈపతివ్రతముఖదర్పణమున ప్రేక్షకులనైజతేజస్సులు వెల్లడగుచుండును. నీవంటిమూర్ఖుఁడు ఆదోషమును అద్దమునందే ఆరోపించి ధ్వంసము చేయును.

జయ—ఛీ! నోరుమూసికొని పొమ్ము, లేకున్న, నిన్నును దానిప్రక్క చేర్చెదను.

హేమా—పోరాపో! నీవెంత? నీశక్తి యెంత? ఓరా, కొండముచ్చా!

గీ. ముచ్చువలె వెళ్లి నిదురించు ముద్దరాలిఁ
బట్టి చంపినట్టి పిఱికి పంద ఏడ?
ధర్మమును గుఱించి తెగించి తగవులాడు
చాన ఏడ? ఆమెను బల్మిఁ చంపుటేడ?
వట్టిమాట; ఇంతకును దైవంబుఁ లేడె?

ఈపతివ్రత యెప్పుడు ఎవనితో పోయినదని ఎవఁడు చెప్పినాఁడు?

జయ—దాని వగకాఁడు కేశవుఁడని విశ్వాసపాత్రుఁడు హయగ్రీవుఁడు చెప్పినాడు.

హేమా—కేశవునితోనా? హయగ్రీవుఁడా చెప్పెను! హయగ్రీవుఁడా!

జయ—ఏమి అంత ఆశ్చర్యముగ అడుగుచున్నావు? అవును, హయగ్రీవుఁడే.

హేమా—నామగఁడా ఈఅపవాదు కల్పించెను!

జయ—అవును, నీమగఁడు, నామిత్రుఁడు, స్వామిభక్తిగల హయగ్రీవుఁడే.

హేమా—అతఁడే చెప్పిన, వానిశరీర మందంతట పెద్ద పెద్ద బొబ్బలు పుట్టి, పగిలి ఈఁగలకు చీమలకు ఆటపట్టగుఁగాక! మూర్ఖుఁడవగు నిన్ను పెండ్లాడుటే ఆమెచేసిన మహాపాపము. తత్ఫలము వెంటనే అనుభవించినది. పెద్దలు వద్దనిన పని చేసినవారు ఈరీతినే నశింతురు.

జయ—క॥ ఛీఛీ! జానినముండా! నాచెంగట జంకులేక నను నిందింపం!
జూచెదవా? మఱి ప్రేలితి! నా చూడ్కి ప్రేటునఁ దెగటార్చెద, పశువా!

భైరవి-చాపు

హేమా— ఏమి చేయఁగలవు న-న్నేమి చేయఁగలవురా? ఏమి॥
ఏమి చేయఁగలవురా- ఏదీ చేయర చూచెద.॥ఏమి॥

జయ—ఏమి చేయుదునా? నీకంఠము కూడ పిసికివేసెదను.

హేమా— బంగరుబొమ్మను మసి- పాతకట్టుకొనక దా
అంగనామణి నీపొం- దాశించుట అకటా! ॥ఏమి॥

జయ—ఓసీ, కుమతీ! హయగ్రీవుని భార్యవని ఇంత వఱకు ఓర్చితిని. లేకున్న, నీదుర్భాషలకు తగుకానుక నాఖడ్గము మీపాటికి ఇచ్చి ఉండును. ఇఁక సైఁచునది లేదు; భద్రము.

హేమా—ఔరా నరవ్యాఘ్రమా! నీబలశౌర్య పరాక్రమములు ఆఁడుపిల్లపై చూపినావు. చాలదా? ఇంకను నీకడుపునిండలేదా? స్త్రీలు ధర్మమునకు కట్టుపడి ఉన్నంత వఱకే మగబాండ్ర ఆటలు సాగును గాని వారికే కోపమువచ్చి సాహసించిన, ముక్కంటి యైన లెక్కించునే?

నీచేతఁ కత్తి ఉన్నచో- నాచేత గాజులున్నవి
రాచబిడ్డసాహసము- రారా రుచిచూపెద నీ॥ ఏమి॥

[హయగ్రీవుఁడు, లక్ష్మణవర్మ, మహేంద్రవర్మ ప్రవేశింతురు.]

లక్ష్మ—అయ్యా! జయదేవా! ఏమిసమాచారములు?

హేమా—వచ్చినారా? రండు, రండు. నాభర్త వచ్చెనా? ఆఁ, వచ్చెను. ఈ రాత్రి జరిగిన చావులన్నిటికి తామే కారకులైనట్లు నాకు తోఁచుచున్నది.

హయ—ఎవరికిష్టము వచ్చినట్లు వారు అనుకొనవచ్చును.

హేమా—మీకు పౌరుషమే ఉన్న, మగజన్మమే ఎత్తిన, ఈద్రోహిమాటలు ఎంతవఱకు సత్యమో చెప్పుఁడు. మీరు మృణాళినీ కేశవులకు దుస్సాంగత్యమున్నటుల వీనితో చెప్పితిరా? కన్నారఁ చూడక నిది ఇట్టినిందలు వేసి దంపతులను ఎడఁబాపు నీచబుద్ధి మీకు లేదని నా నిశ్చయము.

హాయ—నాకు తెలిసినది చెప్పితిని. అందు ఆయనకు సత్యమని తోఁచినంతవఱకు నమ్మెను.

హేమా—ఆమె ప్రవర్తనము మంచిదికాదని చెప్పినారా?

హాయ—చెప్పితిని.

హేమా—అది పచ్చిఅబద్ధముకాదా? దానికంటె నీచమగు అబద్ధము మఱొకటి కలదా? కేశవునితో పోయినదని చెప్పినారా?

హాయ—అవును, కేశవునితోనే. ఈగొడవ నీకెందుకు. పో, లోనికి పో.

హేమా—వెళ్లను. నాకు తెలిసినది చెప్పితీరెదను.

హాయ—ఛీ! నోరు మూసికొనుము.

హేమా—నేను నోరుమూసికొనవలెనా? మీరు నోటికివచ్చినట్లు కల్లలాడుచు ఆలుమగల ఇటుల వేరుచేయుచుందురా? సిగ్గులేదా? నీవు నావరివని చెప్పుటకు నాకు సిగ్గగుచున్నది. హా! చెలీ, ఈపాపాత్ముని పాడునాలుకకు నీవు బలిఅయితివా!

అందఱు—ఆఁ, ఏమి? మృణాళిని చంపఁబడినదా! (దగ్గఱకు వెళ్లుదురు.)

మహేం—హా! పుత్రికారత్నమా!

సీ. కొండవానికి నిన్ను కూర్చినబ్రహ్మకు
బుద్ధిచెప్పఁదలంచి పోయినావొ?
సన్మార్గులుండ, ఈ తోఁ స్థలి తగదని
సత్పథంబున కీవు సాగినావొ?
నినుఁబాసిపోయిన నీతండ్రిగారిని
వీక్షింప దివి కీవు వెళ్లినావొ?
గానకళానిధి వాణిచెంతను చేరి
వీణ నేర్చుకొనంగ వెడలినావొ?
వరుఁడు మోటవాఁడని భువి వదలినావొ?
పట్టినింద పైఁబడెనని గిట్టినావొ?

ఈవు నిర్దోసివని సాక్ష్యమిచ్చుకొఱకు
వేల్పులను తీసికొని రాఁగ వెళ్లినావా?

హేమా—హా! మోసము! మోసము!

హయ—ఛీ! వదరుఁబోతా! నోరుమూసికొని ఇంటికి పోయెదవా, పోవా?

హేమా—పతివాట పాటించుట సతికి విధియే, కాని, ఇట్టి అంశములందు మాత్రము కాదు. వరుఁడైననేమి? పరుఁడైననేమి? వాని దౌర్జన్యమును బయటపెట్టవలెను. మూడువంతులు నేనింటి మొగమును చూడ ననుకొనుచున్నాను.

జయ—అయ్యో! అయ్యో! అయ్యో! (పరుపుపై పడును.)

హేమా—నీయింటిని నీ చేతితో ముట్టించినాఁడు. నీవు మండునిప్పులపై పడి పొర్లినను, అధర్మస్వరూపిణి మహాపాతకుఁడవగు నిన్ను తిరిగి కన్నువిచ్చి చూచునా?

లక్ష్మి—జయదేవా! ఈమె ఏమినేరము చేసినదని ఇంత తెగువ చేసినావు?

జయ—ఏమి చెప్పుదును? అంతయు హయగ్రీవుఁడెఱుఁగును; ఈమెకును కేశవునకును రహస్యసంబంధము కలదని చెప్పెను. అతఁడొప్పుకొనెను. మఱి మొదట నేను ఈమెకిచ్చిన చేతిరుమాలు కేశవుని చేతిలో ఉండుట చూచితి.

హేమా—హా! దైవమా, ఆ చేతిరుమాలా ఇంత చేసినది!

హయ—ఓసీ, అంకెలాడి! మగవారిమధ్య ఇట్లు పురివిప్పుకొని ఆడుటకు సిగ్గులేదా? ఆఁడుదానవు కావా? పో. (త్రోసివేయును.)

హేమా—ఆఁడుదాననే; ముమ్మాటికి ఆఁడుదాననే. అధికారి చెంత చేరి సన్మార్గులపై కొండెములు కల్పించి చెప్పు నీవంటి నీతిమాలిన మాయగాండ్రును, అధములమాటలు నమ్మి నిద్రావస్థలోనుండు స్త్రీలను చంపు మీవంటి పిఱికిపందలును, లక్షమంది ఉన్నను లక్ష్యము చేయుదునా? గాలికంటె స్వేచ్ఛగా యథార్థస్థితిని తెలిపెదను.

హయ—వెళ్లవా? (పొడువఁబోవును.)

మహేం—(అడ్డుకొని) ఛీ! అబలమీఁద నా నీఆయుధము?

హేమా—ఓరా, ద్విపాదపశువా, జయదేవా! నీవు ఏరుమాలు కేశవుని చేతిలో చూచితినని చెప్పుచున్నావో అది కేనే, నీసతికి తెలియకుండ, దొంగిలించి ఈదుర్మార్గునకు ఇచ్చినాను.

హాయ—(తనలో) లంజా! కొంపతీసినావే! (పైకి) ఛీ! ఛీ! అబద్ధమాడకుము.

హేమా—నా ప్రమాణపూర్తిగా నిజమే చెప్పుచున్నాను. ఇతఁడు ప్రతిరోజును ఆరుమాలును ఏరీతినైన తెచ్చి తనకిమ్మని నన్ను బాధించుచుండెను. అది ఇంత చేయునని ఎఱుఁగక తీసి దాఁచి వీనికిచ్చితిని. పృణాళిని ఏపాపమును ఎఱుఁగదు.

జయ—ఈపరమనీచునిపై ఒకపిడుగైన పడకున్న దేమి? ఆఁ, స్వామిద్రోహీ! (హాయగ్రీవుని చంప పరుగెత్తును.)

హాయ—(హేమాంగిని పొడిచి పారిపోవును.)

హేమా—(నేలఁగూలును.)

లక్ష్మ, మహేం—ఓరా, దురాత్మా! నిలు నిలు. (వెంబడింతురు.)

హేమా—ఓజనార్దనా! నిర్దోషురాలగు నా చెలికడ నన్ను చేర్పుము. (ప్రాణములు విడుచును.)

జయ—హా! హతవిధీ! స్త్రీక్రియలు అసాధారణమాయాసమన్వితములు కదా! మదోద్ధతిచే విజృంభిగు దుర్వారారి కుంభికుంభస్థలంబులను చీల్చి, ఆఁకలిదప్పులకు చిక్కి పెక్కుకిడగండ్లుపడు వసుంధరారమణికి సంతృప్తిగ తన్మాంసరక్తంబులను విందుగుడిపి, రారాజుల మెప్పులందిన ఈ అసహాయశూరాగ్రేసరుని చిటికినవ్రేలు ఒంపలేని ఒకబానిసకొడుకు చేతిలో కీలుబొమ్మగ చేసితివా? సారసౌందర్య గానకళావిభవంబుల నీసతిని తలఁదన్ను నా సతిపెంపు తిలకించి ఓర్వలేక, ఘోరాపనిందాసిని ఉవ్విళ్ళ నీపాట్లపెట్టికొంటివా? ఓప్రాణేశ్వరీ! ఇంకెక్కడి ప్రాణేశ్వరి? పోయినది నాతాలినోముపంట- నా అమందభాగ్యమును చాటుకొంచు

గంట- నాప్రాణవాయువులున్న బంగరుబరణి- నా సంసారసాగరతరణి- నాసచివశిరోమణి- నామనోవిచారాంధకారద్యుమణి- నాపెన్నిధానము- నాకుడిభుజము- ననువిడనాడిపోయినది. హా! సతీతిలకమా! (పైఁబడి)

సీ. ఇలుచేరుటరవంత తడవైన నీ దెస-
నల్లడల్ కనుచుండు నాతిమిన్న!
వచ్చెదునను కాంచి వడిఁ చిఱునవ్వుతో
వచ్చి ఎదుర్కొను భానురాంగి!
ఊరఁ నే లేకున్న నారూపుచూపును
చేఁ దాల్చి అల్లాడు చెలువమిన్న!
సర్వవిధంబుల సౌఖ్యడోలికలందు
నన్నుంచి ఊఁచిన వన్నెలాడి!
నాదుకనుసన్నల మెలంగు సాధుశీల!
ఎపుడు నామాట దాటని యిందువదన!
నేఁటితో తీఱెనా మనస్నేహ మెల్ల;
ప్రాణపదమా! మృణాళిని! పలుక వేమి?.

రాజవైద్యులను తీసికొనివచ్చిన దివ్యౌషధము లిచ్చి బ్రతికింతురేమో! ముఖకళ అంతగా తగ్గలేదు. ప్రాణ మింకను ఉన్నదేమో? (ముక్కుపై చేయివేసి) వట్టిది; శ్వాస పోయినది. అయ్యో! అయ్యో! ఓపరిపూర్ణశరదిందువదనా- ఓవికసితోత్పలనయనా- ఓసమదరాజహంసగమనా- ఓసుమనోమనోజ్ఞకుందరదనా! నేఁటితో మనఋణము తీఱెనా? మన దాంపత్యబంధము తెగెనా? ఓకులలేని కపురంపుపలుకా! అపవాదను సుడిగాలిలో చిక్కి- హరించి పోతివా? ఓసుందరీ! నీగడ్డము పట్టుకొనెదను. నన్నొకసారి కనువిచ్చి చూడవే. అలుక చాలింపవే; నామనవి ఆలింపవే.

నీ కాళ్లు పట్టుకొనెదను; ఈ దాసుని తప్పు మన్నింపవే. దయచూపి నన్నా దరింపవే. నీపై నిలేనిపోని కొండెములు చెప్పిన ఆకుటిలాత్ముఁడు కైలాసగిరీశ నిస్తంత్ర నిటలనయనాగారంబున దాఁగుకొనినను, సిగపట్టి ఈడ్చి తెచ్చి నీముందుపెట్టి [illegible] గతిలోఁ చిత్రవధ చేసి నిన్ను మోదపరయోనిధిని తేల్చెదనే. పగని విస్రి[illegible]నట పతివ్రతకు తగదే... లేవే... రావే. నన్నుకూడ నీ వెంటఁగొనిపోవే.....కటకటా! నీయెముక కైనలేని కాఠిన్యము నీచిత్తము నకెట్లువచ్చెనే? ఛీ! నీవు పోయినతరువాత నేనెందుకు? ఎవరిని ఉద్ధరింపవలె? ఎవరు చూచిన సంతోషింపవలె? ఓ శ్రితజనచింతామణీ, మానినీశిరోమణీ, మృణాళినీ! ఇదిగో నేనుకూడ నీవెంటనే వచ్చుచున్నాను. కడసారి ముద్దొకటి ఇమ్ము. (ముద్దాడి) ఓమానవులారా! కన్నులార చూడకుండ ఎవరిమీఁదఁనుకూడ అంకుతనముగాని దొంగతనముగాని మోపకుఁడు. చెప్పుడుమాటలను నమ్మకుఁడు, నమ్మకుఁడు. నావలె మోసపోకుఁడు, చెడిపోకుఁడు. ఓ అనురాగతరంగిణీ, మృణాళినీ! మందభాగ్యుఁడ. మందమతినై నిన్ను చంపుకొని, పశ్చాత్తపపడి, నీకరుణాతరంగములలోల ఇదే వచ్చుచున్నాఁడ. (పొడుచుకొని చనిపోవును.)

సమాప్తము.